అపరాధ పరిశోధన

రు.7.50 | మార్చి '88 |



Blank Page

సంపుటి: 46
సంచిక : 2

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

శాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

మార్చి, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-234

[ఫలితాలు]

జనవరి '88 నెల "అపరాధ పరిశోధన పోటీ-234" కి సరియైన సమాధానాలు:

1. చంద్రబాబు నాయుడు.
2. ఇండియా.
3. మంచినీటి కొరత.
4. వాతావరణ కాలుష్యం.
5. దర్యాప్తు సంఘాలు.

పై జవాబుల ప్రకారం ఒక్కరు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి గ్రహీత:—

డాక్టర్ ఎమ్.ఎ. నజీర్,
సిద్దీక హాస్పిటల్,
గణపతిరావు రోడ్డు,
విజయవాడ - 520 001.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. కిరాయి హంతకుడు—వసుంధర
21. అమ్మకాని కో అమ్మాయి—సరసి
31. ఫాలనేత్రం (సీరియల్)—వి.యస్. రావ్
71. జానిస—జొన్నలగడ్డ రామలక్ష్మి
89. విచక్షణ—ఫణిబాబు
98. అదృష్టవంతుడు—వసుంధర
118. మోసపోయిన మోసగాడు—రాచకొండ దశరథరామయ్య
135. అనాధ ప్రేతాలు—కె. వి. యస్. ఎన్. మూర్తి
151. మిస్ మిస్టరీ (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. తిరుగులేని మందు—వి. యస్. రావ్
72. సుబ్బారావు బావ—వసుంధర
113. రెడ్ బాక్స్—సుంకరి రాంప్రసాద్
136. ఎడారి కోయిల (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు
153. రాక్షసవేట (సీరియల్)—వాణిశ్రీ

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

కిరాయి హంతకుడు

వసుంధర



"నమస్కారమండి—" అన్నాడు జగ్గు.

పురుషోత్తం పేపరు చదువుతున్నవాడల్లా తలెత్తి చూశాడు. ఆయన కళ్ళలో ప్రశ్నార్థకం!

"నాపేరు జగ్గు...." అన్నాడు జగ్గు.

పురుషోత్తం కళ్ళలో ప్రశ్నార్థకం మాయం కాలేదు.

"విశాఖపట్నంలో ఏ పెద్దమనిషి నడిగినా నా గురించి చెబుతాడండి. నేను కిరాయి హంతకుణ్ణి" అన్నాడు జగ్గు.

పురుషోత్తం కళ్ళలో ప్రశ్నార్థకం మాయమై ఆశ్చర్యార్థకం వెలసింది. అప్పుడాయన పెదవివిప్పి — "నాతో నీకేం పని?" అన్నాడు.

"మీరూ భూషయ్యగారూ గొడవపడ్డారని విన్నాను."

"అయితే?"

"భూషయ్యగారు మీకో పెద్ద అడ్డుగా వున్నారని విన్నాను...."

"ఊఁ"

"నేను కిరాయి హంతకుణ్ణి...."

పురుషోత్తం భ్రుకుటి ముడతలు పడింది. జగ్గును కాసేపాగమనీ తానాలోచించుకోవాలనీ ఆయన కళ్ళు చెప్పాయి. ఆ భాష జగ్గు కర్థమయింది.

పురుషోత్తం ఆలోచిస్తున్నాడు.

భూషయ్య సామాన్యుడు కాదు. తన ఆయుః పట్టుమీద దెబ్బతీశాడు.

పురుషోత్తానికా ఊళ్ళో రెండు థియేటర్లు. ఓ రైసు మిల్లు, హోటలు, డిపార్టుమెంటల్ స్టోరు ఉన్నాయి. ఇవి కాక ఆయన తన పేరున ఉన్న ఓ పెద్ద ప్లాటులో మిడిల్ ఇన్‌కం గ్రూపు ప్లాట్సు కట్టాలనుకుంటున్నాడు. దాంతో ఆయనకు కనకవర్షం కురుస్తుంది.

ప్లాట్సు కంట్రాక్టు భూషయ్యకు వెళ్ళాలి. కానీ అంతకు ముందు భూషయ్య కట్టిన రెండు ప్లాట్సు కూలిపోయి అతడికి చెడ్డపేరు, బోలెడు నష్టం వచ్చాయి. ఆ నష్టాన్నీ కంట్రాక్టులో పూడ్చుకోవాలని భూషయ్యనుకున్నాడు.

ఖరీదు కాస్త ఎక్కువైనా తన కట్టడాలు పటిష్టంగా ఉండాలని పురుషోత్తం కోరుకుంటున్నాడు. అందుకని అతడా కంట్రాక్టును భూషయ్యకాక —దేశవ్యాప్తంగా

పేరున్న నర్లీకర్ కంపెనీ కివ్వాలనుకున్నాడు. అతడు నర్లీకర్ కంపెనీకి కాంట్రాక్టు నిస్తాడని తెలియగానే — ఫ్లాట్సుకు మంచి రెస్పాన్సు వచ్చింది.

భూషయ్య పురుషోత్తాన్ని కలిసి—"మనం మనం ఒకూ్కరివాళ్ళం. ఎక్కడో నర్లీకర్ కంపెనీ మన లాభాలన్నీ పట్టుకుపోకూడదు. కాంట్రాక్టు నాకే యివ్వు. పకడ్బందీగా అన్నీ కడతానని హామీ యిస్తున్నాను—" అన్నాడు. పురుషోత్తం అంగీకరించలేదు.

భూషయ్య పురుషోత్తాన్ని డబ్బుతో కొనాలనిచూశాడు. పనికాలేదు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చాడు.

పురుషోత్తం రెండింటికీ తట్టుకున్నాడు.

అప్పుడు భూషయ్య పురుషోత్తం ఆయువు పట్టు పట్టాడు.

పురుషోత్తం హోటళ్ళు, డిపార్టుమెంటల్ స్టోర్సు, థియేటర్సు, ప్రస్తుతం ఫ్లాట్సు కట్టాలనుకుంటున్న స్థలం — అన్నీకూడా ఒకే వ్యక్తినుంచి కొన్నాడు. ఆ వ్యక్తిపేరు ఆచారి.

ఆచారిది వడ్డీవ్యాపారం. తాకట్టుమీద వస్తువులుంచుకొని వడ్డీకి అప్పులిస్తూంటాడు. బలహీన వర్గాలకు ప్రభుత్వం ఆ ఊళ్ళో కొన్ని స్థలాలు మంజూరు చేసింది. ఆ విధంగా మొత్తం యాభైమందికి ఊళ్ళో స్థలాలు వచ్చాయి. అయితే ఆ బలహీనవర్గాల వాళ్ళకు నగరంతో సంబంధంలేదు. ఆచారి ప్రోత్సాహంతో వాళ్ళు అప్లికేషన్సు పెట్టారు.

ఆ స్థలాలను ఆచారి తాకట్టు పెట్టుకుని వాళ్ళకు కొంత డబ్బిచ్చాడు. ఆ డబ్బుతో వాళ్ళందరూ సమిష్టిగా పొలం కొనుక్కుని వ్యవసాయం చేసుకుంటూ పల్లెటూళ్ళో జీవిస్తున్నారు. ఆచారి తను నడ్డుపెట్టుకుని—తనకి చ్చిందానికి

నూరురెట్లు ప్రతిఫలం పొందుతున్నాడని వారికి తెలియదు. కొంతకాలం గడిచేక తాకట్టు డబ్బుకు వడ్డీ బాగా పెరిగిపోయిందని స్వల్పంగా కాంపెన్సేషనిచ్చి ఆ స్థలాలు తన పేరున రాయించుకున్నాడాచారి. కాంపెన్సేషనుకే ఎంతో సంతోషపడ్డారు పుచ్చుకున్నవాళ్ళు.

ఆ స్థలాల్లోంచే ఆచారి కొన్ని పురుషోత్తానికి అమ్మాడు. ఆ స్థలాల పేరు చెప్పి పురుషోత్తంకూడా లక్షల్లో లాభాలు అర్జిస్తున్నాడు.

ఇప్పుడు భూషయ్య ఉన్నట్లుండి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే వాడయ్యాడు. బలహీన వర్గాలకు జరిగిన అన్యాయానికి అతడి కడుపు తరుక్కుపోతోంది. గుండె మండి పోతోంది.

బలహీన వర్గాల నాయకుడు ఆదెయ్యకీ భూషయ్యకీ బాగా దూరపు బంధుత్వముంది. భూషయ్య ఆర్థికంగా బాగుపడ్డాక తన బంధువులను బంధువులని చెప్పుకోవడం కూడా మానేశాడు. కానీ యిప్పుడతడు ఆదెయ్యతో బావా అంటూ వరసకలిపి జరిగిన ద్రోహమంతా చెప్పి— "కోర్టుకు వెడితే లక్షల్లో కలిసొస్తుంది మీకు. ఆచారి మిమ్మల్ని దారుణంగా మోసంచేశాడు" అన్నాడు.

ఆదెయ్య ముందు భయపడ్డాడు కానీ భూషయ్య ధైర్యంతో చివరికతడంగీకరించాడు — ఫలితంగా ఆచారికీ, పురుషోత్తానికీ కూడా లాయరు నోటీసులందాయి.

ఇప్పుడు సమస్య ఆచారిదీ, పురుషోత్తానిదీ కూడా!

ఆచారికి జైలు సమస్య — పురుషోత్తానికి ధన నష్టం సమస్య!

ఆచారిమీద కోర్టులో నెగ్గడం — అంత సులభం కాదు. అందులోనూ ఆదెయ్యవంటి అణాకానీ మనుషులకసలే

సాధ్యంకాదు. కానీ ఆదెయ్యకు భూషయ్య అండ ఉంది.

ఆచారి, పురుషోత్తం లాయర్ని సంప్రదించారు. లాయరు కేసు పూర్వాపరాలు పూర్తిగా విచారించేక— "చట్టం ప్రకారం మీ కేసు కొంతవరకూ నిలబడవచ్చు. కానీ యిందులో రాజకీయపు జోక్యం వచ్చే ప్రమాదం ఉంది. అప్పుడు తట్టుకోవడం కష్టం" అన్నాడు.

ఇది బలహీనవర్గాలకు జరిగిన అన్యాయం. ఇటు ప్రభుత్వం, అటు ప్రతిపక్షం - రెండూ కూడా ఈ కేసులో ఆదెయ్యనే సపోర్టు చేస్తాయి.

ఆచారి ఆదెయ్యను మోసం చేశాడు. రాజకీయవాదుల మద్దతు ఉంటే - ఆ మోసం అతి సులభంగా బయట పడుతుంది.

లాయరు చెప్పింది విని పురుషోత్తం రాజకీయ వాదుల మద్దతు కోసం చూశాడు. ప్రభుత్వ పక్షం నుంచి ఓ ఎమ్మెల్యే అతడి కన్నివిధాలా సాయపడతానని మాటి చ్చాడు. ఆ ఎమ్మెల్యే ఆదెయ్యను కలుసుకుని మంచి మాటలతో నచ్చజెప్పబోయాడు. కానీ అప్పటికే రంగంలో ఓ ప్రతిపక్షం ఎమ్మెల్యే దిగాడు.

ప్రభుత్వపక్షం ఎమ్మెల్యే పురుషోత్తాన్ని కలుసుకుని "ప్రతి పక్షం ఎమ్మెల్యేల జోక్య మున్నప్పుడు ఇలాంటి వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకోను. నా పరువు పేపర్ల కెక్కితే ముందు ముందు మంత్రయ్యే మాటటుంచి- మళ్ళీ ఎలక్షన్లకు ఎమ్మెల్యే టికెట్ కూడా దొరకదు. నువ్వు ముందు ప్రతిపక్షం ఎమ్మెల్యేతో రాజీ పడు" అన్నాడు.

పురుషోత్తం ప్రతిపక్ష ఎమ్మెల్యేను కలుసుకున్నాడు. భూషయ్య అతడికే ఆశ పెట్టాడో కానీ ఆ ఎమ్మెల్యే పురు

షోత్తాన్ని ఖాతరు చేయలేదు. భూషయ్యతో రాజీకి వస్తే తను రాజీకి వస్తానన్నాడు.

ఆదెయ్యకు సంబంధించినంతవరకూ అతడు చదరంగంలో పావు. అతడి గురించి ఎవరయినా అంతే ఆలోచిస్తున్నారు.

పురుషోత్తం మరోసారి ఆదెయ్యను కలుసుకుని - "కోర్టుల చుట్టూ తిరగటంవల్ల నాకు లక్షల్లో నష్టం వస్తుంది. అది నేను తట్టుకోగలను. నీకు జీవితం దుర్భరమవుతుంది. నీ యిల్లు బూడిదవుతుంది. నీ పంట నీకు అందదు. ఈ బాధలన్నీ నీ కెందుకు! కేసు ఉపసంహరించుకో - నేను నీ క్షేమం చూస్తాను" అన్నాడు.

ఆదెయ్య వెంటనే - "అయ్యా! తమరు పెద్దలు. నాకు ప్రస్తుతం జీవితం సుఖంగానే వెళ్ళిపోతోంది. ఉన్నదానితో నాకు తృప్తిగా కూడా ఉంది. పెద్దోళ్ళతో గొడవలు నా కిష్టముండవు. కానీ ఏం చేసేది? నా క్షేమం చూస్తానంటూనే తమరు నన్ను బెదిరించారు. అలాగే ఇంకో పెద్దమనిషీ నన్ను బెదిరించాడు. ఎవరూ బెదిరించకపోతే నా మానాన నేను బ్రతుకుతాను. ఇద్దరు రెండు రకాల బెదిరిస్తూంటే - ఎవరివల్ల నా కెక్కువ లాభమో వారి మాట వింటాను. ఇంతకు మించి నేనేమీ చెప్పలేను. తమరి మీద మాత్రం నాకు పగలేదు...." అన్నాడు.

కథకు మూల కారణం భూషయ్యేనని అర్థమైపోయింది పురుషోత్తానికి. ఆ భూషయ్య చస్తే అన్ని సమస్యలూ తొలగిపోతాయి.

పురుషోత్తం భూషయ్యను చంపించాలనుకుంటున్నాడు కానీ ఆ విషయ మతడి ఆంతరంగికుల కూడా తెలి

యదు.

మరి జగ్గు కెలా తెలిసింది?

పురుషోత్తం ఆలోచనల్లోంచి బయటపడి జగ్గు వంక చూశాడు. ఆయన కళ్ళల్లో ప్రశ్నార్థకం చదివిన జగ్గు చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో ఆయన ప్రశ్నకు సమాధానం కనబడింది.

"నిన్నెవరు పంపారు?" అన్నాడు పురుషోత్తం.

"నాకయి నేనే వచ్చాను...."

"నాకూ భూషయ్యకూ గొడవలున్నాయని నీ కెవరు చెప్పారు?"

"ఒకరు చెప్పేదేంటి బాబూ - లేడి వాసన పులికి తెలుస్తుంది. బేరమున్న చోటికి నేనే వెతుక్కుంటూ వెడతాను. ఇలాంటి బేరాలకోసమే కదా ఏడాదంతా ఎదురు చూస్తూంటా న్నేను...." అన్నాడు జగ్గు.

"భూషయ్యను చంపడం తేలిక కాదు...." సాలోచనగా అన్నాడు పురుషోత్తం.

"అదేంటి బాబూ - ఆ మాట నేననాలి. పని చేయడంలోని కష్టాల్ని యజమానే ముందుగా గుర్తిస్తే - నా రేటు పెరుగుతుంది...."

"ఎంత నీ రేటు?"

"యాభయి వేలు...."

"ఓ మనిషి ప్రాణాలు తీయడానికి యాభయి వేలా?"

"రోడ్డు పక్కన అమ్మితే రూపాయ చేసే బొమ్మ - షాపులో అద్దాల మధ్య కూర్చుంటే పదో పాతికో అవుతుంది. రోడ్డు పక్కన బడ్డీకొట్లో టీ కలిపే ఆడదాని జీతం రోజు కయిదు రూపాయలు. దానికే సినిమా ఛాన్స తగిలితే - డాన్సకి లక్ష రూపాయలు - తమకు తెలియం

దేముంది? భూషయ్య ఏ రిక్షావాడో అయితే అయిదువేలకే చంపేద్దును. అసలీ యాభయి వేలయినా కన్సెషన్ రేటు. భూషయ్యను చంపడం నాకూ యిష్టమే కాబట్టి - కాస్త తక్కువ కొప్పుకుంటున్నాను...."

"భూషయ్యను చంపడం నీకెందు కిష్టం?"

"మాంసం తినేవాళ్ళలో కొందరికి మేక మాంసం ఇష్టం. కొందరికి కోడిమాంసం ఇష్టం....ఏం చెబుతాను బాబూ - భూషయ్యబాబు చూడ్డానికి ఎత్తుగా బలంగా బాగుంటాడు. చంపే చేతులకు నిండుగా ఉంటాడు."

"భూషయ్యతో నీకు పరిచయముందా?"

"ఎందుకు లేదు బాబూ! ఆ మధ్య విశాఖపట్నం వచ్చినపుడు నన్ను కలిసి చౌకలో మర్దరు చేయించుకున్నాడు. అప్పుడే నాకా బాబును కూడా చంపాలని మనసు పుట్టింది...."

"భూషయ్యను చంపి నువ్వు పట్టుబడితే?"

"మీ పేరు మాత్రం బయటకు రాదు....అయినా అది నేను పట్టుబడ్డప్పటి మాట కదా! పదేళ్ళ నుంచి కిరాయి హంతకుడుగా ఉంటున్నాను. ఇంతవరకు పట్టుబడలేదు. నేను చంపినవాళ్ళలో భూషయ్యకంటె పెద్దోళ్ళూ ఉన్నారు ఆదెయ్యకంటె చిన్నోళ్ళూ ఉన్నారు."

"నీ మాటలు నమ్మతగ్గవేనా?"

"తమరు పెద్దోళ్ళు. నిజానిజాలు తెలుసుకుందుకు తమ పద్ధతులు తమకుంటాయి. నేనీ ఊళ్ళో ఇంకో రెండు రోజు లుంటాను వెళ్ళేలోగా ఈ బేరం సెటిల్ చేసుకుని పని పూర్తిచేసుకుని పోవాలని నా కోరిక. అవపయిన మీ అదృష్టం, నా అదృష్టం. వెళ్ళేముందు తమకింకోసారి కనిపిస్తాను...." అని వెళ్ళిపోయాడు జగ్గు.

2

పురుషోత్తం చేతిలో కార్లున్నాయి. ఫోన్లున్నాయి, మనుషులున్నారు. ఒక్క రోజులో ఆయన జగ్గు గురించి చాలా సమాచారం సేకరించాడు.

జగ్గుది విశాఖపట్నం. కిరాయిహంతకుడిగా అతడికి పెట్టింది పేరు. హత్యలు చేయడానికతడు హైదరాబాదు, బొంబాయి, ఢిల్లీ కూడా వెళ్ళాడు. ఒక్కసారి కూడా అతడు అరెస్టు కాలేదు. వార్తాపత్రికల్లో కూడా అతడికి వ్యతిరేకంగా వచ్చిన వ్రాతలు తక్కువ.

జగ్గులో విశేషమేమంటే - అతడు నీతి తప్పి చరిస్తున్నా చట్టం పరిధిలోనే చేస్తున్నాడు. అతడు తప్పతాగి నడి రోడ్డు మీద సంచరించడు. ఎవరితోటీ పరుషంగా మాట్లాడడు. చేసే హత్యలు గోప్యంగా - చెవులే కానీ కళ్ళు లేని న్యాయదేవతకు హతుడి ఘోష వినపడని పద్ధతిలో చేస్తాడు.

హత్యలు చేయడం అతడి వృత్తి. సమాజంలో ఉంటూ అతడు భక్తి శ్రద్ధలతో తన వృత్తిని కొనసాగిస్తున్నాడు.

జగ్గు భూషయ్యను చంపితే - పురుషోత్తానికి వచ్చే లాభం ఇంతా అంతా కాదు. పురుషోత్తం జగ్గుకి యాభై వేలు కాదు - అయిదు లక్ష లిచ్చినా నష్టం లేదు - పురుషోత్తం పేరు బయటకు రాని పక్షంలో.

పురుషోత్తానిక జగ్గును ఉపయోగించుకోవాలనే ఉంది. కానీ ఒక్కటే ఆయనకు భయం.

జగ్గును ఎవరు పంపారు? తనకూ భూషయ్యకూ ఉన్న తగవు కారణంగా తను భూషయ్యను చంపించాలనుకుంటున్నట్లు జగ్గు కెలా తెలిసింది?

తన ప్రత్యర్థి భూషయ్య. అతడు సామాన్యుడు కాడు. అనుకున్నది సాధించడం కోసం ఏమైనా చేయగలడు. నక్కజిత్తుల్లో అతడి కతడే సాటి.

జగ్గును అతడే తన వద్దకు పంపాడా? తమ సంభాషణను రహస్యంగా టేప్ చేయించి - తన ప్రాణాలకు రక్షణ కల్పించుకోవాలనుకుంటున్నాడా?

తనకూ భూషయ్యకూ పూర్వపరిచయముందని జగ్గు చెప్పనే చెప్పాడు! ఇప్పుడు తనేం చేయాలి?

భూషయ్య పీడ వదిలించుకునేటందుకు జగ్గు ఒక అద్భుతావకాశం. ఇలాంటి అవకాశం తనకు మళ్ళీ రాదు. కానీ యిది తనను ట్రాప్ చేయడానికే అయితే!

జగ్గు తన్ను వెతుక్కుంటూ రావడమే ఒక విశేషం.... అదే అనుమానించతగ్గ విషయం కూడా!

జగ్గు వెళ్ళి ఇంకా ఇరవయి నాలుగు గంటలయినా కాకుండా పురుషోత్తం అనుమానానికి కొంత సమాధానం లభించింది

భూషయ్యకు కాంట్రాక్టుల్లో సహాయపడే రమణరావు అతడితో వేగలేక విడిపోయి వేరే వ్యాపారం ప్రారంభించాడు. భూషయ్య అతడిపై పగబట్టి - అతడి వ్యాపారానికి అడుగడుగునా అడ్డు తగులుతున్నాడు. రమణరావుకు విషమపరిస్థితి ఏర్పడింది - తిరిగి భూషయ్యతో నయినా కలవాలి - లేదా వ్యాపారం మానుకోవాలి.

పురుషోత్తాన్ని కలుసుకునే ముందు జగ్గు రమణరావుని కలుసుకున్నాడు. తను భూషయ్యను చంపుతాననీ - యాభయి వేలు కావాలనీ అడిగాడు. రమణరావుకు జగ్గు పద్ధతి నచ్చింది. కానీ అతడు హత్యకు పాతికవేలు మించి ఇవ్వలేనని చెప్పాడు. జగ్గు నిరాకరించి వెళ్ళిపోయాడు.

జగ్గు వెళ్ళిపోయాక రమణరావు బాగా ఆలోచించాడు. భూషయ్య చ పోతే తన సమస్యలకు పరిష్కారం లభి స్తుంది. తనకు యాభయివేలిచ్చుకోగల స్తోమత లేదు. అలాంటప్పుడేం చేయాలి?

భూషయ్యవల్ల చాలామంది ఇబ్బంది పడుతున్నారు. అతణ్ని చంపాలని చాలామందికుంటుంది. అలాంటి కొందరు కలిసి యాభయివేలు పోగుచేసి జగ్గుకిస్తే ఖర్చు తగ్గుతుంది - పనీ అవుతుంది.

భూషయ్యతో శత్రుత్వం కారణంగా రమణరావుకీ, పురుషోత్తానికీ కొంత స్నేహం కలిగింది. అది పురస్క రించుకుని రమణరావు పురుషోత్తాన్ని కలుసుకుని విషయం వివరంగా చెప్పాడు.

"తన శత్రువుల పన్నాగం తెలుసుకునేందు కిది భూషయ్య పన్నిన పన్నాగం కాదుగదా!" అన్నాడు పురు షోత్తం.

"కాదని నా నమ్మకం...."

ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్నాక తన వాటా పాతిక వేలూ పురుషోత్తం వద్ద వదిలి వెళ్ళడానికి రమణరావు అంగీకరించాడు.

ఇది పురుషోత్తానికి సంతృప్తిని కలిగించింది.

ఈ డబ్బును తను జగ్గుకు అడ్వాన్సుగా ఇవ్వచ్చు. ఇది తన డబ్బు కాదు కాబట్టి - ఈ కేసులో తను ట్రాప్ కాడు.

రమణరావు వెళ్ళిపోయిన - ఆరు గంటలకు జగ్గు వచ్చి పురుషోత్తాన్ని కలుసుకుని - "మీ నిర్ణయ మేమిటి? ఈ ఊళ్ళో నేనిక కొన్ని గంటలు మాత్రమే ఉంటాను" అన్నాడు.

"నీకు యాభయివేలూ యివ్వడానికి నిశ్చయించు కున్నాను. అడ్వాన్సుగా పాతిక వేలిస్తాను. మిగతా పాతికా- పని పూర్తయ్యాక...."

"సరే....కానీ పాతిక కాదు - యాభై ...."

"అంటే....?"

"రమణరావు మిమ్మల్ని కలుసుకుని పాతిక వేలిచ్చా డని నాకు తెలుసు. భూషయ్యను చంపడానికది అతడి వాటా మాత్రమే. మీరిచ్చే యాభయిలో ఒక్క పయిసా కూడా తగ్గదు. మొత్తం డెభ్భైఅయిదువేలూ ఇచ్చే మాటయితేనే - నేనిందుకు ఒప్పుకుంటాను...."

పురుషోత్తం ఆశ్చర్యంగా - "యూ ఆర్ వెరీ స్మార్ట్!" అన్నాడు.

పురుషోత్తం అతడికి పాతికవేలూ యిచ్చి—"పని పూర్తికాగానే మిగతాది ..." అన్నాడు.

"యాభై వేలూ సిద్ధంగా ఉంచండి. రేపురాత్రికే వచ్చి తీసుకుంటాను" అన్నాడు జగ్గు.

3

వాహనాలాట్టే తిరిగే రోడ్డుకాదది. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆ రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

భూషయ్య సాధారణంగా ఆ రోడ్డుమీంచే వెడతాడు. కారులో వెనకసీట్లో అతడున్నాడు. ముందుసీట్లో డ్రైవ రున్నాడు.

భూషయ్య దేనిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్లుండి కారాగడంతో అతడికి ఆలోచనాభంగము అయింది.

"ఏమయింది?"

"సార్ — రోడ్డుకడ్డంగా బండరాళ్ళున్నాయి...."

అన్నాడు డ్రైవరు వినయంగా.

భూషయ్య అనుమానంగా డోరు తెరుచుకుని కారు దిగాడు.

అప్పుడు చెట్టు పక్కలోంచి చటుక్కున వచ్చాడు జగ్గు - భూషయ్య అతణ్ణిచూసి ఆశ్చర్యపడి ఏదో అన బోయేలోగా—"భూషయ్యా; నేను జగ్గుని" అన్నాడు.

అప్పటికి డ్రైవరు కూడా కారు దిగాడు. జగ్గుని చూడ గానే అతడికనుమానం వచ్చింది.

జగ్గు భూషయ్యని సమీపించాడు. డ్రైవరుగురించసల తడు పట్టించుకోనేలేదు.

"ఏం కావాలి నీకు?" అన్నాడు భూషయ్య.

"నీ ప్రాణాలు...." అంటూ జగ్గు బొడ్లోంచి కత్తి తీశాడు. అడుగున్నర పొడవున్న ఆ కత్తి పదును మెరుపులో కనబడుతోంది.

ఈలోగా డ్రైవరు పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వెనుకనుంచి జగ్గును సమీపించాడు. జగ్గు చేతి మీద దెబ్బతీసి కత్తిని పడగొట్టాలని అతడి సంకల్పం.

భూషయ్య ఓరకంట డ్రైవర్ని గమనిస్తూ భయంగా జగ్గు చేతిలోని కత్తినే చూస్తున్నాడు.

డ్రైవర్ చేయి గాల్లోకి లేచేలోగా జగ్గు కాలు వెనక్కు లేచింది.

డ్రైవర్ మూడు పల్టీలు కొట్టాడు.

అప్పుడు జగ్గు భూషయ్యను ఛాతీలో, కడుపులో వరుసగా మూడుపోట్లు పొడిచాడు.

చివ్వున చిమ్మింది రక్తం.

కెవ్వుమన్న భూషయ్య ఆర్తనాదం గాల్లో కలిసి

పోయింది.

భూషయ్య నేలకూలిపోయాడు. నేల కూలుతూనే భూషయ్య ప్రాణాలు పోయాయి.

అప్పటికి డ్రైవరు లేచి నిలబడ్డాడు.

చేతిలో కత్తితో అతడివైపు తిరిగాడు జగ్గు.

డ్రైవర్ కాళ్ళలో వణుకు.

"నువ్వు నన్ను చూడలేదు" అన్నాడు జగ్గు.

డ్రైవర్ మాట్లాడలేదు.

"నువ్వు నన్ను చూడలేదు" రెట్టించాడు జగ్గు.

"నేను నిన్ను చూడలేదు" అన్నాడు డ్రైవర్.

"నువ్వు నన్ను చూడనంతకాలం నీకే ప్రమాదంలేదు. భయపడకు" అన్నాడు జగ్గు.

అతడి మాటలు డ్రైవర్ని మరింతగా భయపెట్టాయి.

"పోలీసులడిగితే జరిగింది జరిగినట్లు చెప్పు. కానీ నువ్వు నా మొహం మాత్రం చూడలేదు. గుర్తుంచుకో.."

"గుర్తుంచుకుంటాను. ఇలాంటి కేసుల్లో పోలీసులు నావంటివాళ్ళనే అనుమానిస్తారు."

"పారిపోడానికి ప్రయత్నించకు జరిగింది జరిగినట్లు చెప్పుకో. నీ నిజాయితీ నిన్ను రక్షించగలదు...."

"నేను నిన్ను చూడలేదు" అన్నాడు డ్రైవర్ తన నిజాయితీ నతడికి గుర్తుచేస్తూ.

జగ్గు నవ్వి వెళ్ళిపోయాడక్కణ్ణించి.

4

"హలో!" అన్నాడు పురుషోత్తం.

"నేను రమణరావుని—మాట్లాడుతున్నాను...."

"ఏమిటి విశేషం?"

"చాలా పెద్ద విశేషం—భూషయ్య హత్యచేయబడ్డాడు. డేర్‌డెవిల్ మర్డర్...."

"నిజంగా" అన్నాడు పురుషోత్తం. ఆయన గొంతులో కానీ కళ్ళలో కానీ ఆశ్చర్యం లేదు. మనిషి నిలువెల్లా సంతోషంతో పరవశించిపోతున్నాడు.

"నిజం...." అంటూ రమణరావు హత్యగురించి ఎలా జరిగిందో వివరించి చెప్పాడు.

"చంపిందెవరో తెలిసిందా?"

"పోలీసుల చేతిలో డ్రైవరున్నాడు. డ్రైవర్ హంతకుడి ముఖం చూడలేదంటున్నాట్ట. అతడు చూసే ఉంటాడనీ చెప్పడానికి భయపడుతున్నాడనీ పోలీసులనుకుంటున్నారు. హత్య చేసింది డ్రైవరై ఉండదని భూషయ్య భార్యకూడా అంటోందిట. పోలీసు లా విషయం నమ్ముతున్నారు. హంతకుడి అచూకీ తెలియడం కష్టమనిపిస్తోంది...."

"సరే—థాంక్స్ ఫర్ ది ఇన్‌ఫర్మేషన్—హంతకుడి ఆచూకీ తెలిస్తేమాత్రం నాక్కూడా చెప్పండి...."

"తప్పకుండా—"

పురుషోత్తం ఫోన్ పెట్టేసరికి పనివాడొకడు "సార్ మీకోసం ఓ మనిషి వచ్చాడు. తనపేరు జగ్గు అని చెప్పాడు" అన్నాడు.

"జగ్గు అంటే—ఇదివరకు వచ్చాడు—అతడేనా?"

"అవును సార్...."

"లోపలకు పంపు—తలుపులు వేసెయ్—" అన్నాడు పురుషోత్తం.

జగ్గు లోపలకు వచ్చాడు. తలుపులు వెనుకనుంచీ మూసుకున్నాయి.

"పనైపోయింది. యాభై వేల కోసం వచ్చాను...." అన్నాడు జగ్గు.

"థాంక్స్—కానీ నా సంగతి నీకు తెలియదు—" అన్నాడు పురుషోత్తం.

"మీ సంగతి నాకెందుకూ తెలియదం....? నా సంగతి మీరు తెలుసుకున్నారుగా!" అన్నాడు జగ్గు నర్మగర్భంగా.

"నీ సంగతి నేను తెలుసుకున్నాను. భూషయ్య నీకు డబ్బిస్తానని చెప్పి నీచేత పని చేయించుకున్నాడు. పని చేయించుకున్నాక నీకు మొండిచేయి చూపించాడు. దాంతో నువ్వతడిమీద పగబట్టావు. అతణ్ణి చంపడానికి నీ కారణాలు నీకున్నాయి. భూషయ్య చావడంవల్ల నీ పగతీరింది. అలాంటప్పుడందుకు నా దగ్గిర్నుంచి డబ్బు లాగాలనుకోవడం అన్యాయం!" అన్నాడు పురుషోత్తం.

"అయితే ఏమంటారు?"

"అనడానికేమీలేదు. ఇచ్చిన పాతికే ఎక్కువ నీకు! నీ పనికి, పగకు—నా దగ్గిర్నుంచి డబ్బు వసూలుచేయడం అన్యాయం!"

"పురుషోత్తంగారూ! భూషయ్యగారు చేసిన తప్పే మీరూ చేయకండి—ఫలితం తీవ్రంగా ఉంటుంది ..."

"ఏం—నన్ను చంపుతావా?"

"బహుశా ...."

"చంపాలంటే ఇప్పుడే చంపు. నీ ధైర్యం నేను చూస్తాను. నన్ను చంపటంవల్ల ఫలితం నీకూ తెలుస్తుంది" అన్నాడు పురుషోత్తం.

"నేను మిమ్మల్నిప్పుడు చంపను ...."

"తెలుసు నాకు. ధైర్యం చాలదు నీకు ...."

"భూషయ్యగారుకూడా నన్నిలాగే సవాలుచేశాడు. నేను వదిలిపెడితే అది నా అసహాయత అనుకున్నాడు—చివరికి ఫలితమనుభవించాడు...."

"నన్ను చంపాలంటే ఇదే అవకాశం నీకు" అన్నాడు పురుషోత్తం.

"మిఠాయి దుకాణం వాడు తను తినాలని దుకాణం పెట్టడు. నేను కిరాయి హంతకుణ్ణి. హత్యలతో డబ్బు సంపాదించాలనుకుంటాను తప్ప స్వంత పగలకు హత్యలు చేయను నేను. ఇది అర్థంకాక భూషయ్య నాకు పదివేలెగేస్తే ఆయన ప్రాణాలకు యాభై వేలు విలువకట్టాను. నాకిప్పుడు మీమీద పగేర్పడితే—మీ ప్రాణాలకు లక్ష రూపాయలు విలువకట్టే మనిషికోసం వెతుకుతాను. నేను కిరాయి హంతకుణ్ణి. కిరాయికే తప్ప హత్యలు చేయను. కాబట్టి నేను వెళ్ళిపోతాను. మీ ప్రాణాలకు లక్షరూపాయిలు విలువకట్టే మనుషులు లేరనుకుంటేనే మీరు నిశ్చింతగా ఉండండి. లేకుంటే భూషయ్యకు పట్టిన గతే ఒకరోజు మీకూ పడుతుంది...." అన్నాడు జగ్గు హెచ్చరికగా.

పురుషోత్తం దెబ్బతిన్నాడు. ఈనాడు తను భూషయ్యను చంపాలనుకున్నట్టే—ఒకరోజు తన్ను మరొకడు చంపాలనుకోవచ్చు తన వ్యాపార జీవితమలాంటిది. జగ్గు తన శత్రువుకోసం అన్వేషించడం మంచిదికాదు.

ఆయన వెంటనే జగ్గుకి యాభై వేలూ ఇచ్చేశాడు.

"మీరు తెలివైనవారు. మీకు కిరాయి హంతకులబాధ ఉండదు" అని వెళ్ళిపోయాడు జగ్గు.

అది ఆశీర్వాదమో, అభిలాషో, అభినందనో పురుషోత్తానికి తెలియలేదు. □

అమ్మకానికో అమ్మాయి

సరసి

ఇద్దరు పెద్దమనుషులు పెద్దగా బిజినెస్ విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఆ ఇద్దర్లో ఒకాయన పేరు భూపాలరావు. ఆయన ఆ ఇంటికి యజమాని. మరోవ్యక్తి చలపతి. ఏ ఎండకా గొడుగుపట్టి, అదనుచూసి వ్యాపారాలు చేసుకునే మనిషి!

ఇద్దరికీ కొద్దికాలం క్రితమే పరిచయం అయ్యింది. ఇద్దరూ డబ్బుకోసం ఏ పనైనా చెయ్యగల మనస్తత్వం కలిగిన వాళ్ళు కావడంచేత త్వరలోనే సన్నిహితులై

పోయారు.

బిజినెస్ విషయాలు ముమ్మరంగా చర్చించబడుతున్న సమయంలో "టీ తీసుకోండి!" అంటూ వారి సంభాషణకు చిన్నగా అంతరాయం కలిగిస్తూ ఒక ట్రేలో టీ, బిస్కెట్లు తెచ్చి టీపాయిమీద పెట్టిందొక యువతి. ఆమెకు సుమారు ఇరవై ఏళ్ళుంటాయి.

ఆమె వెళ్ళిపోగానే అంతవరకూ ఆమెను నఖశిఖ పర్యంతం ఆపేక్షగా చూసిన చలపతి బిస్కెట్ తీసి నోట్లో పెట్టుకుంటూ అన్నాడు "పెళ్ళికెదిగిన అమ్మాయొకతుందని నాకెప్పుడూ చెప్పనేలేదు మీరు!"

భూపాలరావు చిన్నగా నవ్వేడు.

"ఈమె నా కూతురని ఎలాఅనుకున్నావు?నా కూతురుకి ఎప్పుడో పెళ్ళిచేసి పంపేలాను. ప్రస్తుతం నల్లకుంటలో వుంటోంది. ఈమె మా పనిమనిషి! మా ఆవిడ జబ్బు మనిషవ్వడంచేత సహాయంకోసం ఈమెని పెట్టుకున్నాం. ఇంట్లో పనులన్నీ బాధ్యతగా తనే చూసుకుంటుంది."

"ఎంతకాలం చూసుకుంటుంది? పెళ్ళీ గిళ్ళీ లేకుండా ఎల్లకాలం మీకు సేవచేస్తూ ఇక్కడే వుండిపోతుందా?"

"ఎప్పుడో ఏవిటి వచ్చే నెలలో మానేస్తానని చూచాయగా చెప్పింది. వెళ్ళిందంటే మాకు...." భూపాలరావు మాట పూర్తి చేసేలోగా ఫోను మోగింది.

ఫోనులో అవతలివాళ్ళు చెప్పింది విని క్రెడిల్ చేశాడు.

"కంపెనీ వాళ్ళు!....బిల్లు కట్టడానికి ఈరోజే ఆఖరి రోజట! ఇరవై వేల రూపాయలు ఒక్కసారి ఇప్పుడు ఎక్కణ్ణించి తెచ్చి కట్టాలి?" లోపల అనుకుంటున్నట్టు పైకే అన్నాడు భూపాలరావు.

"మీ రొప్పుకుంటే నేనిస్తా ఆ డబ్బు....ఇప్పుడే!"

అన్నాడు చలపతి వెంటనే!

"నువ్విస్తావా?"

"అవును! నేనే ఇస్తాను. మళ్ళీ నాకు మీరు ఇవ్వ నక్కర లేదు కూడా!" చలపతి కళ్ళలో తోడేలు చూపు కనిపించింది భూపాలరావుకి. అతడికేసి అయోమయంగా చూశాడు అర్థంకాక.

"మీరు మరోలా అనుకోనంటే చెబుతా! పరిసితుల్ని బట్టి బిజినెస్ మార్చుకోవాలి: మంచిచెడ్డ లాలోచిస్తూ కూర్చుంటే ఆస్తులు సంపాదించలేం సరికదా ఉన్నదికాస్త హరించుకుపోతుంది. మీకు అవసరం పడిన ఇరవై వేల రూపాయలూ ఇవిగో! మీ పనిపిల్లని నాతో పంపిం చెయ్యండి! మీ కర్థమయ్యే భాషలో చెప్పాలంటే—నా కమ్మేయ్యండి!!

ఎలాగూ వచ్చే నెలనించి మానేస్తానంటోందిగా.... కాబట్టి నామాట వినండి! గప్‌చుప్‌గా చిలకని పంజరంలో పెట్టి బొంబాయి పంపించేస్తా! మీకేమీ తెలియదు! తెల్లా రేక అందరితోనూ మీరూ ఆమెకోసం వెదుకుతారు.... సానుభూతిగా మాట్లాడుతారు! తర్వాత మెల్లగా వేరే పని మనిషిని పెట్టుకుంటారు....అంతే! ఏవంటారు?" స్వరం తగ్గించి అంటూ రూపాయలనోట్లని భూపాలరావు ముందు తోశాడు.

చలపతి ఈ వైపు బిజినెస్‌కూడా చేస్తాడని తెలియగానే ఆశ్చర్యపోయాడు భూపాలరావు.

అయిదు నిమిషాలు బుర్రకి పనిచెప్పాడు.

గతంలో ఒకసారి ఏకాంతంలో తను పనిమనిషి చెయ్యి పట్టుకోవడం, భంగపడడం, తర్వాత భార్యచేత

ఛీవాట్లూ, అవమానం అన్నీ సినిమారీలులాగా వరుసగా గుర్తొచ్చాయి. తనని కాదన్నది 'ఆఫ్టరాల్' ఒక పనిమనిషి! అంచేత దాన్ని అమ్మేసి క్యాష్ చేసుకోవడమే దానికి తగిన శిక్ష! పైగా అంతకంటే ముఖ్యం—ఇరవై వేలూ చేతిలో పడతాయి తక్షణం!

"స్పరే!" అన్నాడు భూపాలరావు.

చలపతి మొహం చాటంతయ్యింది. ఆ ఆనందంలో భూపాలరావుకి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. తరువాత ఆమెను గురించి వివరంగా తెలుసుకున్నాడు.

ఆమె పేరు మాలతి! అక్కడికి అరకిలోమీటరు దూరములో కూలిచేసుకునే వాళ్ళ గుడిసెల్లో తండ్రితోబాటు ఉంటోంది. కాఫీలు, టిఫెన్లు, భోజనాలూ అన్నీ భూపాలరావు ఇంట్లోనే చేస్తుంది. రోజూ సాయంత్రం వంట వండేసి ఇంటికెళ్ళి తండ్రిని చూసి రాత్రి తొమ్మిదిగంటలకి తిరిగి వస్తుంది. రాత్రంతా యజమాని భార్యకు సేవ చేస్తూ అవసరానికి మందులు ఇస్తూ ఆమె మంచం ప్రక్క నేలమీద పడుకుంటుంది.

నిమిషాల్లో చలపతి పథకం సిద్ధంచేశాడు.

"సాయంత్రమే ఇంటినించి బైటకు వెళ్ళిపోతుంది కనుక అప్పుడు సాధ్యం కాదు. ఏదో కారణం చెప్పి ఈ రాత్రికి మాత్రం సరిగ్గా తొమ్మిది గంటలకి తిరిగి రమ్మని చెప్పండి! మీ ఇంటి గేటుకు కొంచెం దూరంలో చీకట్లో మావాళ్ళు ఆటోలో రెడీగా వుంటారు. నోరు మెదపకుండా చేసి పిట్టని కొట్టుకు రావడం మా వాళ్ళకి వెన్నతో పెట్టిన విద్య."

పథకం అంతా వివరించి చెప్పి లేచాడు చలపతి.

అతడు వెళ్ళగానే రూపాయల కట్టని గాల్లోకి ఎగరేసి పట్టుకున్నాడు భూపాలరావు.

2

ఇంతకాలం ఎంతో నమ్మకంగా పనిచేసిన ఆ ఇంటి యజమానే తనను అన్యాయంగా అమ్మివేస్తాడనీ, తన కోసం ప్రమాదం పొంచి వుందనీ తెలియని అమాయకు రాలు మాలతి ఇంటి నుంచి బయలుదేరుతూ రోజూలాగే తన తండ్రికి ఆరోగ్యం గురించి జాగ్రత్తలు చెప్పి కదిలింది. అవసరమైతే తండ్రికి సహాయం చెయ్యమని చుట్టు పక్కల వారితో చెప్పింది. ఇది రోజూ జరిగేదే.

ఇక - భూపాలరావు ఇంటి వద్ద పరిస్థితి - వరండాలో లైటు ఆర్పేసి ఇంటి ముందు గేటువరకూ చీకటి చేయబడి వుంది. వీధిలైటు మాత్రం జీవచ్ఛవంలా మసకగా వెలుగుతోంది.

తన గదిలో నిలబడి కిటికీలోంచి గేటువైపే అసహనంగా చూస్తూ వాచీ చూసుకున్నాడు భూపాలరావు. తొమ్మిదికి ఇంకా పది నిముషాలుంది. లయిటు తీసేసి చీకటిలో నిలబడ్డాడు.

అయిదు నిమిషాలు గడిచాయి. ఇంకా తొమ్మిది కాకుండానే మాలతి వచ్చేసింది. భూపాలరావు గుండె దడదడలాడింది. గేటు గజం దూరంలో వుందనగా, రెండు సెకన్‌లలో చేరుకుంటుందనగా హఠాత్తుగా ఆమె వెనుక రెండు నీడలు ప్రత్యక్షమయ్యాయి. వెంటనే ఆమె నోరు నొక్కబడింది. మరుక్షణం ఆమె ఆటోలో చేర్చబడడం, ఆటో కదలడం జరిగిపోయాయి.

ఆటో కదిలిన శబ్దం కాగానే భూపాలరావు గుండెల మీద చెయ్యి వేసుకున్నాడు - ఇంకా దడ తగ్గలేదు.

వ్యాపారంలో అనేక మోసాలు చేశాడు గానీ డైరెక్టుగా ఇలా క్రిమినల్ వ్యవహారంలో తల దూర్చలేదెప్పుడూ.

ఆ రాత్రి అతడు సరిగా నిద్రపోలేదు. ఎప్పుడు తెల్లారుతుందా అని చూస్తూ కూర్చున్నాడు.

తెల్లారింది! స్థిమితంగా కాఫీ తాగుతూ వరండాలోకి వచ్చాడు. గేటు చప్పుడయితే పేపరువాడేమో ననుకుని తలెత్తి చూశాడు! గుండె జారిపోయినట్టయింది.

గేటు తీసుకుని లోపలి కొస్తున్నాడు రాజిగాడు-మాలతి తండ్రి!

పొద్దున్నే వీడొస్తున్నాడేవిటీ? కొంపదీసి పథకం పసిగట్టేడా?

"ఏరా! యిలా వచ్చావేవిటి పొద్దున్నే?" భూపాలరావు గొంతులో తెచ్చిపెట్టుకున్న ధైర్యం.

"ఏం లేదు బాబయ్యా! మా మాలతమ్మ నోసారి పిలిపించండి తవర్నడిగి ఓ పది రూపాయ లిప్పిస్తానంది!"

భూపాలరావు క్షణం ఆలోచించాడు. పనిలో వుందనో బయటి కెళ్ళిందనో అబద్ధం చెబితే లాభం లేదు. రాత్రే రాలేదని చెప్పకపోతే తర్వాత కొంపలంటుకుంటాయి.

"ఏడిసినట్టుంది! అదసలు రాత్రి రాందే! ఇదుగో వస్తున్నానని చెప్పి సాయంకాలవనగా వెళ్ళింది ఇప్పటిదాకా పత్తాలేదు. రాత్రంతా మీ అమ్మగారు దగ్గుతూనే వుంది.... మందిచ్చే నాధుడు లేడు!" చిరాకు నటించాడు భూపాలరావు.

"అదేంటి దొరా! నాకు కూడుపెట్టి మొదటాట వొదిలేటయిముకి కంగారుపడుతూ వొచ్చిందిగా! ఇక్కడికి రాకుండా ఎక్కడికి పోతుందయ్యా?"

"ఎక్కడికిపోతుందో నాకెలా తెలుస్తుందిరా? పోయి

పెతుకు.''

"అయ్యబాబో! ఇదేవి అన్యాయం దేవుడో! ఏమయి పోయావు తల్లో!" రాజీగాడి గొంతుక జీరబోయింది. వెనక్కి తిరిగి పిచ్చిపట్టినవాడిలాగా వూరివైపు పరుగు తీశాడు.

3

మాలతి వయసుకి తగిన శరీరసౌష్టవంతో ఆకర్షణీయంగా వుంటుంది. నిజానికి వాళ్ళ పేటలో ఆమె అందరిలో అందగత్తె! ఆమె కనబడకుండా పోయిందనేసరికి ఆమె అంటే ఇష్టపడేవాళ్ళు ఒకరకంగానూ, అసూయపడే వాళ్ళు మరోరకంగానూ చెప్పుకోవడం ప్రారంభించారు.

దగ్గిర బంధువులొకరు రాజిగాడిపేర పోలీస్‌రిపోర్టు ఇప్పించారు.

రిపోర్టు అందిన అర్ధగంటకి ఇన్స్పెక్టర్ శతభిషం జీపులో దిగేడు.

మాలతి గురించి, ఆమె దినచర్య గురించి రకరకాల ప్రశ్నలు వేసి చుట్టుపక్కల వారిని ఇంటర్వ్యూచేసి, జీపుని భూపాలరావు ఇంటికి పోనిమ్మన్నాడు.

అడిగిన ప్రశ్నలన్నిటికీ తొణకకుండా సమాధానాలు చెప్పేడు భూపాలరావు. గోడకట్టినట్టు అబద్ధం చెప్పేడు. పోలీసులు వస్తారనీ, తనని ప్రశ్నిస్తారనీ ఊహించని అమాయకుడు కాదు అతడు! పైగా మాలతి సుగుణాలరాశి అనీ ఆమె లేని ఇంటిని ఊహించలేననీ చెప్పి బాధ నటించాడు.

అతడి ధోరణి ఇన్స్పెక్టర్‌కి కొంచెం అనుమానం కలిగించింది. "థాంక్యూ! అవసరమైతే మరొకసారి పోలీస్‌స్టేషనుకి రావాల్సి వుంటుంది. దయచేసి మాకు

తెలియజేయకుండా వూరువిడిచి వెళ్ళకండి ఓ రెండు రోజులపాటు'' అని బైటకు నడిచాడు ఇన్స్పెక్టర్ శతభిషం.

పోలీస్ స్టేషన్‌లోకి అడుగుపెట్టగానే ఓ కానిస్టేబిల్ ఎదురొచ్చి శాల్యూట్ చేసి "సార్: నాంపల్లిలో అమ్మాయిల్ని బొంబాయి పంపుతున్న ముఠానొకదాన్ని రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నార్ట.... మీరు రాగానే ఎస్.పీ. గారు ఫోన్ చేసి మాట్లాడమన్నారు సార్!'' అన్నాడు హడావుడిగా.

శతభిషం ఫోనుచేసి మాట్లాడి తను బుక్‌చేసిన కేసు సంగతి చెప్పి వివరాలు సేకరించాడు. తర్వాతి కార్యక్రమంకూడా చర్చించి, మళ్ళీ జీపెక్కి పోనిమ్మన్నాడు.

తన ఇంటిముందు మళ్ళీ ఆగిన పోలీసు జీపుని చూసి గతుక్కుమన్నాడు భూపాలరావు.

"ఆడపిల్లల్ని బొంబాయి పంపిస్తూన్న ముఠానొకదాన్ని అరెస్టుచేశాం. అదృష్టం బావుంటే మీ మాలతి వాళ్ళలో వుండవచ్చు. మాలతి తండ్రి బాగా తాగివున్నాడు. అందుచేత తమరొకసారి స్టేషనుకొచ్చి ఆమెను గుర్తుపడితే తరువాత ఆమె విడుదలకు ఏర్పాట్లు చేయిస్తాను'' అన్నాడు శతభిషం!

భూపాలరావుకి వణుకు ప్రారంభమైంది.

స్టేషన్లో ఎస్.పి. సమక్షంలో పోలీసులు కొంతమంది స్త్రీల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. అక్కడ సుమారు పది పన్నెండు మంది అమ్మాయి లున్నారు.

వారిలో మాలతి వుందేమోనని చకచకా వెదికేడు భూపాలరావు.

మరుక్షణం అతడిమీద పిడుగుపడ్డట్టయింది! నవనాడులూ స్తంభించిపోయాయి! ఆ అమ్మాయిల్లో మాలతికి

బదులు తన కూతురు!! తన కన్నకూతురు పద్మ!!!

వెంటనే—అతడికి రాత్రి ఏం జరిగిందో అర్థమైపో యింది. రాత్రి తనింటికి వచ్చింది మాలతి కాదు—తన కూతురు పద్మ!

"అమ్మా!" గుండె గొంతుకలోకి తెచ్చుకుని అరిచాడు కూతురువంక చేతులు చాచి.

కళ్ళనీళ్ళు తుడుచుకుని ఆమె తండ్రిని చేరుకుంది. ఆప్యాయంగా తండ్రి గుండెలమీద వాలి వెక్కి వెక్కి ఏడ్చి వుండేది మరో స్త్రీ అయితే! కాని ఆమె అలా చెయ్యలేదు! "ఛెళ్ళ"న తండ్రి చెంపమీద ఒక్కటి కొట్టింది!!

అంతా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు!

"దుర్మార్గుడా! నీ కూతుర్నని చెప్పుకోవడానికి సిగ్గుగా వుంది! అమ్మని చూడడానికి నేను వస్తోంటే రాత్రి నన్ను ఇద్దరు వెధవలు పట్టుకుని ఆటోలో పడేసి తీసుకుపోయారు. నేను నీపేరు చెప్పి నీ కూతుర్ననీ, వదలమనీ వేడు కున్నాను. వాళ్ళు నమ్మలేదు. నేను పనిమనిషిననే అను కున్నారు. పైగా డబ్బుకాశపడి అమ్మేశావని చెప్పేరు. కూతురు లాంటి మాలతిని అమ్మకానికి పెట్టడానికి నీకు మనసెలా ఒప్పింది? ఆమెకు బదులు నన్ను పంపించి భగవంతుడు నీకు తగిన శిక్షవేశాడు. నువ్వు చేసిన ఈ దుర్మార్గానికి జీవితాంతం మనశ్శాంతి లేకుండా బ్రతుకు" కన్నీళ్ళు ధారగా కారుతూ వుంటే అంది పద్మ!

భూపాలరావు నేలమీద ఒరిగిపోయి తలదించుకున్నాడు.

ఇంతలో—పోలీసు స్టేషనుముందు ఓ తెల్లటి మారుతీ కారు వచ్చి ఆగింది. అందులోంచి ఓ జంట - పచ్చ బట్ట లతో, మెడలో దండలతో స్టేషనులోకి అడుగుపెట్టేరు.

"ఇక్కడికి భూపాలరావా గారొచ్చారట!"

ఆ గొంతు వినబడగానే తలెత్తిచూశాడు భూపాలరావు.

మాలతి! పెళ్ళికూతురుగా వెలిగిపోతున్న మాలతి!!

"క్షమించండయ్యా! తమరికి చెప్పకుండా నిన్నరాత్రి యాదగిరి గుట్ట వెళ్ళి పెళ్ళిచేసుకువచ్చాను. నా అదృష్ట వశాత్తూ ఓ దనవంతుడి కొడుకు నన్ను ప్రేమించి, పెద్ద వాళ్ళు అంగీకరించరనే భావంతో ఈ విధంగా తీసికెళ్ళి పెళ్ళి చేసుకున్నాడు. తండ్రి తరువాత తండ్రి అంతటి మీరు ఆశీర్వదిస్తారని నేరుగా ఇలా వచ్చాం!!" అంటూ కాళ్ళకు మ్రొక్కబోయింది మాలతి.

నోటివెంట మాటరాక. చేతులు అడ్డంగా ఊపుతూ కళ్ళ వెంట నీళ్ళు ప్రవహిస్తొంటే దూరంగా జరిగిపోయాడు భూపాలరావు! □

"కరంటు కోత!!"

ఫాలనేత్రం

వి.యస్.రావ్ సీరియల్

(గత సంచిక తరువాయి)

గణపతి వెనకే బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది అనూరాధ. పైటకొంగుని నడుంలో దోపుకుంటున్న భార్యని అదోలా చూశాడతను.

"అనూ, నువ్వెళ్ళి విశ్రాంతి తీసుకో. నేను స్నానం

చేస్తాను" అన్నాడు గణపతి.

ఆమె అతన్ని ఆశ్చర్యంగా చూసింది. రోజూ తను వీపు తోమితేగానీ అతని స్నానం పూర్తికాదు! ఇవాళ సాయంత్రం నుంచీ ఎందుకో తన భర్త అదోరకంగా వున్నాడు.

"వీపు తోమెద్దూ?"

"వొద్దులే. సావధానంగా స్నానంచేసే వోపికలేదు— నాలుగు చెంబులు దిమ్మరించుకువస్తాను" అంటూ గణపతి అటువేపు తిరిగాడు.

"అతన్ని....కలుసుకున్నారా?"

"ఆ...." ఏ విషయం ఆమె తనని అడక్కూడదని తను అనుకుంటున్నాడో అదేవిషయం అడుగుతోందామె.

"ఎందుకు రమ్మన్నాట్ట?" అనూరాధ మళ్ళీ ప్రశ్నించింది.

గణపతి మాట్లాడకుండా చెంబెడు నీళ్ళు, తలపైకెత్తి మొహమ్మీద నెమ్మదిగా పోసుకున్నాడు. ఎందుకు రమ్మన్నాడు? గణపతికి పిచ్చిగా, బిగ్గరంగా నవ్వాలనిపించింది.

నక్షత్రకమూర్తి తనని ఎందుకు రమ్మన్నాడో తనామెకి చెప్పలేదు. సోమవారం పొద్దుటే నక్షత్రకమూర్తి కూర్మావతారం పేరుతో బ్యాంకుకి వస్తాడనీ, అతని కొత్త పేరు మీద. అతనికి పాతికవేలు బాంక్‌లోనే ఇప్పించమన్నాడనీ అప్లికేషన్ ఫారమ్ వగైరా తనే పూర్తిచేయాలనీ, కూర్మావతారం సంతకాన్ని ఎడంచేత్తో తనే చేయాలనీ, లోన్ మంజూరుచేసి, పైకం నైవేద్యం పెట్టాలనీ, ఆ పైకం తిరిగే చెల్లించబడదనీ తను ఆమెకి చెప్పలేదు!

ఆలోచిస్తూ మరో చెంబుతో నీళ్ళు దిమ్మరించుకుని గణపతి భార్యవైపు చూశాడు. "పందరూపాయలు అప్పు

కావాలన్నాడు. ఇవ్వకపోతే పీర్‌లెస్ ఏజెంటులా తగులు కుంటాడు. తిరిగిరాదని తెలిసినా పారేసి, తప్పించుకు వచ్చాను!"

భర్త చెప్పిన అబద్ధాన్ని ఆమె అమాయకంగా, చిరు నవ్వుతో స్వీకరించింది. "అంతేగా! అతన్నీ, ఆడబ్బునీ మరిచిపోండి! అతని ఫోన్‌కాల్ గురించి చెప్పినప్పట్నుంచీ మీరు మరోవ్యక్తిలా అయిపోయారు! ఈసారి మళ్ళీ సతా యిస్తే ఏ వెయ్యో అతని మొహాన కొట్టి, పీడ వదిలించు కోండి!" నవ్వుతూ అందామె.

గణపతి భార్యని ఆశ్చర్యంతో చూశాడు. నిజంగా బ్లాక్‌మెయిలర్ సంగతి తెలిస్తే ఎంతో కొంత పారేసి, పీడ వదిలించుకొమ్మంటుందా ఆమె?

బ్లడ్ సిఫిలిస్, బ్లడ్‌కాన్సర్ వున్న వ్యక్తి పెళ్ళి చేసు కోడానికి ఎలా వెనకాడుతాడో తనూ అలాగే వెనకాడాడు. కానీ, పరిస్థితులు తన చేతుల్లో లేవు. పెళ్ళాడితే, మరో వ్యక్తితో, తనభార్యతో తను లెక్కలేనన్ని అబద్ధాలాడుతూ వుండాలి. అనుక్షణం భయపడుతూ వుండాలి! పెళ్ళాడక పోతే నిటలాక్షరావు తనమీద నిప్పులు చెరుగుతానన్నాడు. అంతే కాకుండా అమాయకంగా చూసే అనూరాధ మొదటి చూపుతో తనని ఆకర్షించుకుంది. ఎన్ని కష్టాలొచ్చినా ఆమెతో సుఖపడాలనిపించింది ఆక్షణంలో తనకి.

గణపతి ఆలోచనల్లోంచీ తేరుకున్నాడు. అతని వీపు మీద అనూరాధ గాజులు సన్నగా, చప్పుడు చేస్తున్నాయి.

9

గణపతి హోటల్ నవరంగ్ లోపలికి ప్రవేశించాడు. కుడివైపుకి తిరిగి మెట్లవేపు అడుగులేశాడు.

మొదటి అంతస్థు దాటి రెండో అంతస్థుకి మెల్లిగా ఎక్కసాగేడు. అతనిలోంచీ కోపం ఆవిర్లుగా బైటికి పొంగుతోంది.

తను పిచ్చికుక్కలాగా తరమబడుతున్నాడు. అంతు లేని అన్యాయం తనని నిరంతరం ఏడిపిస్తోంది. మంచికి హద్దున్నట్టే చెడుకీ ఒక హద్దు వుండాలి!

థర్డ్‌ఫ్లోర్‌లో గది 456 ముందు ఆగి, వేళ్ళతో తలుపు మీద రెండుసార్లు తట్టాడు. లోపల్నుంచీ అడుగులచప్పుడు వినిపిస్తోంది. కొద్దిగా తెరుపబడింది.

నక్షత్రకమూర్తి తల తొంగిచూసింది. హార్మోనియం రీడ్సులా పళ్ళన్నీ చూపిస్తూ అతను తలుపు బార్లాతెరిచాడు. కొద్దిగా కిందికి వొంగి కుడిచేత్తో గణపతికి గదిని చూపించాడు.

గణపతి లోపలికి అడుగుపెట్టాడు.

తలుపుమూసి, గొళ్ళెం బిగించి. నక్షత్రకమూర్తి అతనికి సోఫా చూపించాడు. గణపతి కూచోలేదు. అతని వైపు చిరాకుగా చూశాడు.

"ఎందుకు రమ్మన్నావు?" కసిరాడతను.

నక్షత్రకమూర్తి మాట్లాడకుండా సోఫాలో కూచుని, కాలుమీద కాలు వేసుకున్నాడు. సిగరెట్ ముట్టించి గణపతి వైపు నవ్వుతూ చూశాడు.

"కాఫీ! టీ?" అన్నాడు.

"నీ మర్యాదలు అక్కర్లేదు; ఎందుకు నన్ను ఇక్కడికి అఘోరించమన్నావో చెప్పు!" గణపతి గర్జించాడు.

"ఓకే వోకే. అడిగినప్పుడు లేదనకుండా ఎంతో కొంత డబ్బిచ్చావు. నీ డబ్బుతో ఒక కాఫీయేనా నీకు యివ్వాలనుకున్నా. ఆల్‌రైట్.... అత్యవసరంగా పదిహేను

వేలు...."

ఎంతో కొంత! ఛండాలుడు, రాక్షసుడు, కసాయి వెధవ! దాదాపు రెండు లక్షలు; కొంత! గణపతి ఆగ్ర హంతో ముందుకి దూకాడు. వొంగి, కాలర్ పట్టుకుని, ఎడం చేతితో నక్షత్రమూర్తిని పైకి లాగాడు. అతని కుడి చెయ్యి అట్లకాడలా నక్షత్రమూర్తి చెంపమీద తాకింది. "స్కౌండ్రల్! నీకూ, నీ గురువుగాడికీ బుద్ధి చెప్తాను!"

ఆవేశంలో అరుస్తూ గణపతి ఎడం చేతిని ముందుకీ వెనక్కీ ఊపి, అతన్ని బలంగా వెనక్కి తోశాడు. నక్ష త్రకమూర్తి సోఫామీద కూలబడ్డాడు. అతని కళ్ళు మెరు స్తున్నాయి. బుగ్గ బూరెలా పొంగుతోంది. మెల్లిగా అతని పెదవులు విచ్చుకున్నాయి.

ఆవేశంతో ఊగుతున్న గణపతిని రెప్పవేయకుండా చూస్తూ అతను మెల్లిగా లేచాడు. కందిపోయి, వాతలు తేలుతున్న బుగ్గని అతను ముట్టుకోలేదు. మెల్లిగా అద్దం ముందుకు నడిచాడు. మొహం పక్కకు తిప్పి, వాలుగా తన ఎడమబుగ్గని పరిశీలించాడు. అతని తల పైకీ కిందికీ ఆడింది. వెనక్కి తిరిగి, గణపతి ముందుకు నడిచా డతను.

రెండు కాళ్ళనీ ఎడంగా వుంచుకుని తీక్షణంగా గణపతి మొహంలోకి చూశాడు. అతని చూపులు కత్తుల్లా గణపతి కళ్ళని కోస్తున్నాయి.

"మిస్టర్ గణపతీ, నువ్వు పొరపాటు చేశావ్!" అన్నాడతను తగ్గు స్వరంతో. అతని కంఠం పాము బుసలా వినిపించింది గణపతికి.

"నన్ను కొట్టినా చంపినా నువ్వు గాలం నుండి తప్పించుకోలేవు. రేపటిలోగా తనకి పదిహేను వేలు

అందకపోతే నిటలాక్షరావుగారు రెచ్చిపోతారు. మొదటి విడత ఫోటోలు నీ భార్యకి అందజేయబడతాయి. ఆమెకి సంజాయిషీ యిచ్చేలోగా, పోలీసులు నిన్ను ఊరేగిస్తూ తీసుకుపోతారు. ఊరేగింపు పూర్తయ్యేసరికి వివిధ పత్రికల్లో అన్ని ఫోటోలూ అచ్చవుతాయి."

గణపతి కోపం మెల్లిగా మంచులా కరిగిపోతోంది. ఆవేశంతో తను వాళ్ళు మరిచిపోయాడు. వాళ్లు అడిగింది ఇవ్వనప్పుడు ఆత్మహత్య తప్ప తనకి వేరే మార్గం లేదు.

"మాతని దండించడం అన్యాయమని శాస్త్రాలు నెత్తీ నోరూ బాదుకుంటున్నాయి. నువ్వు ఇస్తే పట్టుకెళ్ళి ఆయన కిస్తాను. నువ్వు టోడిచెయ్యి చూపిస్తే నేనూ ఆయనకి టోడిచెయ్యి చూపిస్తాను. నన్ను కొట్టినవాళ్ళని కొట్టకపోయినా, నేను అంత సులభంగా క్షమించను! పదిహేను వేలని నీ చెంపదెబ్బతో ఇరవయి వేలుగా మార్చింది. ఒక్క దెబ్బతో అయిదువేలు రేటు పెంచే శాపు! నా చెంపమీద ఏర్పడిన నీ ఒక్కొక్క వేలి గుర్తుకూ వెయ్యి చొప్పున నేను తీసేసుకుంటాను. ఇరవయికి పయిసా తక్కువయిగా నేను ముట్టుకోను. నువ్వు తిరగబడ్డావని ఆయనకి చెబుతాను. మరుక్షణం నీపతనం, నీ నాశనం ప్రారంభమవుతుంది!"

గణపతి ఉక్కిరి బిక్కిరవుతూ చూశాడు. "అయాం సారీ, ఆవేశంలో ఏదో చేశాను...."

"సారీలు జేబులు నింపవ్!" నక్షత్రకమూర్తి వెటకారంగా అన్నాడు.

"ఇప్పటికి రెండు లక్షలదాకా ఇచ్చాను! తప్పుడు లోన్లు మంజూరు చేశాను. తప్పుడు లెక్కలతో డబ్బు సర్దాను. ఉన్నదంతా అమ్ముకున్నాను...."

"అదంతా చెప్పకు. నువ్వు చేసిన కొత్త నేరాలు చెబుతూంటే నా అంతట నేనే. నిటలాక్షరావుగారికి తెలీకుండా రెండో బ్లాక్ మెయిల్ ప్రారంభించాలనిపిస్తుంది. బ్యాంకులోంచీ నువ్వెంత సర్దినా నీ సొమ్మేం పోదు! ఉన్నదంతా అమ్ముకున్నానన్నావ్. ఇంకా అమ్మాలంటే నీ దగ్గిర వేరే వున్నాయి. స్కూటర్. నీ భార్య నగలు, నీ మామగారిచ్చిన ఫర్నిచర్. కలర్ టీవీ ఇంకా చెప్పాలా!" నక్షత్రకమూర్తి నవ్వుతూ అన్నాడు.

గణపతి అతని ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు. ప్రాధేయపూర్వకంగా అతన్ని చూశాడు. "అవన్నీ నా భార్యద్వారా వచ్చాయి. అవన్నీ ఆమెవే. వాట్ని అమ్మితే ఆమె బాధపడుతుంది, అనుమానిస్తుంది...."

"ఆమె నీదయినప్పుడు ఆమెవన్నీ నీవే!" నక్షత్రకమూర్తి అడ్డొస్తూ అన్నాడు. "గణపతీ! అదంతా నీ తీట! నువ్వు ఎలా గోక్కుంటావో నాకు అనవసరం. ఇస్తానంటే రేపు కలుసుకుంటాను. లేదంటే ఇవాళే వెళ్ళిపోతాను!"

గణపతి నిస్సహాయంగా చూశాడు తను కాంక్రీటు గోడతో మాట్లాడుతున్నాడు. కాంక్రీటు కన్నీళ్ళకి కరగదు!

10

సీలింగ్‌ఫాన్ గిరగిరా తిరుగుతోంది. గణపతి మంచం మీద వెల్లకిలా పడుకుని ఫాన్‌నే చూస్తున్నాడు.

"ఏమండీ! ...."

గణపతి తటాలున పక్కకి తిరిగాడు. ఆమె ఎప్పుడొచ్చిందో తను చూడలేదు. చిరునవ్వుతో భార్యను చూశాడతను. అనూరాధ అతని పక్కనే కూచున్న అపరంజి బొమ్మలా వుంది. తనకి సౌందర్యరాశి భార్యగా

దొరికింది. కానీ ఆమె అందాన్నీ, ప్రేమనూ ఆనందంగా మార్చుకోలేకుండా వున్నాడతను. గతంలోని కీనీడలు చీకటి తెరల్లా తన వర్తమానాన్నీ, భవిష్యత్తునీ కప్పేస్తు న్నాయి.

"మిమ్మల్నే! కళ్ళు తెరుచుకునే నిద్రపోతున్నారా?" అనూరాధ నవ్వుతూ అంది. ఆమె పళ్ళు చిగురుటాకుల సందులోంచీ తళుక్కుమనే మొగ్గల్లా మెరిశాయి.

"....నిన్ను చూస్తున్నా."

"కళ్ళుమాత్రం నామీదే వున్నాయి. కానీ వాటికి నేను కనిపిస్తున్నానా అన్నదే నా సందేహం!" అనూరాధ నవ్వుతూ అంది. ఆమె చెయ్యి అతని ఛాతీమీదికి పాకింది.

గణపతి చిన్నగా నవ్వాడు. 'గతంతెర' తన జీవితం మీంచీ తొలిగిపోయేదాకా, తనకి ఆమె స్పష్టంగా కనిపిం చదు. తను ఆమెని ధైర్యంగా చూడలేడు....

"ఏమండీ...."

"ఊఁ...."

"పెళ్ళయి రెండేళ్ళు కావొస్తోంది. మీకు లేకపోవచ్చు; కానీ నాకు బాబుని ఎత్తుకోవాలనుంది...." అనూరాధ రెప్పలు వాల్చుకుని అంది.

గణపతి నిట్టూర్చాడు. తానున్న విపత్కర పరిస్థితిలో పెళ్ళిచేసుకోడమే పెద్ద అడ్వెంచర్! ఇంక పిల్లలు! రేపు ఎలావుంటుందో, తనని ఏంచేస్తుందో తెలీని భయంకర మైన ఆపదలో తను ఈదుతున్నాడు. సంసారం పెరు గుతూపోతే....తనకేమైనా అయితే....అందుకే ఇప్పు డప్పుడే పిల్లలు కలగటం తన కిష్టంలేదు. ఇదంతా విడ మరచి ఆమెకి చెప్పే నోరు తనకి లేదు!

"ఏమండీ...."

"ఊ...."

"ఇంతవరకూ నేను మిమ్మల్ని ఏమీ అడగలేదు. కట్నం పైకం ఏంచేశారని అడగలేదు. జీతం నాచేతికి ఇమ్మనటంలేదు. స్కూటర్ ఎందుకు అమ్మేశారో, అమ్మిన పైకం ఏంచేశారో నేను అడగలేదు. నేను అడిగే దొక్కటే; నాకో బాబుని ఇవ్వండి!"

గణపతి కదిలిపోతూ చూశాడు. జీరోవాట్ బల్బ్ కాంతిలో అనూరాధ కళ్ళు తడిగా ముక్కల్లా మెరుస్తు న్నాయి. గణపతి ఆప్యాయంగా ఆమె మెడమీద చెయ్యి వేశాడు. బలహీనంగా ఆమెని దగ్గిరగా లాగాడు. అనూ రాధ తలని అతని ఛాతీమీద ఆన్చింది.

"మీరు....మీరు....మునుపట్లాలేరు .... మీలో మీరే ఏదో బాధపడుతున్నారు. ఏమిటో నాకు చెప్పండి. నా కంటికి కనిపించని కట్నం, మీ జీతం, అమ్మేసిన స్కూటరూ, తాకట్టు పెట్టాలని తీసికెళ్ళిన నా నగలూ— మీరు ఆర్థికంగా పెద్ద చిక్కుల్లో వున్నారని నాకు చెప్తు న్నాయి. కాబూలీవాలాల దగ్గిర అప్పు చేశారా? చెప్పండి. ఎంత కావాలో చెప్పండి. నాన్నని అడుగుతాను. అప్పు లాళ్ళకి పారేసి, హాయిగా వుండండి!" అనూరాధ ఉద్రే కంతో అంది.

వణుకుతున్న గణపతి చెయ్యి ఆమె తలను నిమిరింది. మొట్టమొదటిసారిగా, శోభను హత్యచేసినందుకు అతను విచారించాడు. తన ఛాతీమీద ఆనిన ఆమె తలని సాను భూతితో చూశాడు. అనూరాధకి కొన్నే తెలుసు. బాంకులో లోన్లూ, ఎంబెజిల్ మెంట్సూ, ఫోర్జరీలూ, సర్దు బాట్లూ....ఎన్నో ఆమెకి తెలీని ఘనకార్యాలు తనుచేశాడు! గణపతి బలహీనంగా కళ్ళు మూసుకున్నాడు.

లోపల్నుంచీ అతని హృదయం మౌనంగా బొబ్బలెడు తోంది. అతను చేసిన పనులన్నింటినీ ఆమెకి వివరి స్తోంది. గణపతి నవ్వుకున్నాడు. తన హృదయం ఆడే మాటల్ని ఆమె వినలేదు! అప్రయత్నంగా ఆమె వీపు మీద చెయ్యివేశా డతను.

11

ఆదివారం. ఉదయం పది దాటింది.

కాలింగ్ బెల్ శబ్దం, గణపతిని ఆలోచనల ఊబి లోంచీ ఇవతలికి లాగింది. ఉలిక్కిపడి నించున్నాడతను. ఎవరు? నక్షత్రకుడా? ఇంటికి ఫోన్ చెయ్యొద్దనీ, ఇంటికి రావొద్దనీ అతనికి ప్రత్యేకంగా చెప్పాడు తను.

గుమ్మంవేపు నడిచాడతను. అదృష్టం! అనూరాధ ఇంట్లోలేదు; ఎవరింటికో వెళ్ళింది. తలుపు తెరిచి, ఎదు రుగా నించున్న వ్యక్తిని ఆశ్చర్యంతో చూశాడతను. అతనిలో రగిలిన కోపం చిరునవ్వుగా మారుతోంది.

"నమస్తే మిస్టర్ గణపతీ!" అన్నాడు గోవిందరావు, అతన్తోబాటు బ్యాంకులో పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగి.

"నమస్తే. రండి, రండి. పొద్దుటే వచ్చారు?" ఆహ్వా నాన్నీ, ప్రశ్ననూ కలిపి అన్నాడు గణపతి.

గోవిందరావు నవ్వు మొహంతో లోపలికి ప్రవే శించాడు. గణపతి అతన్ని ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు. లూజుగావున్న పాంటూ, పొట్టిచేతుల ఫ్లాక్. సగం నెర సిన జుట్టు. బలహీనంగా అవుపించే మొహం. గోవింద రావు గెడకర్రలా వున్నాడు.

"మీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి...." గోవిందరావు మెల్లిగా అన్నాడు.

"ఆ గదిలో కూచుందాం," అంటూ గణపతి దారి

తీశాడు. గోవిందరావు అతన్ని అనుసరించాడు. గదిలో సోఫాలో కూచుని, గణపతి అతనికి కుర్చీ చూపించాడు. కూచుని, సిగరెట్ వెలిగించి, గోవిందరావు కళ్ళు చిట్లిస్తూ గణపతిని చూశాడు. రెండు కళ్ళ కొసల్లో సన్నటి కాల వల్లా గీతలు పడ్డాయి.

"గోవిందరావుగారూ, కాఫీ?" గణపతి అడిగాడు.

"నో థాంక్స్. తాగేవచ్చాను...." అంటూ గోవింద రావు కుర్చీలో అటూ ఇటూ కదిలాడు.

గణపతి అతన్ని కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "ఏదో మాట్లాడాలన్నారు...."

గోవిందరావు తొండలా తలని పైకీ కిందికీ నాలు గైదుసార్లు ఆడించాడు. చిన్నగా దగ్గి గొంతు సవరించు కున్నాడు. ముందుకి వంగి, సిగరెట్ పీకని యాష్‌ట్రేలో పడేశాడు.

"ఈ మధ్య....మన బ్యాంకులో....కొన్ని....ఆర్థిక.... ఐమీన్ అవకతవకలు జరుగుతున్నట్టు నేను గ్రహిం చాను...." గోవిందరావు గణపతి మొహంలోకి చూస్తూ మెల్లిగా అన్నాడు.

గణపతి లోపల్లోపల ఉలిక్కిపడ్డాడు. అమాయకంగా కనుబొమల్ని పైకెత్తాడు. "అవకతవకలు? వాట్ డూయూ మీన్?"

"ఐమీన్....మిస్టర్ గణపతీ, అపార్థం చేసుకోకండి. నేను సీనియర్ వెధవని. ఏదో బ్లాక్‌మార్క్ కారణంగా ఎక్కాల్సిన ఎత్తుకి ఎక్కలేకపోయాననుకోండి. అయితే, బాంకింగ్‌లో తల నెరసిన ముండావాణ్ణి. ఒకసారి అలా చూసి, ఇంటరెస్ట్ లెక్కింపులో పైసా తక్కువైతే పట్టేయగలను...."

"అసలు సంగతి చెప్పండి!" లోపల గుండె దడదడ మంటున్నా బింకంగా అడిగాడు గణపతి.

గోవిందరావు చూపుడు వేలితో ముక్కుమీద కాసేపు గోక్కుంటూ వుండిపోయాడు. రెప్పలు పైకెత్తి గణపతి మొహంలోకి, దేన్నో వెతుకుతున్నట్టు చూస్తూండి పోయాడు. గణపతి ఇబ్బందిగా చూస్తూ, సిగరెట్ వెలి గించడంలో నిమగ్నుడయ్యాడు.

"నా అంచనా ప్రకారం లక్షరూపాయలపైగా పబ్లిక్ మనీ దుర్వినియోగం చేయబడిందనుకుంటున్నా. మరో లక్షదాకా ఎవరో అనామకులకి అప్పుగా ఇవ్వబడింది...."

"మీ కెలా తెలుసు?" గణపతి క్రాస్ ఎగ్జామిన్ చేస్తు న్నట్టు అడిగాడు.

"ఎలా తెలుసుకోవచ్చో మీకు తెలుసు! ఆ వివరాలన్నీ మనకి అంత ముఖ్యంకాదు....మీరు మేనేజర్‌గా వున్న సమయంలో ఇలా జరిగినందుకు నేను విచారిస్తున్నా. మీరు కుర్రాళ్ళు. పైకి, ఎంతోపైకి రావాల్సినవాళ్ళు...." గోవిందరావు చెప్పుకుపోతున్నాడు. గణపతి కంగారుని అణచుకుంటూ అతని ప్రవాహానికి అడ్డుతగిలాడు.

"ఏమిటి మీ అర్థం?" కోపంగా అడిగా డతను.

గోవిందరావు వంకర టింకర పళ్ళు చూపిస్తూ నవ్వాడు. "నా అర్థం! ఎందుకో మీరు అనర్థాన్ని కొని తెచ్చుకుంటున్నారు. అదే నా అర్థం!"

"గోవిందరావుగారూ!"

"ఆగ్రహించకండి. కూర్మావతారం, కపాలేశ్వరరావు, రాజవర్మ, రంగరాజు - ఈ నలుగురు వ్యక్తులకీ మీరు పెద్ద మొత్తాలు లాంగ్‌టర్మ్‌లోన్స్ శాంక్షన్ చేశారు. ఈ నలుగురూ ఒకే వ్యక్తి అనీ, నలుగురి పేర్లూ మీరే రాశా

రనీ, నాలుగు సంతకాలూ మీరే చేశారనీ నాకు తెలుసు!"
గోవిందరావు చిన్నగా నవ్వాడు.

గణపతి ఆదుర్దాగా లేచి నిలబడ్డాడు. తన మొహంలోని రక్తం ఇంకిపోతున్నట్టు అతనికి అనుభూతి కలుగుతోంది. గుడ్ డాడ్! గోవిందరావు దేవాంతకుళ్ళా వున్నాడు! తన హస్తలాఘవం ఇంత త్వరగా బయటపడుతుందనుకో లేదు. రెండు ఉచ్చులు ఏకకాలంలో తన మెడచుట్టూ బిగుసుకుంటున్నాయి. అతని వేళ్ళ సందులోంచీ సిగరెట్ జారిపడింది.

గోవిందరావు మళ్ళీ గొగ్గిరిపళ్లు చూపించాడు. మాటి మాటికీ అతను నవ్వుతూంటే గణపతికి నక్షత్రకమూర్తి గుర్తొస్తున్నాడు. వణుకుతున్న చేతుల్ని వెనక్కి పెట్టుకుని విగ్రహంలా నిలబడిపోయాడు.

"మిస్టర్ గణపతీ, మరోసంగతి కూడా నాకు తెలుసు" గోవిందరావు మరో సిగరెట్ వెలిగించి మెల్లిగా అన్నాడు.

గణపతి పెదవులు కదిలాయి. కానీ, శబ్దం వెలువడ లేదు. గోవిందరావు తన సంభాషణని బ్రహ్మాండంగా ఎంజాయ్ చేస్తున్నాడని అతని మొహం చెప్తోంది.

"మీరు బ్లాక్ మెయిలర్‌కి ఆ పైకం చెల్లించారు!"

గణపతి తూలిపడబోతూ నిలదొక్కుకున్నాడు. కాళ్ళు రెండూ వాకేసారి విరిగినవాడిలా సోఫాలో కూలిపోయాడు. చెమటతో తడిసిపోయిన మొహాన్ని గోవిందరావువైపు ఎత్తి వెర్రివాడిలా చూస్తూండిపోయాడు.

గోవిందరావుకి ఇంకా ఏం తెలుసు? ఈ ప్రశ్న తేలు కొండీలా అతని మెదడుని కుట్టుతూ సలుపు పుట్టిస్తోంది.

"మిమ్మల్ని ఎవరు, ఎందుకు బ్లాక్ మెయిల్ చేస్తు న్నారో...." గోవిందరావు ఆగి, ఆరిపోయిన సిగరెట్

అగ్గిపుల్ల గీచి, తగిలించాడు.

గణపతి లోపల్లోపలే విలవిల్లాడుతూ చూశాడు. గోవిందరావుకి అంతా తెలుసా? ఎలా తెలుసు?

"....నాకు తెలీదు...." దమ్ములాగి పొగ ఊదుతూ మళ్ళీ ప్రారంభించాడు గోవిందరావు. గణపతి తేలిగ్గా నిట్టూర్చాడు. కొంత నయం!

"నాలుగుసార్లు, నాలుగురకాల వేషాల్లో, నాలుగు పేర్లతో మీ నుండి లోన్స్ తీసుకెళ్ళిన వ్యక్తికీ బ్లాక్‌మెయిల్‌కీ సమ్మంధం ఉంటుందని నేను అనుకుంటున్నా. అయినా, అది నాకు సంబంధించిన వ్యవహారం కాదు...." గోవిందరావు ఆగాడు.

గణపతి అతన్ని ఆందోళనతో చూశాడు. "మీరు.... ఇప్పుడు .... ఏం చేయదలిచారు?" వణికే కంఠంతో ప్రశ్నిచాడతను.

గోవిందరావు తల వాల్చి, తన అరచేతిలోని గీతల్ని కాసేపు పరిశీలనగా చూస్తూ ఉండిపోయాడు. గీతలు చదవడం పూర్తయ్యాక తలెత్తి గణపతిని తదేకంగా చూశాడు. "సూటిగా చెప్పమంటారా? డొంకతిరుగుడుగా చెప్పమంటారా?" చిరునవ్వుతో ప్రశ్నించాడతను.

గణపతి నిస్సహాయంగా, గాభరాగా నిట్టూర్చాడు. మరోగాలం తన గొంతుకలో వాడిగా, లోతుగా దిగబోతోంది....

"గోవిందరావుగారూ, ఇంతాఅయ్యాక డొంకతిరుగుడు ఎందుకు? ముక్కుకి సూటిగా, ఒక్కముక్కలో చెప్పండి" గణపతి కంఠంలో విరక్తి, కసి, ద్వేషం పెనవేసుకున్నాయి.

గోవిందరావు మళ్ళీ తన అరచేతుల్ని హస్తసాముద్రికు

డిలా పరీక్షించాడు. తలెత్తి గణపతిని చూశాడు. "మీరు నాకు కొంచెం సహాయం చేయాలి...." మెల్లిగా నసిగా డతను.

గణపతి కళ్ళు పెద్దగా అయ్యాయి. మరో బ్లాక్ మెయిలర్! నిటలాక్షరావు పొట్ట నింపడానికి బాంక్‌లో ఎంబెజిల్ మెంట్ ప్రారంభం చేసినప్పుడు తను రెండో నేరంలో పీకలదాకా ఇరుక్కోబోతున్నట్టు తనకి తెలుసు. ఫోటోలు బైటపడి తన కథ ముగుస్తుందన్న ఆందోళనతో ప్రాణం కోసం నిటలాక్షరావు బ్లాక్ మెయిలింగ్‌కి తను తలొంచాడు. ముందు ఏమవుతుందో అన్న ఆలోచనకి అవకాశంలేని అత్యవసరస్థితిలో మరోనేరం చేస్తూ వచ్చాడు.

మొదట తను శోభని హత్యచేశాడు.

హత్య బైటపడకుండా ఉంటానికి బ్లాక్ మెయిలర్‌కి లొంగాడు.

బ్లాక్ మెయిలర్ని తృప్తిపరచడంకోసం బ్యాంకుని కొల్లగొడుతున్నాడు.

ఆ కార్యక్రమంలో గోవిందరావుకి చిక్కాడు. ఫలితంగా మరో బ్లాక్ మెయిలర్‌కి పాదాక్రాంతుడవబోతున్నాడు.

రెండో బ్లాక్ మెయిలర్ కోసం బ్యాంకుని రెండింతలు దోపిడీచేస్తాడు.

తను చాలానేరాలు చేశాడు; చేస్తున్నాడు; చేయబోతాడు! చరిత్ర సృష్టించి, కుక్కచావు చస్తాడు. ఏనేరం బైటికి పొక్కబోయినా, బ్యాంకు కుంభకోణం తనని సిలువవేసేస్తుంది; — ఇవాళ కాకపోతే, రేపు!

ఆలోచనల్ని అదుపులో పెట్టుకుని గణపతి గోవిందరావు కళ్ళల్లోకి నిర్భయంగా చూశాడు.

"చెప్పండి. ఎంతకావాలి?"

గోవిందరావు ఉలిక్కిపడ్డాడు. అర్థంకానట్టు కాసేపు చూశాడు.

"అయామ్‌సారీ. మీరు నన్ను అపార్థం చేసుకున్నారు! నేను మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయడానికిరాలేదు!"

గణపతి రెప్పలు టపటపలాడించాడు. తను సరిగ్గా విన్నాడా? గోవిందరావు తెలుగే మాట్లాడుతున్నాడా?
"వాట్?" బొంగురుగా అరిచాడతను.

గోవిందరావు తలపంకిస్తూ ఉండిపోయాడు. సరిపడా పంకించాడన్న నమ్మకం కలిగాక, తిన్నగా గణపతిని చూశాడు. "యస్! మీ నేరాన్ని కనిపెట్టి నేను మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయబోతున్నానని సహజంగా మీరు అనుకున్నారు. నాకు ఆ దురుద్దేశం లేదు...."

"మరి, నానుంచీ మీకేం కావాలి?" ఆశ్చర్యాన్ని భరించ లేక గణపతి అడిగాడు.

గోవిందరావు రెండు అరచేతుల్తో మొహం రుద్దు కున్నాడు. కుర్చీలో ముందుకి జరిగాడు. చూపుల్ని మొజాయిక్ డిజైన్‌మీద కేంద్రీకరించాడు. "మీ హయాంలో ఎంబిజిల్‌మెంట్ జరిగిందని నేనన్నాను. కానీ మీ హయాంలోనే కాకుండా మన బ్రాంచిలో ఎంబిజిల్‌మెంట్ జరిగింది...."

"ఏమిటీ?" గణపతి ఆశ్చర్యంతో అరిచాడు.

"అవును! మీరు రాకముందు కూడా పబ్లిక్‌మనీ గల్లంతైంది!" గోవిందరావు నవ్వుతూ అన్నాడు.

"బైట పడిందా?" గణపతి ఉత్కంఠతో అడిగాడు.

గోవిందరావు చిన్నగా నవ్వాడు. "బ్యాంకు గల్లంతులు అంత తేలిగ్గా బైటికిరావు. దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో

కోట్లకొద్దీ ప్రజాధనం గల్లంతయింది; అవుతోంది; బ్యాంకింగ్ సిస్టమ్ మార్చకపోతే అవుతూవుంటుంది! చేసిన గోల్‌మాల్‌లోని చాకచక్యాన్ని అనుసరించి బ్యాంక్ కుంభకోణం బట్టబయలవడంలో వ్యవధి తీసుకుంటుంది? మీరు చేసింది అంత పకడ్బందీగా లేదు. అలాగే గతంలో జరిగిందీ అంత పకడ్బందీగా లేదు...."

"గోవిందరావుగారూ, నేను రాకముందు మన బాంక్‌లో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందెవరు?" గణపతి ఆపుకోలేక అడిగాడు. గోవిందరావు విశ్లేషణ అతన్ని గాభరాతో నింపుతోంది.

గోవిందరావు మళ్ళీ నేలచూపులు చూశాడు. "నే.... నే...."

గణపతి అదిరిపడ్డాడు. "వాట్?"

"మిస్టర్ గణపతీ, ఏవో అవసరాలు నాచేత ఆ పాడు పని చేయించాయి. ఎప్పుడు దొరికిపోతానో అని అనుక్షణం భయపడి ఛస్తూ 'బీపీ' కూడా తెచ్చుకున్నాను. మీరొచ్చిన కొత్తల్లో హడిలిచచ్చాను. ముందున్న మేనేజర్ శుద్ధ మొద్దు. సోమరిపోతు. అంకెలు సరిపడితే అంతే చాలు అతనికి! మీ ద్వారా కూడా నాకు అపాయం వుండదని మీరొచ్చిన కొద్దిమాసాలకే నేను తెలుసుకున్నా. మీ అంతట మీరు కన్నంవేస్తున్నారు. మరొకరు వేసే కన్నాన్ని చూసే అవకాశం. ఆవేశం మీలో లేకుండా పోయాయి!" గోవిందరావు నవ్వుతూ ఆగాడు.

గణపతి అతన్ని ఉద్రేకంతో, చూశాడు. గోవిందరావుని చూసి తను వణికిపోయాడు. ఇప్పుడా అవసరం లేదు. అతను తనకి తోడుదొంగ!

"గోవిందరావుగారూ, మీరు....ఎంత....మొత్తం..?"

ప్రశ్నిస్తూ ఆగాడతను.

గోవిందరావు సిగ్గుపడ్డాడు "ఎంతో ఎక్కడిది లెండి. మహావుంటే రెండు లక్ష లుండొచ్చు. లేదా, మరో పది వేలు దాటొచ్చు. కాదు కూడదంటే పాతిక.... అంతే!"

గణపతి గతుక్కుమన్నాడు. గోవిందరావు సామాన్యుడు కాడు! "గోవిందరావుగారూ, ఎంబెజిల్‌మెంట్ గురించి మీరు తెలివిగా వివరించారు. దొరికిపోయేలా ఎందుకు చేశారు?"

గోవిందరావు చిన్నగా నవ్వాడు. "డబ్బుని గల్లంతు చేయడానికి వుపయోగించే విధానంమీద అంతా ఆధార పడుతుంది. రెండు మూడేళ్ళక్రితం ఒక ఆంగ్ల పత్రికలో బాంకుల్లో పబ్లిక్ మనీ దుర్వినియోగం గురించిన నికార్సైన వ్యాసం ప్రచురింపబడింది. ఒక్క స్టేట్‌బాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీల్లోనే దేశవ్యాప్తంగా కొన్నివందల కోట్లు గల్లంతయిందని అధికారికంగా సిబిఐ వాళ్ళు ధృవీకరించారు! ఆ నేరాల్ని త్రవ్వి వెలికిలాగి, ఒక కొలిక్కి తీసుకురావడం కష్టం! అంత చక్కగా గోల్‌మాల్‌చేసే అవకాశం నాకు చిక్కలేదు!" గోవిందరావు నవ్వుతూ అన్నాడు.

గణపతి నవ్వకుండా వుండలేకపోయాడు. "చెప్పండి. నానుంచీ ఏదో సాయం కావాలన్నారు?"

"మనిద్దరం ఒకే సముద్రంలో, ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం. మనం ఖర్చుచేసిన మొత్తాన్ని ఏడేడు పధ్నాలుగు జన్మలెత్తినా పూడ్చలేం! అంచేత ఏదో విధంగా ఆ గల్లంతుని రూపుమాపాలి!"

"ఎలాగ?" గణపతి నూతనోత్సాహంతో అడిగాడు.

"బుర్ర వేడెక్కేలా ఆలోచించాలి. అవకాశం కోసం

వెయ్యికళ్ళతో చూస్తూ వుండాలి! మొదట మీకు నా అభి ప్రాయం నచ్చిందేమో చెప్పండి....'' గోవిందరావు ఉషారుగా అన్నాడు.

గణపతి సోఫాలోంచీ ఉద్రేకంతో లేచాడు. గోవింద రావు ముందు నిలబడి అతన్ని చిరునవ్వుతో చూశాడు. అతని కుడిచెయ్యి గోవిందరావువైపు సాగింది. గోవింద రావు ఆదరా బాదరా లేచాడు. గణపతి చేతిని పట్టు కున్నాడు.

గణపతి గోవిందరావుతో ఉల్లాసంగా కరచాలనం చేశాడు.

"ఈ క్షణంనుండీ ఇద్దరం ఒకటి!'' అన్నాడు ఆవే శంతో.

గోవిందరావు తల వెనక్కీ ముందుకీ ఆడింది. "చాలా సంతోషం. నా గుండెలమీంచీ కొండదిగిపోయింది. బీపీ నార్మల్‌కి దిగిపోయినట్టుంది. మనిద్దరం ఒకటైతే, ఇంక బ్రహ్మకు కూడా దొరకం!''

గణపతి అతన్ని ఆనందంగా చూశాడు. "అదృష్టం బాగుంది. మా ఆవిడ ఇంట్లో లేదు... లేకపోతే....''

గోవిందరావు సగర్వంగా నవ్వాడు. "మీ ఆవిడ బైటి కెళ్లారని తెలుసుకునే వచ్చాను!''

గణపతి నవ్వాడు. కళ్ళు చిట్లిస్తూ చూశాడు. "గోవింద రావుగారూ, నాగురించి మీరెలా కనిపెట్టారు?''

గోవిందరావు పళ్ళికిలించాడు. "నాలుగుసార్లు మీతో మీ గదిలో కూచున్న 'అప్పు — ఖాతాదారుడు' ఒక్కడే అని కనిపెట్టాను. అతను ఉన్నప్పుడు మీరు మీరుగా నాకు అవుపించలేదు. తరువాత ....ఒకరోజు మీకు ఫోనొచ్చింది.

అప్రయత్నంగా ఎక్స్‌టెన్షన్లో విన్నాను. ఆ సమయంలో మీతో మీ బ్లాక్‌మెయిలర్ మాట్లాడుతున్నాడు."

గణపతి నిట్టూర్చాడు. "ఏదేనా ప్లాన్ ఆలోచించారా!"

"రోజుకొకటి చెప్తాను. ఏది నచ్చితే దాన్ని అమలు జరుపుదాం!" గోవిందరావు నవ్వుతూ లేచాడు.

"కూర్చోండి. కాఫీ తాగి వెళ్దురుగాని...." గణపతి ప్రేమగా అన్నాడు.

గోవిందరావు నవ్వుతూ కూచున్నాడు.

12

రెండునెలలు గడిచాయి. నక్షత్రకమూర్తి గణపతి నుండీ మరో పదివేలు గుంజేశాడు.

అనూరాధ అతన్ని రోజూ వెయ్యిప్రశ్నలు వేస్తోంది. డబ్బు ఎంత కావాలో చెప్తే, తన తండ్రిని అడుగుతానంది. అప్పులు తీర్చేయమ్మంది. అప్పులేమీ లేవని గణపతి ఆమెకి చెప్తూనే ఉన్నాడు. తన మాటల్ని ఆమె నమ్మటంలేదని అతనికి తెలుసు.

గోవిందరావు రంగప్రవేశం చేసి, గూడుపుఠాణీలో చెయ్యి కలిపాక అతనికి కొండంత ధైర్యమొచ్చింది. బ్యాంకింగ్‌లో ఆరితేరిన గోవిందరావు ఏదో అద్భుతంచేసి, బ్యాంకులోని లోటుని భర్తీ చేస్తాడని ఆశతో ఎదురు చూస్తున్నాడతను. మరో విధంగా డబ్బు సర్ది, ఇద్దరూ తవ్విన గోతుల్ని పూడ్చలేకపోయినా, ఏదో అంకెలగారడీ చేస్తాడన్న నమ్మకం గణపతికి కొంత మనశ్శాంతి నిచ్చింది.

... రెండునెలలు గడిచినా గోవిందరావు గుడ్డు పెట్టలేదు! బ్యాంకులో తనతో ప్రత్యేకంగా మసలడంలేదు. మొదట్నుంచీ తనపట్ల ప్రదర్శించిన ఒకతరహా నిర్లక్ష్యాన్నే

ప్రదర్శిస్తున్నాడతను. ఈమధ్య అతని వాలకం చూస్తోంటే గణపతికి అనుమానంగా ఉంది. గోవిందరావు నిజంగా డబ్బు కాజేశాడా? తన రహస్యాన్ని తన నోటమ్మట చెప్పించడానికి, తెలివిగా నాటకం ఆడాడా? తనను హఠాత్తుగా బలితీసుకోడానికి ఏదేనా పథకం వేస్తున్నాడా?....

గణపతి తనముందు నించున్న గోవిందరావుని చూస్తూ ఆలోచనలకి స్వస్తిచెప్పాడు. గోవిందరావు పళ్ళికిలిస్తూ, సంతకాలకోసం రెండు కాగితాల్ని అతనిముందు పెట్టాడు. దగ్గిరగా వొంగి, సంతకాలకోసం కాగితాన్ని తిరగేశాడు.

"రాత్రి ఏడింటికి హోటల్ ఎంపరర్‌కి రండి. గది నంబరు నలభై ...." అన్నాడతను రహస్యం చెప్తున్నట్టు.

గణపతి ఆశ్చర్యపోతూ అతని మొహంలోకి చూశాడు. గోవిందరావు మొహం సాదాగా, మామూలుగా వుంది. అతను ఆరితేరిన నటుడా?

"ఎందుకు?" గణపతి గొణిగాడు.

గోవిందరావు అతను సంతకాలు చేసిన కాగితాల్ని తీసుకున్నాడు. అతనివైపు నిండుకుండలా చూశాడు. "థాంక్యూసార్ ...." అంటూ తిరిగి చూడకుండా స్వింగ్ డోర్ తోసుకుని మాయమయ్యాడు. స్వింగ్‌డోర్‌ని చూస్తూ ఆశ్చర్యంతో వెనక్కివాలాడు గణపతి.

* * *

రాత్రి ఏడుగంటలు.

హోటల్ ఎంపరర్.

నలభయ్యో నంబరు గదిముందు ఆగాడతను. గోవిందరావు తనని ఎందుకు రమ్మన్నాడు? ఏదేనా ప్లాన్ ఆలోచించాడా? పకడ్బందీగా ప్లాన్ చేసి, తనని బ్లాక్‌మెయిల్ చేయబోతున్నాడా? తనున్న పరిస్థితిలో ఎవర్నీ నమ్మడానికి

లేదు. తనని నిస్సహాయుడిగా చేయడానికి నిటలాక్షరావు శోభహత్యను కత్రాటగా వాడుకుంటున్నట్టే, ఎంబెజిల్ మెంట్ ని గోవిందరావు తనని వాయిదాల పద్ధతిలో, సిలువ వేయడానికి, మేకులా వాడుకోబోతున్నాడా?

తటపటాయిస్తూ గణపతి తలుపుమీద చప్పుడుచేశాడు.

వెంటనే తలుపు తెరుచుకుంది. గోవిందరావు గొగ్గిరి పళ్ళు చూపిస్తూ ఆతన్ని ఆహ్వానించాడు. బలిపీఠాన్ని సమీపించే మేకలా గణపతి లోపలికి అడుగువేశాడు. గోవిందరావు తలుపుమూసి, జాగర్తగా గొళ్ళెం బిగించాడు. ఇంకా జాగర్తగా తాళంవేశాడు. గణపతిని సరాసరి బెడ్ రూమ్ లోకి తీసుకెళ్ళాడు. మంచంవైపు చెయ్యి చూపించాడు.

గణపతి కూచున్నాడు.

అతని ఎదురుగా కూచుని, యాష్ ట్రేమీద పొగలు చిమ్ముతున్న సిగిరెట్ ని అందుకున్నాడు గోవిందరావు. పొగ ఊదుతూ ఒకసారి నాలుకతో పెదాల్ని తడుపుకున్నాడు. అతని మొహం చూస్తూంటే, త్వరలో ఏదో బాంబుని పేల్చబోతున్నాడనిపిస్తోంది గణపతికి.

"మిస్టర్ గణపతీ, మీరు ఆరువందల రూపాయలివ్వాలి.... ప్రస్తుతానికి. తరవాత అవసరమైతే అడుగుతాను...." గోవిందరావు మెల్లిగా అన్నాడు.

గణపతి కంగారుగా చూశాడు. చివరికి తెర ఎత్తబడింది. రెండో బ్లాక్ మెయిల్ నాటకం ప్రారంభమయ్యింది! బరువుగా నిట్టూరుస్తూ చూశాడతను. "దేనికి?"

"ఈ గదిని మన కోసం నెల రోజులకి తీసుకున్నా. మనం తరచూ కల్సుకోవాల్సి ఉంటుంది. మనం కల్సు

కోడం నరమానవుడికి తెలీకూడదు!"

"దేనికి?" గణపతి మళ్ళీ అన్నాడు.

"ఇవాళ రేడియోన్యూస్ విన్నారా?" జవాబుగా ప్రశ్నించాడు, గోవిందరావు.

గణపతి అర్థంకానట్టు చూశాడు. "లేదు....ఏం?"

"ఈమధ్య మనదేశంలో, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో బ్యాంకు దోపిడీలు ఎక్కువైపోయాయి. ఒకటి రెండుచోట్ల, సాయుధులు చేసిన దాడిలో సిబ్బంది చని పోయారు...."

"అవును. రెండు రోజుల క్రింత పూనాలో భయంకర మైన దోపిడీ జరిగింది. ఉద్యోగి చనిపోయాడు...." గణపతి అడ్డొస్తూ అన్నాడు; గోవిందరావు ఆ విషయం ఎందుకు ఎత్తాడో అర్థంకాకపోయినా.

"ఆ సందర్భంలో కేంద్రమంత్రి ఆకర్షణీయమైన ప్రకటన ఒకటి చేశాడు...." గోవిందరావు ఆగి, అర్థమైందా అన్నట్టు చూస్తూ సిగరెట్ వెలిగించాడు.

"తెలుసు. ఆ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు; మన ఎంప్లాయీస్....ఇంతకీ ఏమిటిదంతా? ఈ బుర్రకథ వినిపించడానికేనా నన్ను రమ్మంది?" గణపతి చిరాగ్గా అడిగాడు.

గోవిందరావు అమాయకుడైన కొడుకుని చూస్తూ నవ్వే వోపిక ఉన్న తండ్రిలా చిన్నగా నవ్వాడు. "ఈ బుర్రకథ విన్నాక మీ బుర్రలో ఏదో మెరుపులా తళుక్కు మనడంలేదా?" అన్నాడతను గణపతి కళ్ళల్లోకి రెప్ప వేయకుండా చూస్తూ.

గణపతి ప్రశ్నార్థకంగా చూశాడు.

గోవిందరావు తీరుబడిగా ఉపన్యాసం ప్రారంభించాడు;

"కేంద్రమంత్రి ప్రకటన ప్రకారం బ్యాంకుదోపిడీలో, ప్రజాధనాన్ని పరిరక్షించడంకోసం ప్రాణాలు అర్పించిన ఉద్యోగికి లక్షరూపాయల నగదు పరిహారం లభిస్తుంది. అంటే ఉద్యోగి వారసులకి. మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి—అర్హులైనవారికి—ఉద్యోగం ఇస్తారు. అతని సంతానాన్ని డిగ్రీదాకా చదివిస్తారు. గాయపడిన వ్యక్తికి యాభైవేలు నగదు...."

"అదంతా నాకు తెలుసు!" గణపతి అడ్డుతగిలాడు.

"తెలిసిన విషయాన్ని తెలివిగా అన్వయించుకోడం మీకు తెలిసినట్టు లేదు! నన్ను చెప్పనివ్వండి; ఉత్తర భారతదేశంలో జరుగుతున్న దోపిడీల్లాంటిది మనబ్యాంకులో కూడా జరగొచ్చు?" గోవిందరావు చిన్నగా నవ్వాడు.

గణపతి నోరు వెళ్ళబెట్టాడు.

"జరిగితే, అది మనకి లాభిస్తుంది!" గోవిందరావు మళ్ళీ అన్నాడు.

గణపతి చిరునవ్వు నవ్వాడు. గోవిందరావుకి పిచ్చి పట్టిందా? "జరిగితే, మనిద్దరం రెండేసిసార్లు చచ్చిపోయి నాలుగేసిసార్లు గాయపడితేగానీ మనకి అవసరమైనంత—ఖచ్చితంగా చెప్పాలంటే—మనం మాయం చేసినంత పైకం రాదు!"

ఎగతాళిగా అన్న గణపతిని గోవిందరావు విచారంతో చూశాడు.

"అది నాకు తెలుసు. చచ్చిపోయాక ఎన్నిలక్షలొచ్చినా మనకి లాభంలేదు! అడ్డురాకుండా నా ఆలోచనని వినండి: మన బ్యాంకులో దోపిడీ జరుగుతుంది. మీరూ నేనూ, ఇద్దరం—కావాలనుకుంటే—జాగ్రత్తగా గాయపడొచ్చు. అది రెండువిధాల ఉపయోగిస్తుంది. చెరో అరలక్షా చేతి

కొస్తుంది. విశ్వాసపాత్రులైన బ్యాంక్ ఎంప్లాయీస్‌గా పేరొస్తుంది. పేపర్ల దృష్టిలో. ప్రజల దృష్టిలో. చట్టం దృష్టిలో మనం నిజాయితీ. ధైర్య కలిగిన భారతపౌరులుగా రూపొందుతాం! అది మనకెంతో అవసరం. ఆ ప్రఖ్యాతి, మనం చేయబోయే—, చేయించబోయే నేరంలో మనల్ని అమాయకులుగా ఉంచుతుంది!"

గోవిందరావు ఆగి. మెరుస్తున్న కళ్ళతో చూశాడు. గణపతి ఆశ్చర్యంగా అయోమయంగా చూశాడు.

"మనం చేయించే నేరమా?" బొంగురుగా ప్రశ్నించా డతను.

"ఎస్! మనిద్దరం మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఒక దోపి డీని జరిగిద్దాం!"

"డబ్బు తాపత్రయంతో మీ బుర్ర తిన్నగా పని చేయడంలేదు! ఎలా సాగిస్తారు? ఏమిటి సాధిస్తారు?" గణపతి విసుగ్గా అన్నాడు.

"ఎలా సాగిస్తామో ప్రస్తుతం చెప్పలేను. ఏమిటి సాధించగలమో చెప్తాను! మనిద్దరం సుమారుగా నాలుగు లక్షల పైచిలుకు గల్లంతుచేశాం. టుబీ ఆన్‌ది సేఫర్ సైడ్, అయిదులక్ష లనుకుందాం! దోపిడీ జరిగేరోజు కౌంటర్లో అయిదులక్షలో, ఆరులక్షలో ఉండేలా చూద్దాం"

"కౌంటర్లో అంత పెద్ద మొత్తం...."

"ఫరవాలేదు. వీల్లేకపోతే స్ట్రాంగ్ రూమ్‌లోనే కథ నడిపిద్దాం. దోపిడీలో పోయే మొత్తానికి మనం వాడుకున్న మొత్తం కలిపి, ఆ మొత్తమంతా పోయినట్టు లెక్కలు చూపిస్తాం. మాటవరసకి....ఆరులక్షలు దోచుకోబడుతోం దనుకోండి. అది పదకొండ లక్షలవుతుంది?" విషయం గణపతికి జీర్ణం అవడానికన్నట్టు ఆగి, కళ్ళతో నవ్వుతూ

చూశాడతను.

గణపతి మొహంలో ఇందాకటి చిరాకు మాయమై పోయింది. అతని కళ్ళల్లో కొత్త వెల్తురు ప్రతిఫలిస్తోంది! తను గోవిందరావుని తక్కువగా, తప్పుగా అంచనా వేశాడు! ఉద్రేకంతో మరో సిగిరెట్ వెలిగించి, పాకెట్ని గోవిందరావు వొళ్ళోపడేలా విసిరాడు.

"తరువాత?"

"తరువాత....ఆ ప్రయత్నంలో మనం తగుమాత్రం గాయపడతాం. ఇందాకా చెప్పినట్టు, గాయాలు డబ్బునీ, పేరునీ ఇస్తాయి. పేరుకుపోయిన పాతబాకీ దెబ్బకు తీరి ఊరుకుంటుంది! ఇంకా .... కావాలంటే .... మీరు.... ఇంకా....సొమ్ము....చేసుకోవచ్చు!"

"వాట్?" గణపతి ఆశ్చర్యంతో అరిచాడు.

"సన్నదిగితే యాభై వేలు తవుడుతో సమానం. మరో జాక్‌పాట్ కూడా కొట్టే అవకాశం ఉంది...."

"ఏమిటది? చెప్పండి!"

గోవిందరావు సగర్వంగా నవ్వాడు. "దోపిడీ అయ్యే సొమ్ముని పెంచండి. అందులో కావాల్సినంత వాటా తీసేసుకోండి! సింపుల్!"

"గుడ్‌గాడ్!" గణపతి అరిచాడు. కాసేపట్లో అతని మొహాన్ని నిరుత్సాహం నీడలా కప్పేసింది. "దోపిడీ సొమ్ములో వాటా ఎవడిస్తాడు? ఇంతకీ దోపిడీ ఎవడు చేస్తాడు?"

"అదే మనకి గడ్డుసమస్య. నమ్మకస్థుడైన, నిజాయితీ పరుడైన 'మంచి దొంగ' మనకి చిక్కాలి. అలాంటి వ్యక్తిని మనం అన్వేషించి పట్టుకోవాలి. మనకి మూడు లాభాలున్నాయి: ఒకటి: ప్రమాదం రాకుండా తేలిగ్గా

గాయపడ్డం. రెండు: దొంగిలించబడిన పైకంలో వాటా పొందడం. మూడు: భవిష్యత్తులో ఇదంతా బైటికి పొక్కకుండా ఉండటం—మనం చెప్పినట్టు వినే హైక్లాస్ వ్యక్తి, దోపిడీదొంగ మనకి దొరకాలి!" గోవిందరావు ఉషారుగా అన్నాడు.

గణపతి నవ్వుతూ చూశాడు "గోవిందరావుగారూ, మీ ప్లాన్ అద్భుతంగా వుంది! కానీ ఒక్కటే లోపం....!"

"ఏమిటది?" గోవిందరావు కళ్ళు చిట్లించాడు.

"మంచి దొంగ! విషం దొరుకుతుంది; కానీ ప్రాణం పోసే విషం దొరకదు! అలాగే దొంగ దొరకొచ్చు. కానీ 'నిజాయితీపరుడైన మంచి దొంగ' దొరకడు!" గణపతి నవ్వుతూ అన్నాడు.

గోవిందరావు నవ్వలేదు. తదేకంగా అతని మొహంలోకి చూశాడు "నా ప్లాను నేను చెప్పాను. అందులో చిల్లులు కనిపిస్తే మానేయొచ్చు! కానీ ఇంతకన్నా మేలైన పథకాన్ని మీరు చూపించలేరు. ఏ పనైనా కష్టంమీదే సాధించబడుతుంది. ఇందులోని కష్టమంతా సరైన వ్యక్తిని కనిపెట్టడం. అంతే!"

గణపతి కాసేపు మాట్లాడకుండా ఆలోచిస్తూ వుండిపోయాడు. మెరుస్తున్న కళ్ళతో గోవిందరావుని చూశాడు. "గోవిందరావుగారూ, కంగ్రాచ్యులేషన్స్! నిజంగానే బ్రహ్మాండమైన ప్లాన్ చెప్పారు. అనుకున్న పని సాధించే వ్యక్తికోసం అన్వేషించుదాం!"

గోవిందరావు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. కుర్చీలోంచి లేచి, గణపతి చేతిని పట్టుకుని నొక్కాడు. కిందికి వొంగి, మంచంకిందనుంచి విస్కీ బాటిల్నీ, గ్లాసుల్నీ ఇవతలికి లాగాడు. టీపాయ్‌ని ఇద్దరి

మధ్య ఉండేలా లాగి, వాట్ని దానిమీద పెట్టాడు. నవ్వుతూ గణపతిని చూశాడు.

పది నిమిషాల తరువాత ఇద్దరూ విస్కీగ్లాసుల్ని ఢీకించారు.

"మన విజయానికి?" గణపతి నవ్వుతూ అన్నాడు.

"ఘనవిజయానికి!" గోవిందరావు నవ్వాడు....

13

రాత్రి రెండు గంటలయింది.

నిద్ర పట్టని గణపతి మంచం మీంచి లేచాడు. పక్కకి తిరిగి హాయిగా నిద్రపోతున్న అనూరాధని చూస్తూ కాసేపు నిలబడ్డాడు.

ఆమెకి తనంటే ఎంతో ప్రేమ! అందుకే ఆమెతో పాటు వచ్చిన స్కూటర్నీ, టీవీనీ, నగల్నీ తను మాయం చేసినా ఆమె తనని ద్వేషించటం లేదు. కనీసం తన నగల్ని తెచ్చి ఇమ్మని సాధించడం లేదు. జీవితంలో మొదటిసారిగా తనకి శోభతో కాకుండా అనూరాధతో పరిచయం అయ్యుంటే తనిలా వుండేవాడు కాదు! బ్రతుకు తియ్యటి కలలా, హాయిగా సాగిపోయేది. గణపతి నిట్టూరుస్తూ, హాల్లోకి వెళ్ళాడు.

సోఫాలో కూకుని సిగరెట్ వెలిగించాడు. తనకి ఎందుకు నిద్ర పట్టడం లేదు. అతనికి తెలుసు. హోటల్ గదిలో గోవిందరావు వివరించి చెప్పిన ప్లాన్ తన మీద 'డెక్సిడ్రిన్'లా పనిచేస్తోంది. ఏదో ఉత్సాహం - ఏదో సందేశం రెండూ కలిసి తన నిద్రని దూరంగా తరిమేశాయి.

విస్కీ తాగుతూ, తన ప్లాన్‌కి ఆపకుండా భాష్యం చెప్తూ, అనుకున్నది జరిగాక తమ జీవితాలు ఎలా

వుంటాయో, తాము ఎంత కులాసాగా వుంటారో ఏకరువు పెడుతూ ఎన్నో ఐడియాల్ని తన లోపలకి సుత్తితో దిగేశాడతను! ఎంత ఆలోచించినా అంతకంటే చక్కని పథకం అతనికి బుర్రకి తట్టడంలేదు. రెండు గంటలదాకా జాగారంచేసి, గోవిందరావు ప్లాన్ని అమలు జరపడం తప్ప మరో మార్గం లేదన్న నిశ్చయాని కొచ్చాడతను. అది తన సమస్య లన్నింటికీ పరిష్కారం కాకపోవచ్చు. కనీసం బాంకు అవకతవకలు సమాధి అయిపోతాయి. గోవిందరావు చెప్పినట్టు 'జాగ్రత్తగా గాయం చేయించు కుంటే' వో యాభయి వేలు తనవాళ్ళో వాల్తాయి.

దోపిడీ సాగించే 'మంచిదొంగ'తో పకడ్బందీగా మాట్లాడి కొన్ని లక్షలు వచ్చేలా చూసుకుంటే. కొన్నేళ్ళ పాటు తను తాపత్రయం లేకుండా... గణపతి ఆలోచనలు ఏదో గోడకి కొట్టుకున్నట్టు ఆగిపోయాయి. తను ఎన్ని లక్షలు సంపాయించగలిగినా ఆ లక్షలన్నింటినీ లక్షణంగా తన్నుకుపోవడానికి నిటలాక్షరావు గెద్దలాగా కాచుకునే వుంటాడు!

గణపతి సగం కాలిన సిగరెట్‌ని కిందపడేసి, కాలి బొటనవేలితో నొక్కుతూ, కసిగా నొక్కుతూ వుండిపోయాడు. ఆ నిటలాక్షరావుగాడినీ, నక్షత్రకుడుగాడినీ ఇలా కాలరాస్తే గానీ తను ఆర్జించినదాన్ని అనుభవించలేడు! గణపతి విచారంతో నిట్టూర్చాడు. దోపిడీలో గాయం చేయించుకుని, యాభయివేలు బహుమతి సంపాయించినా లాభం లేదు. దాన్ని గురించి పేపర్లో వార్త పడగానే, ఒకే ఒక ఫోన్ కాల్‌తో నిటలాక్షుడు దాన్ని ఎగరేసుకుపోతాడు.

గణపతి పళ్ళు కొరుక్కుంటూ సిగరెట్ వెలిగించాడు.

దోపిడీ యేర్పాటు మూలంగా తనకి సంపూర్ణమైన లాభం చేకూరదు. రెండే రెండు చిన్న లాభాలు తనకి దక్కు-తాయి. ఇంతకాలం తను అక్రమంగా వాడుకున్న డబ్బు బెడద తప్పుతుంది. భవిష్యత్తులో కొన్నాళ్ళపాటు తడువు కోకుండా, అనుక్షణం భయపడుతూ అవకతవకలకి పాల్పడకుండా సీటలాక్షరావుకి అడిగినప్పుడల్లా అడిగినంత ముట్టజెపుతూ వుండొచ్చు.

ఆలోచిస్తుంటే ప్రస్తుతం వున్న భయంకర పరిస్థితి కన్నా అదే కొంచెం నయంగా అనిపిస్తుందతనికి. ఐతే దోపిడీలో వాటా రూపంలో స్వీకరించిన పైకాన్ని ఎవ్వరికీ తెలీకుండా తను జాగర్త చేయాలి. బాంకులో పోబోయే నోట్ల నంబర్ల మూలంగా ఉత్తరోత్రా గొడవ రాకుండా వుండటానికి ఏదో ఉపాయం ఆలోచిస్తానన్నాడు గోవిందరావు.

తమ పథకాన్ని తు.చ. తప్పకుండా అమలు జరిపే చాకులాంటి వ్యక్తిని వెతికే ప్రయత్నంలో వుండమన్నాడు గోవిందరావు. ఆలోచనలు గణపతిని సోఫాలో కూచో నివ్వడం లేదు. అతను లేచాడు. పచార్లు ప్రారంభించాడు. రాష్ట్రంలో తెలివిగా, ధైర్యంగా దొంగతనాలు చేసిన వ్యక్తుల కోసం అతని మెదడు వెదకసాగింది. తగిన వ్యక్తిని వెతకాలి. పార్టనర్స్‌కి మూతి మీద వాతలుపెట్టే ఉద్దేశం లేని వ్యక్తి కావాలి.

ఆలోచిస్తుంటే గాయాలు చేయించుకోడం మూర్ఖమయిన పనిగా, అపాయంతో కూడిన పనిగా అనిపిస్తోందతనికి.

ఈ చేతితో తీసుకున్న యాభయివేల నష్టపరిహారాన్ని ఆ చేతితో గుంటనక్కపాలు చేయడం తనకి ఇష్టంలేదు.

అదీగాక ఆ వ్యక్తి ఎవడో తమని జాగ్రత్తగా తేలిగ్గా గాయపరుస్తాడన్న గ్యారంటీ లేదు. ఆ సమయంలో అతనూ కంగారులో వుంటాడు. అతనికీ గుండెల్లో గుర్రాలు పరుగెడుతూ వుంటాయి. ఎక్కడో పొడవబోయి మరెక్కడో చాకు దిగేయొచ్చు! చేతిని కాల్చబోయి ఛాతీలోకి తూటా దూర్చొచ్చు.

హఠాత్‌గా గణపతి శరీరం గగుర్పొడిచింది. తమతో పార్ట్‌నర్‌గా చేరబోయే ఆ దొంగ, తమని ఉద్దేశపూర్వకంగా చంపిపారేయడానికి తామే మంచి మోటివ్‌నీ, అవకాశాన్నీ కలిగించేలా వున్నారు! పార్ట్‌నర్‌గా నటిస్తూ అతను నిర్దాక్షిణ్యంగా, తమని చంపేయొచ్చు. చంపుతాడు కూడా!

తమని చంపడంవల్ల అతనికి రెండు రకాలుగా లాభిస్తుంది. తమకి యివ్వాల్సిన వాటా పైకం అతనికే మిగిలిపోతుంది. ఉత్తరోత్రా తను చేసిన దోపిడీకి సాక్షులుగా వుండే అవకాశం వున్న వ్యక్తుల్ని లేకుండా చేసినట్టూ అవుతుంది!

తన ఆలోచనలకి గణపతి తనని లోలోపలే మెచ్చుకున్నాడు. గోవిందరావు ఇలా ఆలోచించినట్టు లేదు. డబ్బిచ్చి చంపించుకున్నటవుతుంది తమ పని! గణపతి తేలికగా నిట్టూరుస్తూ మళ్ళీ సోఫాలో కూచున్నాడు. మొదటి పథకంలోని 'గాయాలు చేయించుకునే' కార్యక్రమాన్ని నిర్ద్వంద్వంగా కొట్టివేశాడతను.

గోవిందరావుకి డబ్బాశ అధికంగా వున్నట్టుంది. యాభయివేల కోసం, పేరు కోసం గాయపడ్డానికి-అతను సిద్ధంగా వున్నాడు. అసలు డ్రామాలోని అసలు సీను లోంచి 'గాయాల' సన్నివేశాన్ని తొలగిస్తే గోవిందరావు

కంగారంలో పోతాడు. సమయం చూసి అతనికి నచ్చ జెప్పాలి....

పథకంలో వున్న అపాయకరమైన లోపాన్ని వెలికి తీశాక గణపతిని మళ్ళీ అసలు ప్రశ్న ఎదుర్కొంది. తమ ప్లానుని అమలు జరిపే వ్యక్తి ఎవరు? ఎవరు? ఎవరు?

ఘాటుగా దమ్ము లాగి, గణపతి కళ్ళు మూసుకున్నాడు. అతని మెదడులో సంకుల సమరం సాగుతోంది. తను అన్వేషిస్తున్న నేరస్థుడికి, లేదా 'కాబోయే' నేరస్థుడికి రెండు భిన్నమైన గుణాలుండాలి! ధైర్యం, తెగింపు. తమని మోసం చేయరాదన్న తగుమాత్రం నిజాయితీ!

పని పూర్తయ్యేదాకా, ఎవరి వాటాలు వాళ్ళకి దక్కేదాకా అతని కళ్ళేలు భద్రంగా తన చేతిలో వుండాలి! అనుకున్నంతా అయ్యాక, చేసిందాన్ని గురించి ఎవ్వరూ చెప్పుకోరు! చెప్పిన మరుక్షణం, కోతితోబాటు తోకలాగా చెప్పినవాడూ మునిగిపోతాడు! గాయాలు చేయమన్న సూచనతో, హత్యచేసే ఐడియాను ఆ దొంగలో తాము పుట్టించక పోవచ్చు.

ఈ అడ్వెంచర్లో పాల్గొనడానికి తెగించే వ్యక్తి సహజంగా తెలివైనవాడై వుంటాడు. ఇవ్వాల్సిన వాటాల్ని తన గురించి చక్కగా తెలిసిన సాక్షుల్ని మాయం చేయడం ఉభయతారకం అన్న ఆలోచన అతనికి రాకుండా పోదు! అప్పుడు గోవిందరావూ, తనూ 'గోవిందా' అయి పోతారు!

మెదడుని చిత్రవధ చేస్తూ, ఆలోచిస్తున్న గణపతిలో ఏదో తారాజువ్వలా వెలుగుతూ దూసుకెళ్ళింది. గుడ్ గాడ్! గుడ్ గాడ్! తను జేబులో చక్కటి దొంగను పెట్టుకుని లోకమంతా గాలిస్తున్నాడు!

గణపతి ఉద్రేకంతో లేచి నిలబడ్డాడు. ఆరితేరిన దొంగ, తమ పథకానికి కత్తిరించి కుట్టినట్టు చక్కగా సరిపోయే దొంగ తన దగ్గిరేవున్నాడు: నిటలాక్షరావ్.

ఆలోచిస్తూ అప్రయత్నంగా పచార్లు ప్రారంభించాడతను. నిటలాక్షరావుని ఉపయోగించుకోడంవల్ల, తనకి రెండు లాభాలున్నాయి. తెలివిగా ప్లాన్‌చేసి, చాకచక్యంగా మాట్లాడి బాంకు దోపిడీ అవకాశం కల్పిస్తూ, దానికి బదులుగా అతని దగ్గిరున్న, అతని గుప్పెట్లో ఇరుక్కున్న తన పంచప్రాణాల్ని విడిపించుకోవచ్చు!

కావాలంటే తనకి రావాల్సిన వాటా కూడా ఆ పాపిష్ఠివాడికి వదులుకోడానికి తను సిద్ధంగా వున్నాడు. ప్రస్తుతం తనకి కావాల్సింది డబ్బుకాదు; విముక్తి!

వాయిదాల పద్ధతిమీద పదివేలూ, పాతికవేలూ వసూలు చేసుకుంటూ ఉంటంకన్నా, ఒక్కసారిగా కొన్నిలక్షలు తీసేసుకుని. ఆ 'సరంజామా'ని తనకి ఇచ్చేయమంటే, నిటలాక్షరావు అంగీకరించాలి. డబ్బు విలువ తెలిసినవాడెవడైనా అలాంటి బేరాన్ని కళ్ళుమూసుకుని వొప్పుకుంటాడు; ఎగిరి గంతేస్తాడు.

ఒకవేళ అతను అంగీకరించకపోతే? గణపతి తన తర్కాన్ని ప్రశ్నించాడు.

అంగీకరించకపోతే....తను మరొకరిద్వారా ఆ పని చేయించాల్సి వుంటుంది. చేయిస్తే, ఆ నేరం మళ్ళీ 'బ్లాక్ మెయిల్-2' అమలు జరపడానికి నిటలాక్షరావుకి బ్రహ్మాండంగా ఉపయోగిస్తుంది!

అంటే తను ప్లాను గురించి నిటలాక్షరావుకి చెప్పకూడదు. చెప్తే, అతను వొప్పుకోవాలి! తను అతన్ని వొప్పించాలి. నిటలాక్షరావు ద్వారా ఆ పని జరిగితే తనకి

మరో లాభం కూడా వుంది. కావాలంటే అతను తనని జాగ్రత్తగా, గాయపరుస్తాడు. అతను తనని చంపడు. బంగారు గుడ్లు పెట్టే బాతుని చంపే మూర్ఖుడు కాడతను!

చీకటిలో గణపతి కళ్ళు మెరిశాయి.

నిటలాక్షరావు బ్యాంకు దోపిడీ సాగించడానికి అంగీకరిస్తాడు. అతన్ని అంగీకరింపజేసే ఆయుధం తనదగ్గరుంది! తన దగ్గరున్న ఆయుధం గురించి ఇప్పుడే అతనికి గుర్తొచ్చింది. తను ఆ ఆయుధాన్ని ప్రయోగిస్తే నిటలాక్షరావు తను ఆడమన్నట్టు ఆడుతాడు....

14

ఒక నిర్ణయానికి వచ్చాక, గణపతి నిటలాక్షరావు ఫోన్ కాల్ కోసం, నక్షత్రకమూర్తి రాకకోసం వెయ్యి చెవుల్తో, వెయ్యి కళ్ళతో ఎదురుచూడసాగేడు.

అతని కంఠం వినిపిస్తుందనీ, నక్షత్రకుడు కనిపిస్తాడనీ రెండేళ్ళక్రితంనుంచీ కంగారుతో భయాందోళనలతో రోజులు దొర్లిస్తూ వచ్చిన తను ఇప్పుడు వాటికోసం పరాయిదేశం వెళ్ళిపోయిన భర్తకోసం భార్యలా ఎదురు చూస్తున్నాడు!

ఉన్నట్టుండి టేబుల్ మీదున్న టెలిఫోన్ మోగింది.

గణపతి తటాలున రిసీవర్ని చెవిదగ్గరగా లాగాడు. ఎవరో డిపాజిటర్. అతను చెప్పిందంతా విసుగ్గావిని, విసుగ్గా రిసీవర్ని పడేశాడతను.

స్వింగ్ డోర్ తోసుకుని గోవిందరావు లోపలికొచ్చాడు. సంతకాలకోసం ఏవో స్టేట్ మెంట్స్ని అతనిముందు పెట్టాడు.

గణపతి అతనివైపు సాభిప్రాయంగా చూశాడు. గోవిందరావు మొహం ఏదో ముసుగు తొడుక్కున్న

ట్టుంది. చూసినవాళ్ళకి, అతనికీ గణపతికీ పొసగట్లేదని అనుకుంటారు.

గణపతి మౌనంగా సంతకాలు గీకసాగేడు. ఒక్కో స్టేట్ మెంట్ నీ గోవిందరావు తీసుకుంటున్నాడు. నాలుగు స్టేట్ మెంట్స్ అయ్యాయి. అయిదో స్టేట్ మెంట్ మీద సంతకం చేయబోతూ ఆగాడతను.

కాగితం పూర్తిగా తెల్లగావుంది. అతని కళ్ళు పైకి జరిగాయి. పొడుగాటి కాగితంలో సగంపైన "రాత్రి ఏడింటికి హోటల్ గదికి రండి" అని ఇంగ్లీషులో రాసి వుంది.

గణపతి ఆశ్చర్యంతో నోరు తెరిచి, గోవిందరావు వైపు చూశాడు. గోవిందరావు ఆ కాగితాన్ని కొద్దిగా పైకి లాగాడు. గణపతి తలవాల్చి చూశాడు. సంతకం చేయాల్సిన మరో స్టేట్ మెంట్. గోవిందరావు తీసుకుంటున్న జాగ్రత్తకి నవ్వుకుంటూ సంతకం చేశాడు. దాన్నీ, కాగితాన్నీ తీసుకుని ఏమీ ఎరగనివాడిలా వెళ్ళిపోయాడు గోవిందరావు.

సిగరెట్ వెలిగించి, గణపతి వెనక్కివాలాడు. గోవిందరావు ఎందుకు రమ్మంటున్నాడు? తను చెప్పిన క్వాలిటీస్ వున్న వ్యక్తిని పట్టాడా కొంపదీసి? అదే జరిగి వుంటే, తన ప్లానంతా బెడిసికొడుతుంది. ఒక్క దెబ్బకి రెండు పిట్టల్ని కొట్టాలని తను బుర్ర బద్దలుకొట్టుకుని ప్లాన్ ని డెవలప్ చేశాడు. గోవిందరావు ఎన్నుకున్న వ్యక్తిలో ఏదో లోపం చూపించి, తను అనుకున్నట్టు కథ నడిపించాలి. నిటలాక్షరావుని వాడుకోవాలి....

* * *

"ఏమిటి విశేషం?" ఎదురుగా కూచున్న గోవింద రావుని ప్రశ్నించాడతను.

"మీరు ఆరువందలివ్వాలి...." గోవిందరావు మెల్లిగా అన్నాడు. "నిన్న జీతం తీసుకున్నారుగా, మీమీద ఆధార పడ్డవాళ్ళెందరో....అందుకని...."

గణపతి అతన్ని కళ్ళతో చీదరించాడు. జేబులోంచి పర్సుతీసి, ఆరువందరూపాయనోట్లు లాగి ఆతనివైపు చాపాడు. గోవిందరావు అందుకుని జేబులో దోపు కున్నాడు.

"ఇందుకేనా రమ్మన్నారు?" గణపతి కంఠంలో ఆక్షే పణ స్పష్టంగా ధ్వనించింది.

గోవిందరావు చిరునవ్వు నవ్వాడు. "మనిద్దరం ఎంత చిన్నపని చేసినా, చాలా జాగ్రత్తగా చేయాలి; అను తున్నది అయ్యేదాకా! ఆఫ్‌కోర్స్ ఇందుకోసం మాత్రమే మిమ్మల్ని రమ్మనలేదు...."

గణపతి ఆత్రంగా చూశాడు. అయితే ఈ ముసలాడు ఎవర్నో పట్టాడన్న మాట! "చెప్పండి."

"వీరుడికోసం వెతుకుతున్నారా?" గోవిందరావు అడిగాడు.

"ఇంకా వెతకాలి...."

"మనం త్వరగా పని ముగించాలి. మీకు తెలుసో తెలీదో, ఈ మధ్య బ్యాంక్సమీద హఠాత్తుగా తనిఖీలు జరుగుతున్నాయి. బ్యాంకు మేనేజర్ల ఇళ్ళమీదకూడా...."

"నా ఇంట్లో ఏమీలేదు!" గణపతి నవ్వుతూ అన్నాడు.

"ఇంట్లోవున్నా; బ్యాంకులో లేకపోయినా, కొంప లంటుకుంటాయి! ఏ క్షణంలో ఎవరొస్తారో తెలీదు. మనం ఎవణ్నో పట్టాలి. మీరు ఏదో చేస్తారనుకున్నాను."

"మీరు?" గణపతి ప్రశ్నించాడు.

"నాకు తెలిసినంతవరకూ ఎవ్వరూ లేరు. గతంలో పేరుపొందిన బడుద్ధాయిలంతా కటకటాల వెనక తపస్సులో వున్నారు?" గోవిందరావు నవ్వుతూ అన్నాడు.

గణపతి తేలిగ్గా నిట్టూర్చాడు. "చూస్తున్నా. మనం ఎన్నుకున్న వ్యక్తి, పథకం గురించి విన్నాక వెనక్కి జారుకోకూడదు. అతను దిగి తీరాలి. లేకపోతే ప్రమాదం!"

"కరెక్ట్!" గోవిందరావు మెప్పుగా తలాడిస్తూ అన్నాడు.

"అంచేత నిదానంగా అన్వేషిస్తున్నా...."

"వేగం పెంచండి. లాంగ్‌టర్మ్ డిపాజిట్ పథకంలా ఇది ఏళ్ళ తరబడీ సాగకూడదు!" గోవిందరావు నవ్వుతూ అన్నాడు. గణపతి నవ్వి సిగరెట్ వెలిగించాడు.

"గోవిందరావుగారూ, చాలా జాగర్తగా, రహస్యంగా నేను మనకి కావాల్సిన వ్యక్తికోసం గాలిస్తున్నా. మూడొంతులు ఈ నెలాఖరులోగా ఆ వ్యక్తి మనకి దొరకొచ్చు...."

"వెరీగుడ్! ఇంకా త్వరగా వీలైతే చూడండి. ఆలస్యమైతే పాలు విరిగిపోతాయ్. అదను చూసి తోడుపెట్టాలి! ఈలోగా మనం చాలా విషయాలు డిస్కస్ చేయాలి...."

"ఏమిటవి?"

"నాటకం జరిగే తేదీ. టైమ్. పద్ధతి. వగైరా. ముఖ్యంగా, నాటకం పూర్తయ్యాక కలెక్షన్స్‌లో మన వాటాల్ని ఎక్కడ, ఎప్పుడు ఎలా తీసుకోవాలి? మనకి గాయాలు తగిల్తే, బాజాభజంత్రీల్తో ఊరేగిస్తూ హాస్పిటల్‌కి తీసికెళ్తారు. స్పెషల్ రూమ్స్‌లో స్పెషల్ ట్రీట్‌మెంట్

ఏర్పాటుచేసి, కొన్నాళ్ళపాటు మనల్ని హాస్పిటల్ అనే జైల్లో పడేస్తారు! ఇంక ప్రెస్‌రిపోర్టర్లూ, కెమెరాలూ, ఇంటర్వ్యూలూ....వగైరా తంతు! అంటే మనం నాటకం అయిన వెంటనే వాటాలు తీసుకునే స్థితిలో వుండమన్న మాట!" గోవిందరావు నవ్వుతూ చూశాడు.

"కరెక్ట్! ఏంచేద్దాం?" గణపతి ప్రశ్నించాడు అమాయకంగా. కారణం వేరైనా తన నిర్ణయం దగ్గరగా పాకుతున్నాడతను.

"మనం హీరోలైపోయి, డాక్టర్ల మధ్యా, నర్సులమధ్యా, రిపోర్టర్లమధ్యా ఇరుక్కుపోతే నాటకం హీరో నిండు కుండతో మాయమైపోతాడు!" గోవిందరావు నవ్వి, సిగరెట్ ముట్టించాడు.

"అవును. అలా జరిగినా ఆశ్చర్యపడక్కర్లా! యాభై వేల కోసం చూస్తే లక్షలు ఎగిరిపోయేలావున్నాయి. ఆవాలకోసం, గుమ్మడికాయలు పోగొట్టుకుంటాం. అంచేత ...."

"గాయపడ్డం వద్దనకండి!" గోవిందరావు అడ్డు తగిలాడు. "ఆ గాయాలు మన మీదికి అనుమానం రాకుండా అడ్డుగోడల్లా, మన నిజాయితీకి నిదర్శనాల్లా పనిచేస్తాయి. ఆ వ్యక్తిని మనం పూర్తిగా బెదరగొడ్తాం. మనవాటాల్ని మనం చెప్పినచోట వదిలి పెళ్ళమందాం. అలా జరక్కపోతే అతని మీదికి అనుమానం వచ్చేలా...."

గణపతి చెయ్యెత్తి అతన్ని వారించాడు. "మనం అతన్ని పట్టిస్తే, అతను మనల్ని పట్టిస్తాడు. జరిగిందంతా కక్కేసి, కొట్టేసినమూటని అక్కడపెట్టేసి, అప్రూవర్‌గా మారిపోయి మనల్ని క్రైమ్ చేయించేస్తాడు!"

గోవిందరావు తల ఆడించాడు. "అదీ నిజమే. ఆల్

రైట్....ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం....'' అంటూ అతను జేబులోంచీ ఒక కాగితాన్ని తీసి మడత విప్పాడు. నవ్వుతూ గణపతిని చూశాడు.

"నాటకానికి రంగం ఎలా సిద్ధంచేయాలో రాశాను. వినండి;'' అంటూ కళ్ళద్దాలు తగిలించి చదవడం ప్రారంభించాడు.

"ఒకటి: వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో జరగాలి. అప్పుడైతే విత్‌డ్రాల్స్ ముమ్మరంగా వుంటాయి. కౌంటర్లో నగదు పెద్ద మొత్తం ఉంటుంది.

రెండు: ఆ రోజు కౌంటర్లో టెల్లర్‌ని మార్చాలి. నేను టెల్లర్ డ్యూటీలో ఉండాలి.

మూడు: బ్యాంకు లేఔట్ మన 'హీరో'కి ప్లాన్ గీసివ్వాలి. కౌంటర్లూ, స్ట్రాంగ్‌రూమ్, తలుపులూ, గార్డు పొజిషన్, అన్నీ అతనికి కొట్టిన పిండిలా అయిపోవాలి.

నాలుగు: దాదాపుగా ఎంత మొత్తం దొంగిలించబడాలో మనం నిర్ణయించాలి.

ఐదు: ఆ సమయంలో కౌంటర్లముందు జనం ఎంత మందివుంటారో ఉజ్జాయింపుగా 'హీరో'కి చెప్పాలి.

ఆరు: అనుకూలమైన టైమ్ నిర్ణయించాలి.

ఏడు: బహుమతికోసం గాయపడాలన్న తాపత్రయంతో జొరబడే బృహస్పతులూ సిబ్బందిలో ఉండొచ్చు. ఎంతమందినేనా అదుపులో పెట్టగలిగే ఆయుధాలతో సర్వసన్నద్ధంగా 'హీరో'ని రమ్మనాలి.

ఎనిమిది: 'హీరో' వెంట ఎంతమంది ఉండాలో, రద్దీని వూహించి మనం నిర్ణయించాలి. వాళ్ళందరూ తగిన ఆయుధాలు ధరించాలి.

తొమ్మిది: నాటకంలో సూత్రధారులు, తెరవెనక ఉండి

ఆడించేవాళ్ళు మనిద్దరమే అని 'హీరో'కి తప్ప అతని అనుచరులకి ఎలాంటి సందర్భంలోకూడా తెలీకూడదు."

చదవడం ముగించి గోవిందరావు మెరిసే కళ్ళతో చూశాడు.

గణపతి అతన్ని గుడ్లు పెళ్ళగించి చూస్తున్నాడు. నిస్సందేహంగా గోవిందరావుది బ్రహ్మాండమైన బుర్ర! అతనికి వదిలేస్తే నాటకాన్ని విజయవంతంగా నడిపించేస్తాడు!

"ఎక్సలెంట్ హూమ్‌వర్క్! గోవిందరావుగారూ మీది అమోఘమైన తెలివి. అంతా ఇలాగే జరిగితే మనం జయించడం గ్యారెంటీ!" గణపతి ఉత్సాహంగా అన్నాడు.

"థాంక్స్! ఎన్నోఏళ్ళ అనుభవం వృధాకాదులెండి! మీరు అతన్ని పట్టండి. తతిమ్మది నాకు వదలండి!" గోవిందరావు సగర్వంగా అంటూ మంచం కిందనుంచీ విస్కీబుడ్డీ తీశాడు.... (ఇంకా వుంది)

నగల దొంగ?

బానిస

జొన్నలగడ్డ రామలక్ష్మి

"ఒరేయ్—గదిలో కాస్త పక్కేసి పోరా?" అంది గౌరి.

గవర్రాజు భయపడుతూనే గదిలో అడుగుపెట్టాడు. అప్పటికే పక్క నీటుగా వేసి ఉంది.

"పక్క వేసే ఉంది—" అన్నాడు వాడు.

"వేసే ఉందా—నేను చూడనేలేదు. అయితే ఇంకేం? పని చేసిచేసి అలసిపోయున్నావు. కాసేపు పడుకోరా?" అంది గౌరి.

"అయ్యగారు చంపేస్తారు" అన్నాడు గవర్రాజు తన కేమీ అభ్యంతరం లేనట్లు.

అయ్యగారి పేరు భూపతి. ఆయన పేరు చెబితే ఊరు ఊరంతా గజగజ వణుకుతుంది. గౌరి భూపతి కూతురు. అందాల బొమ్మ. ఆమెకు పెళ్ళై నాలుగేళ్ళయ్యింది. మగడికి వ్యక్తిత్వం లేదు. ఆమె కాలుకింద తొత్తులా ఉంటాడు. భూపతి అంటే అతడికీ భయమే! గౌరి అత్తవారితో గొడవపెట్టుకుని నెలరోజుల కోసారి పుట్టింటికి వచ్చేస్తూంటుంది. వచ్చినప్పుడల్లా పుట్టింట్లో నెలలతరబడి ఉంటుంది.

గౌరికి భర్తంటే కోపం, చిరాకు. అతడామె మనసుకు నచ్చలేదు. కానీ ఆమె వయసుకో మగాడు కావాలి ఆరోగ్యంగా పెరిగిన పల్లెటూరిపిల్ల. చిన్నప్పట్నించీ అడిగినవన్నీ లేదనకుండా పొందే గారాల బాల.

గౌరికి గవర్రాజు నచ్చాడు.

గవర్రాజు చామనఛాయలో బలంగా ఎత్తుగా ఉంటాడు. మనిషికూడా సినిమా హీరోలా ఉంటాడు. వాడు హైస్కూల్లో టెన్తుక్లాసు దాకా చదివి ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు. వాడి తండ్రి భూపతికి బాకీపడ్డ కారణంగా గవర్రాజు పాలేరు కావలసి వచ్చింది. చదువుకున్నవాడైనా గవర్రాజుకి పాలేరు పనులన్నీ తెలుసు.

ఉప్పుకారం తినే ఆరోగ్యవంతుడైన యువకుడు కాబట్టి వాడు గౌరి ఆకర్షణకు లొంగిపోవడంలో ఆశ్చర్యంలేదు.

గవర్రాజు కింకా పెళ్ళికాలేదు. వాడి తండ్రి పెళ్ళి చేసుకోమని పోరుతున్నాడు. అయితే వాడికి చేసుకుంటే గౌరివంటి పిల్లను పెళ్ళి చేసుకోవాలనుంది.

గౌరి వాడి అభిరుచిని పెంచింది. అందువల్ల వాడు పెళ్ళికి విముఖంగా ఉన్నాడు. గౌరి తరచుగా పుట్టింటికి వచ్చి వెడుతున్న కారణంగా వాడికి పెళ్ళి అవసరమూ

కనిపించడంలేదు.

మొదట్లో భర్తమీదో, అత్తమీదో అలిగి పుట్టింటికి వస్తూండే గౌరి—ఇప్పుడు గవర్రాజు కోసం పుట్టింటికి వస్తోంది.

చాలాకాలం వారి సంబంధం రహస్యంగానే కొనసాగింది.

ఒకసారి భూపతికి వారిద్దరిమీదా అనుమానం కలిగింది. ఆ అనుమానాన్ని ధృవపర్చుకున్నాక ఆయన భార్యను దెబ్బలాడి కూతురికి బుద్ధి చెప్పమన్నాడు.

"నీ అవసరానికి నన్నే పరాయి మగాడి దగ్గరకు పంపిన మనిషివి నువ్వు. నీ యింట్లో అవినీతేమిటి?" అని ఎదురుతిరిగింది భార్య.

భూపతి భార్యను తప్పుపట్టలేదు. తను గవర్రాజును పిలిచి హెచ్చరించాడు.

"బాబూ - నేను తప్పుచేయను" అన్నాడు గవర్రాజు.

"అరిటాకు ముల్లుమీద పడ్డా, అరిటాకుమీద ముల్లు పడ్డా - నష్టపోయేది అరిటాకే! గుర్తుంచుకో - నువ్వు అరిటాకువి" అన్నాడు భూపతి.

"నాకు తెలుసు బాబూ—కానీ...." అన్నాడు గవర్రాజు.

వాడి కానీ తర్వాత ఏమాటలున్నాయో భూపతికి తెలుసు. మరో మనిషి కానీ అని ఉంటే చర్మం వలిచేసేవాడు. అసలు కానీ అనే అవకాశమే ఇచ్చేవాడు కాదు.

గవర్రాజు తప్పు చేయడు. తప్పు చేసే ధైర్యంకూడా లేదు. గవర్రాజు తప్పుచేయక పోయినా—అతడివల్లే తప్పు జరుగుతోంది కాబట్టి — శిక్ష అనుభవించక తప్పదు.

భూపతి గవర్రాజును శిక్షించి ఉండేవాడే! ఎటొచ్చీ రామచంద్రుడు గవర్రాజుకు స్నేహితుడై పోయాడు.

రామచంద్రుడు గవర్రాజులాంటి మనిషే! గవర్రాజుతో పాటే చదువుకున్నాడు. గవర్రాజుకంటే ఆరేడేళ్ళు పెద్ద ఉండొచ్చు. గవర్రాజు ప్రతి క్లాసూ ఒక సంవత్సరం మాత్రమే చదువుతూంటే రామచంద్రుడు రెండేసి సంవత్సరాలు చదివాడు. ఇద్దరూ తొమ్మిదో తరగతిలో కాటోలు కలుసుకున్నారు. క్లాసులో టీచరు గవర్రాజుని అన్యాయంగా శిక్షించబోతూంటే రామచంద్రు దెదిరించి దెబ్బలాడి రక్షించాడు.

రామచంద్రుడికి గవర్రాజులాంటి పెర్సనాలిటీ లేదు కానీ మొండితనముంది—ధైర్యముంది. చొరవ ఉంది. గవర్రాజు సాయంతో అతడు తొమ్మిదవ తరగతే కాదు—పదికూడా ప్యాసయ్యాడు. ఆ తర్వాత అతడు పల్లె వదిలి పట్నానికి పోయాడు. రెండేళ్ళలో రాజకీయాల్లో ప్రవేశించాడు. అక్కడే ఉంటూ నాలుగు డబ్బులు గడిస్తున్నాడని అంతా అనుకున్నారు. కానీ ఏడాదిక్రితం జరిగిన బై ఎలక్షన్లో రామచంద్రుడు ఎమ్మెల్యే అయిపోయాడు. ఎమ్మెల్యే కూడా తన ఊరిప్రజల ప్రతినిధిగా.

భూపతి రామచంద్రుడికి వ్యతిరేకంగా పనిచేశాడు. ఆ నియోజకవర్గం ప్రజలందర్నీ భయపెట్టాడు. అంతా భయపడ్డట్లే కనబడ్డారు. పరిస్థితులు భూపతికి అనుకూలంగా ఉన్నట్లే కనబడ్డాయి. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చే సరికి రామచంద్రుడు అవలీలగా నెగ్గేశాడు. భూపతి తన వాళ్ళందరిమీదా విరుచుకుపడ్డాడు. అంతా అమాయకంగా తమ కేమీ తెలియదన్నారు.

రామచంద్రుడు ఎమ్మెల్యేకాగానే - తన ఊరినీ, ఊళ్ళోని వెనుకబడిన వర్గాలవాళ్ళనీ బాగుచేస్తానని ఉపన్యాసమిచ్చాడు. ఉపన్యాస వేదికమీదకు గవర్రాజుని పిలిచి—బలంగా కౌగిలించుకుని - వీడు నా ఆప్తమిత్రుడన్నాడు.

గవర్రాజు రామచంద్రుడికి తన పరిస్థితి చెప్పుకోలేదు. గవర్రాజు తండ్రి వాడిచేత ఒట్టేయించుకున్నాడు - "భూపతి దొర కుటుంబం మన కుటుంబానికి తరతరాలుగా అన్నం పెడుతోంది. వారి ఉప్పుతిని జన్మనెత్తాం మనమంతా.....ఆ కుటుంబాన్ని సేవించుకోవడమే మనబాధ్యత. నేను బ్రతికుండగా ఈ యింటిలో అందుకు వ్యతిరేకంగా జరక్కూడదు-" అన్నాడు గవర్రాజు తండ్రి.

గవర్రాజుకు భూపతి కూతురో పెద్ద ఆకర్షణ కావడం వల్ల తండ్రి మాటలకు కట్టుబడ్డాడు. తన జీవితంపట్ల వాడికి అసంతృప్తిలేదు.

ఆ తర్వాత రామచంద్రుడు ఊరి మొహం చూడలేదు. అతడు హైదరాబాదులో మకాం పెట్టాడు.

భూపతికి రామచంద్రుడి మనస్తత్వం తెలుసు. గవర్రాజుకి రామచంద్రుడి మనసులో ఉన్నస్థానమూ తెలుసు. అందువల్ల ఆయన గవర్రాజు జోలికి వెళ్ళాలంటే భయపడుతున్నాడు. కానీ వాడు గౌరితో సంబంధం పెట్టుకోవడాన్నాయన హర్షించలేకపోతున్నాడు. భరించలేకపోతున్నాడు.

అందుకే వాణ్ణి హెచ్చరిస్తూంటే—గవర్రాజు "కానీ" అనే దాకా వచ్చాడు.

వాడు "కానీ" అనడానిక్కారణం కూతురి ప్రోత్సాహమే కారణమని భూపతికి తెలుసు.

గవర్రాజు భూపతికి భయపడతాడు. కానీ గౌరి ఆకర్ష ణను తట్టుకోలేకపోతున్నాడు. అందుకే ఆమె ఆహ్వానించి నప్పుడల్లా—"అయ్యగారు చంపేస్తారు" అంటాడు.

అప్పుడు గౌరి నవ్వుతుంది.

ఆ నవ్వు అతణ్ణి మరిపిస్తుంది-మైమరిపిస్తుంది.

ఆరోజూ అంతే జరిగింది.

ఆ తర్వాత మాత్రం మరోలా జరిగింది.

2

గవర్రాజు ఇంటికి వెడుతూంటే దారిలో ఎదు రయ్యాడు భూపతి. వాణ్ణి చూస్తూనే -"ఒక్కసారి నాతో రారా-పనుంది" అన్నాడు. గవర్రాజు బుద్ధిగా ఆయ న్ననుసరించాడు.

ఇద్దరూ రెండు సందులు తిరిగి ఓ యింటికి వెళ్ళారు.

అదో చిన్న పెంకుటిల్లు. అదీ భూపతిదే!

ఇల్లు తాళంపెట్టి ఉంది. భూపతి గవర్రాజుకు తాళం చెవులందించి—"తలుపులు తీయరా-" అన్నాడు.

గవర్రాజు తాళం తీశాడు. తలుపులు తెరిచాడు.

ఇద్దరూ వెళ్ళి మరో చిన్నగదిముందాగారు. గదికి ఊచల తలుపులు. దానికీ తాళంవేసి ఉంది. భూపతి గవ ర్రాజుచేత ఆ తాళం కూడా తీయించాడు.

"గదిలో దీపం వేయి-" అన్నా డాయన.

అక్కడ కాస్త చీకటిగా ఉంది. వాడు దీపం వేయ గానే ఒక్కసారి గదంతా ప్రకాశవంతమయింది. గదిలో ఒక మూల ఎండుగడ్డి మేటగా పడేసి ఉంది.

"ఇందులో గడ్డి వేయించారేం బాబూ!" అన్నాడు గవర్రాజు.

గవర్రాజు గడ్డిమేటును కదుపుతూండగా ఊచల తలు

పులు మూతబడ్డాయి. వాడులిక్కిపడి వెనక్కి తిరిగే సరికి భూపతి తలుపుకు తాళం వేస్తున్నాడు.

గవర్రాజు కంగారుపడి పరుగున వెనక్కివచ్చి- "ఏంటి బాబూ యిది!" అన్నాడు.

"ఈవేళ నేను కళ్ళారా చూశాను. నీకిక బుద్ధి రాదు. నీకు శిక్ష ఈ గదిలోనే!" అన్నాడు భూపతి.

"ఏం చేస్తారు బాబూ నన్ను?" అన్నాడు గవర్రాజు భయంగా.

"పక్కనే కుండ ఉంది. కుండమీద మూతుంది. మూత మీద బోర్లించిన గ్లాసుంది. దాహం వేసినప్పుడల్లా కుండలో నీళ్ళు ముంచుకుని తాగు—" అన్నాడు భూపతి.

"ఏమిటిబాబూ యిదంతా?" అన్నాడు గవర్రాజు ఏడుపు కంఠంతో.

"గదిలోపల ఇంకో చిన్నగదుంది. గదిలోపల కుండీలో నిండా నీళ్ళున్నాయి. ఆ పక్కనే చెంబుంది. పాయఖానా ఉంది. స్నానానికీ కాలకృత్యాలకూ నీకే యిబ్బందీలేదు." అన్నాడు భూపతి.

"తలుపు తీయండి బాబూ—వెళ్ళిపోతాను...."

"తలుపు తీస్తాను. కానీ అప్పుడేకాదు. గదిలో నీకోసం నేనుంచిన ఆహారమంతా తిన్నాక...." అన్నాడు భూపతి.

గవర్రాజు చుట్టూ చూసి—"గదిలో గడ్డితప్ప ఇంకేమీ లేదు బాబూ—" అన్నాడు.

"అదేమరి! నీ బుద్ధి గడ్డితిందిగా—యిక నువ్వుకూడా తిను—" అని భూపతి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

గవర్రాజు తనగతి తల్చుకుని వణికిపోయాడు.

భూపతికి మాటంటే మాటే! తనీగదిలోంచి బైటపడా

లంటే గడ్డితినాలి. కానీ అదెలాసాధ్యం?

వాడు నిరుత్సాహంగా గదిలో పచార్లు చేయసాగాడు.

3

గౌరికి తండ్రిగురించి బాగా తెలుసు. గవర్రాజు తన గదిలో మంచంమీద పడుకుని ఉండడం ఆయన చూసిన విషయాన్నామె గమనించింది. ఆయనంత శాంతంగా వెనక్కు వెళ్ళిపోయాడంటే ఏదో ప్రమాదముందని ఆమె ఊహించింది. అందుకే తండ్రికి తెలియకుండా ఆయన్నో కంట కనిపెడుతోంది.

గవర్రాజింటిపనులు చేస్తూండగానే భూపతి బైటకు వెళ్ళిపోయాడు. ఆయన్ననుసరించి కనిపెడుతూండమని గౌరి ఓ పిల్లను నియమించింది. అది బుద్ధిగా పరిశోధన చేసి గవర్రాజు, భూపతి ఓ యింట్లోకి వెళ్ళారనీ తర్వాత బైటకు భూపతి మాత్రమే వచ్చి తలుపుకు తాళం పెట్టుకున్నాడనీ చెప్పింది.

ఆ క్షణంనుంచీ గౌరి తండ్రిని గమనిస్తోంది. ఆయన బట్టలు మార్చుకుని విశ్రాంతి తీసుకున్నాక—గౌరి నెమ్మదిగా తండ్రి చొక్కాజేబులోని తాళాలు తీసుకుని తల్లితో పొరుగింటికి వెడుతున్నట్లు చెప్పింది.

"త్వరగా వచ్చేసేయ్ - ఆయన తిడతాడు—" అంది తల్లి.

గౌరి బుద్ధిగా తలూపి గవర్రాజు బంధించబడిన ఇంటికి వెళ్ళింది. తాళం తీసి లోపలకు వెళ్ళి గవరాజు దుస్థితిని గమనించింది.

"అమ్మాయిగారూ! మీ మూలంగా నా గతి ఏమయిందో చూడండి—" అన్నాడు గవర్రాజు.

గౌరి వాడు చెప్పినదంతా విన్నాక — "అయితే

నాన్న నీ మీద పగబట్టాడు. ఇక్కడుంటే నీకిక కాలం మూడినట్లే!" అంది.

"వెళ్ళి అయ్యగారి కాళ్ళమీద పడతాను...."

గౌరి నవ్వి—"ఈ ప్రపంచంలో అయ్యగారు క్షమించ గలిగింది నన్నూ, అమ్మనీ, తనపై వాళ్ళనీ—అంతే!" అంది.

"అయితే నేనేం చేయాలి?"

"ఊరొదిలి పారిపో—"

"ఊరొదిలి నేనెక్కడికిపోను?"

గౌరినవ్వి - "తప్పదు-ఎక్కడికో కక్కడికిపోవాలి-" అంది.

"పోయి ఏంచేయను?"

"ఏదో ఒకటి చేయి - మళ్ళీ ఈ ఊరు తిరిగిరాకు."

"అమ్మాయిగారూ! పుట్టి బుద్ధెరిగినప్పట్నించీ మరే ఊరెరగను. నేనెక్కడికీ వెళ్ళలేను. ఇక్కడే ఉంటాను. ఇక్కడే చస్తాను...." అన్నాడు గవర్రాజు.

"ఇక్కడే చావాలన్న విషయం సరే - ఇప్పుడే చావా లని కూడా ఉందా నీకు! లేకుంటే మాత్రం ప్రస్తుతానికి ఊరొదిలి వెళ్ళిపో...."

"వెళ్ళిపోయి ఏంచేయనమ్మాయిగారూ!"

గౌరి చిరాగ్గా - "కండబలం ఉన్నవాడివి. బ్రతకడానికి నీకేంలోటు? ఇక్కడ చేసే చాకిరీలో సగంచేస్తే పట్నంలో నీ కిక్కడి దానికి రెట్టింపు డబ్బొస్తుంది-" అంది.

"కానీ-అక్కడ నాకు తెలిసినవాళ్ళెవరైనా ఉండాలిగా."

గౌరి చటుక్కున—"మరిచేపోయాను — మనూరి రామచంద్రుడు హైదరాబాదులోనేగా ఉంటున్నాడు?" అంది.

"అవును...."

"రామచంద్రుడు నీకు మంచి స్నేహితుడు...."

"అవును...."

"రామచంద్రుడు ఎమ్మెల్యే...."

"అవును...."

"ఇంకా అవును....అవును....అంటావేమిటి? రామ చంద్రుడిలాంటి స్నేహితుడు ఎమ్మెల్యే అయితే నీ కెందుకూ భయం? నా మాట విని రామచంద్రుణ్ణికలుసుకో. నీ కథ చెప్పుకో. అతడు నీ కూళ్లో రక్షణ ఏర్పాటు చేస్తా నంటే - ఇక్కడికి తిరిగిరా! అక్కడేదైనా మంచి ఉద్యోగ మిప్పిస్తానంటే—అక్కడే ఉండిపో! అప్పుడు నేనే నీ దగ్గరకు వచ్చేస్తాను...." అంది గౌరి.

"నిజంగానా?"

"ఊఁ"

"అయితే వెడతాను. కానీ హైదరాబాదు నేనొక్కణ్ణే ఎలా వెళ్ళేది? నాకు సాయంగా వస్తావా?" అన్నాడు గవర్రాజు ఆశగా.

"నేనిప్పుడు నీకు సాయంగా వస్తే మా నాన్న అగ్గిమీద గుగ్గిలమై - ముందుగా నీ వాళ్ళందర్నీ ఓ పట్టు పడతాడు. ముందు నువ్వు రామచంద్రుణ్ని కలుసుకుని నీ బలం పెంచుకో - అప్పుడు మిగతా విషయం చూద్దాం—"

"అంతేనంటావా?" అన్నాడు గవర్రాజు జాలిగా చూస్తూ.

"అంతేనా, యింతేనా అంటూ ఆలోచిస్తూ కూర్చునేం దుకు టైములేదు - నేను చెప్పినట్లు చేయి. వెంటనే పారిపో—" అంది గౌరి.

ఆమె వాడికి ఊచల తలుపుల వెనుకనుంచి విముక్తి

కలిగించి చేతికి అయిదువందనోట్లిచ్చి — "ఇక్కణ్ణించి బస్సెక్కి బెజవాడ వెళ్ళు. బెజవాడనుంచి హైదరాబాదుకు బస్సులు, ట్రయిన్సూ, టాక్సీలు ఉన్నాయి. ఎలాగో అక్కడికి వెళ్ళు. నోట్లో నాలికున్నవాడికి ఎమ్మెల్యేల చిరునామా తెలుసుకోవడం పెద్ద కష్టంకాదు.... అన్నీ బాగా జరిగితే — ఇంటి కుత్తరంరాయి. నీ చిరునామా కూడా పంపు. అప్పుడు నేను నీ కుత్తరం రాస్తాను...." అంది.

"అమ్మాయిగారూ- మీరు నిజంగా దేవత...."

"బాధ్యతలు నెరవేర్చ గలిగుండి బాధ్యతలు నెరవేరిస్తే చాలు- ఆ మనిషి దేవత అనిపించుకుంటాడు. అయినా ఎంతోమంది ఆ మాత్రం కూడా చేయరు. నేను దేవతను కాను. నీకు బానిసను. నా దురదృష్టంకొద్దీ నువ్వు నా తండ్రికి బానిసవు. వెళ్ళి రామచంద్రుణ్ణి కలుసుకుని నీ బానిసత్వం నుంచి విముక్తి కల్పించుకో...." అంది గౌరి గంభీరంగా.

4

ఎమ్మెల్యే రామచంద్రుడింటికి చేరుకునే సమయానికి గవర్రాజు జేబులో మూడువందల రూపాయలున్నాయి. ఆ ఆ యిల్లు, వైభవం చూసేసరికి — "వీడు మా ఊరి రామచంద్రుడేనా?" అని భయం కూడా వేసింది గవర్రాజుకి.

ఇంటి నిండా నౌకర్లు, చాకర్లు. ఇంట్లో రామచంద్రుడి భార్య ఉంది. రామచంద్రుడు లేడు.

గవర్రాజామెకు తను ఫలానా అని చెప్పుకున్నాడు.

"నీ పేరు విన్నాను. తరచుగా నీ గురించి చెబుతూంటారాయన" అందామె.

ఆమెకు గవర్రాజు వయసే ఉంటుంది చూడగానే

చదువు, సంధ్య లేని మనిషని తెలిసిపోతుంది. కానీ ఆమె ఎంతో అభిమానంగా గవర్రాజు నాహ్వానించింది. ఆమె అభిమానంలో సంస్కారం ఉట్టిపడుతోంది.

"ఆయనిప్పుడు ఊళ్ళో లేడు. చాలా రోజులదాకా రాడు. ఆయనొచ్చేదాకా ఇక్కడే ఉంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు" అందామె.

"చాలా రోజుల్దాకా అంటే ఎన్నాళ్ళు?" అడిగాడు గవర్రాజు.

"చెప్పలేం - వారం కావచ్చు. నెల కావచ్చు...."

"నేన కష్టాల్లో ఉన్నాను. మా రామచంద్రుణ్ని కలుసుకునేదాకా నా కష్టాలు తీరవు. వాణ్ని కలుసుకునే వెడతాను....కానీ ఈ యింట్లో నే నుండలేను. నేను చాలా సామాన్యుణ్ని. ఇంత వైభవంగా ఉన్నచోట నేనుండలేను...." అన్నాడు గవర్రాజు.

ఆమె నవ్వి - "నేనూ సామాన్యురాలినే! ఆయనకింత అదృష్టం పట్టకపోతే పల్లెటూళ్ళో పిడకలు వేసుకోవలసిందాన్ని! ఇప్పుడు పెద్ద పెద్ద సభలకు వెళ్ళి నాకంటే ఎంతో గొప్పవాళ్ళకి నా చేత్తో బహుమతు లిస్తున్నాను" అంది.

ఆమె బలవంతం మీద గవర్రాజా యింట్లో మకాం పెట్టాడు. వాడి కక్కడ సకల మర్యాదలూ జరుగుతున్నాయి. కష్టపడి పని చేయటం అలవాటైన గవర్రాజుకి ఆ సోమరి జీవితం సరిపడలేదు. వాడు తనూ పని చేస్తానంటే ఆమె వీల్లేదంది.

అలా వారం రోజులు గడిచాయి.

రామచంద్రుడి జాడ లేదు.

"వాడెప్పు డొస్తాడో?" అని వాపోయాడు గవర్రాజు.

"ఆయన గురించి ఆలోచించకు. నీకేంకావాలో చెప్పు. నేనే చూస్తాను...." అందామె.

"నిజం చెప్పాలంటే నేనుద్యోగం కోసం వచ్చానిక్కడికి...."

"నీ కోసం ప్రాణమైనా యిస్తాడాయన. నువ్వేం ఉద్యోగం చేస్తావు?" అనడిగిందామె.

గవర్రాజామెకు తన చదువు గురించి చెప్పాడు.

"నీకు పెద్ద ఉద్యోగం రాదు" అంటూ పెదవి విరిచిందామె.

"నాకు పెద్ద ఉద్యోగం అక్కరలేదు. బానిసలా ఆ పల్లెటూళ్ళో పడి వుండటంకంటె - స్వతంత్రంగా మా రామచంద్రుడింట్లోనే ఏ పనివాడిగానో జీవితం వెళ్ళబుచ్చేయాలని ఉంది...."

ఆమె నొచ్చుకుని - "చదువులో నీ పాటి చేయనని ఆయన అస్తమానూ అంటూంటాడు. ఆయన ఎమ్మెల్యే అయ్యాడు. ఆయన స్నేహితుడివి నువ్వు పనివాడిగా ఎలా ఉంటావ్?" అంది.

రామచంద్రుడు - ఇప్పటికీ తన్నెంతగానో తల్చుకుంటున్నందుకు గవర్రాజు మనసులోనే అతడి నభినందించుకొని - "పుస్తకం చదివి అర్థం చేసుకుని పరీక్షలు రాసి పాసయ్యేవాళ్ళు కాదు గొప్పవాళ్ళు. జీవితంలో పదిమందిని ప్రభావితుల్ని చేసి, పదిమందికి నాయకులై ఎమ్మెల్యేలయిన వాళ్ళే గొప్పవాళ్ళు. అంత గొప్పవాడయ్యిండీ వాడు నన్నింతా తల్చుకుంటున్నాడంటే - మా రామచంద్రుడు మనిషికాదు. దేవుడు" అన్నాడు.

"అయితే ఏమంటావ్?"

"ఆ దేవుడింట్లో పనిచేసే అవకాశం దొరికితే అదే

మహద్భాగ్యమనుకుంటాను....” అన్నాడు గవర్రాజు.

ఆమె ఒక్క క్షణం ఆలోచించి-“అయితే ఓ పనిచేద్దాం. నువ్వు డ్రయివింగు నేర్చుకో. కారు డ్రయివర్ ఉద్యోగం యిప్పించడమయితే ఆయనకు చాలా సులభం” అంది.

గవర్రాజుకు కారు డ్రయివింగు నేర్చుకోవాలని సరదాగానే ఉంది. ఉద్యోగం సంగతెలాగున్నా ముందు కాలక్షేపం కూడా అవుతుంది కదా అనిపించి ఒప్పుకున్నాడతడు.

రామచంద్రుడి భార్య అతడికో డ్రయివర్ నప్పగించింది. రెండు రోజుల్లోనే గవర్రాజు డ్రయివింగులో మెలకువలు నేర్చుకున్నాడు.

డ్రయివర్ కీ, గవర్రాజుకీ మంచి స్నేహమయింది. డ్రయివరు గవర్రాజు గురించిన వివరాలడిగాడు.

గవర్రాజు తనకీ, గౌరికీ ఉన్న సంబంధం చెప్పకుండా పల్లెటూళ్ళో భూపతి తన్ను బాధిస్తున్న విషయం చెప్పి - తర్వాత జరిగిందంతా యథార్థంగా చెప్పాడు. డ్రయివరు అంతా ఆశ్చర్యంగా విని - “నువ్వు ఎమ్మెల్యే గారి స్నేహితుడివయుండీ - కారు డ్రయివర్ అవుదామనుకుంటున్నావా! అందుకు వాళ్ళొప్పుకున్నారా?” అని అన్నాడు.

“ఎవరి అర్హతకు తగిన ఉద్యోగం వాళ్ళకొస్తుంది. నాకేం పెద్ద ఆశలు లేవు. నే నెక్కడున్నానో నాకు తెలుసు....”

“వాళ్ళొప్పుకున్నారా?” అన్నాడు డ్రయివర్.

“నా స్నేహితుణ్ణి నేనింకా కలుసుకోలేదు. వాడి భార్య తనే నాకీ సలహా యిచ్చింది....” అన్నాడు గవర్రాజు.

డ్రయివరాశ్చర్యంగా-“ఇంతవరకూ ఒక్కసారి కూడా

నువ్వు నీ స్నేహితుణ్ని కలుసుకోలేదా?'' అన్నాడు.

''లేదు. వాడూళ్ళో లేడుగా....''

''ఊళ్ళో లేకపోతే ఫోన్ చెయ్యొచ్చుగా....''

''ఏమో - నాకు తెలియదు.''

డ్రయివరు చుట్టూ చూసి స్వరం తగ్గించి - ''అయితే ఇదంతా నాటకమయుంటుంది. ఇలాగంటున్నానని ఏమీ అనుకోకు'' అన్నాడు.

''నాటక మేమిటి?''

''పెద్దవాళ్ళకు చిన్నవాళ్ళంటే చిన్న చూపు. మీ ఊరి రామచంద్రు డిప్పుడు నీకంటే చాలా చాలా గొప్పవాడు. ఆయనకు నిన్ను స్నేహితుడని చెప్పుకుందుకే సిగ్గుగా ఉంటుంది. నువ్వు వచ్చినట్లాయనకు భార్య ఫోన్ చేసి చెప్పే ఉంటుంది. నిన్ను కారు డ్రయివరు చేయమని ఆయనే ఆమెకు సలహా యిచ్చి ఉంటాడు.''

''అయితే?''

డ్రయివరు గవర్రాజుకి వివరించాడు.

ఎమ్మెల్యేలకు కొందరు నమ్మకస్థులైన మనుషుల అవసరముంటుంది. ముఖ్యంగా కారు డ్రైవరు తనవాడైతే అందువల్ల ఎన్నో సదుపాయాలు. ఆయనెక్కడికి వెళ్ళినా ఆంతరంగిక రహస్యంలా డ్రైవరు కాపాడతాడు. రామచంద్రుడు గవర్రాజును తన కారుడ్రైవర్ని చేయాలనుకుంటున్నాడు. తనే చెప్పడానికి మొహమాటపడి— కథంతా భార్యద్వారా నడిపిస్తున్నాడు. చివర్లో తనొచ్చి- ''అయ్యో! నాకు తెలిస్తే ఇలా జరగనిచ్చి ఉండేవాణ్ణి కాదే....'' అంటాడు. అప్పటికి గవర్రాజు మానసికంగా డ్రైవరుద్యోగానికి సిద్ధపడి ఉంటాడు. రామచంద్రుడు మొహమాట పడుతున్నాడనడానికి నిదర్శనం—అతడు

ఫోన్‌లో కూడా గవర్రాజుని పలకరించకపోవడం....

"ఇదంతా నే నూహించలేదు...."

"ఇంకో రకంగా కూడా జరిగుండవచ్చు...." అన్నాడు డ్రైవరు.

"చెప్పు...." అన్నాడు గవర్రాజు.

"అసలు రామచంద్రుడికి నిన్ను చూడ్డంగానీ, నీతో మాటలాడడంగానీ, నీకు సాయపడ్డంగానీ ఇష్టంలేదు. నీకు డ్రయివరుద్యోగ మిప్పిస్తానంటే అవమానంగా ఫీలై వెళ్ళిపోతావనుకున్నాడు. అందునే నిన్ను కలుసుకోవడం లేదు. మాటలాడడం లేదు...."

"మా రామచంద్రుడలాంటివాడు కాదు ..."

"మీ రామచంద్రుడి గురించి నాకు తెలియదు. కానీ చాలామంది పెద్దవాళ్ళ వ్యవహారా లిలాగే ఉంటాయి."

"అయితే ఈరోజే వెళ్ళి అన్నీ అడిగేస్తాను. నువ్వు చెప్పిందే నిజమయితే ఈ యింట్లో ఒక్క క్షణం కూడా ఉండను" అన్నాడు గవర్రాజు.

"బాబోయ్ అంత పని చేయకు. నా కొంప మునుగు తుంది" అన్నాడు డ్రయివర్ కంగారుగా, భయంగా.

"నీ పేరు రానివ్వను....అంతా నాకు తోచినట్లే చెబు తాను" అన్నాడు గవర్రాజు.

గవర్రాజు అన్నంతపనీ చేశాడు. రామచంద్రుడి భార్య అతడి ఆరోపణల కాశ్చర్యపోయి - "ఎవరో నీకు నూరిపోశారు. ఇది నిజం కాదు" అంది.

"దీని కెవరో చెప్పాలా? ఇంట్లో ఫోనుంది. నువ్వేవ రెవరితోనో మాట్లాడుతున్నావు. నీ భర్తతో మాట్లాడ లేవంటే ఎలా నమ్మను? వాడికి నేనొచ్చినట్లొక్క మాట చెప్పలేవా! వాడు నాతో ఒక్క మాట మాట్లాడలేడా?"

"అదా నీ అనుమానం!" అందామె.

"అనుమానం కాదు - నమ్మకం...."

"అయితే అసలు విషయం నీకు చెప్పక తప్పదు...." అందామె.

"ఏమిటది?"

"ఇటీవల పార్టీలో చీలికలొచ్చే ప్రమాదం కనబడుతోంది ముఖ్యమంత్రికి తన పార్టీ ఎమ్మెల్యేలందరి మీదా అనుమాన ముంది ప్రతిపక్షానికి బాగా ధన బలముంది. వాళ్ళు డబ్బిచ్చి ఎమ్మెల్యేలను కొనేసి తమ వయిపు తిప్పుకుని ముఖ్యమంత్రిని పడగొట్టాలని చూస్తున్నారు. అలా కొందరు నీ స్నేహితుడి దగ్గర కూడా వచ్చారు. అవిశ్వాస తీర్మానంలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఓటు చేస్తే - ఎంతిస్తామన్నారో తెలుసా! పదిహేను లక్షలు."

"నిజంగా పదిహేను లక్షలే....వెంటనే ఒప్పేసుకోవలసింది...." అన్నాడు గవర్రాజు ప్రయత్నంగా.

"నిజమే - డబ్బాకర్షణ అలాంటిది. ఒప్పేసుకోవాలనే అనిపిస్తుంది. కొందరయితే అప్పుడే డబ్బుకు లొంగిపోయారు కూడా. నిన్నటిదాకా దేవుడని ఈ రోజు రాక్షసుడంటున్నారు....అందుకని ముఖ్యమంత్రి అవిశ్వాస తీర్మానం గురించి బెంగపెట్టుకున్నాడు. తనను సపోర్టుచేసే ఎమ్మెల్యేలందర్నీ పిలిచి నిలదీశాడు. అంతా ఏకగ్రీవంగా ఆయనకే తమ మద్దతు నిస్తామన్నారు. అప్పుడాయన వాళ్ళను రెండు బస్సుల్లో ఎక్కించి ఎక్కడికో పంపించేశాడు.

వాళ్ళెక్కడున్నారో ఆయనకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. మీ నేస్తానికిప్పుడు తన భార్యతో మాట్లాడే అవకాశం లేదు. తమ ఉనికి గురించి ఇతరులకు తెలియకుండా

ఉండడం కోసం - వాళ్ళకు బయటి ప్రపంచంతో సంబంధము లేకుండా ఉంచాడు ముఖ్యమంత్రి. ఇదీ ఈనాటి రాజకీయాల వరస. అవిశ్వాస తీర్మానం రోజుదాకా వాళ్ళు బయటపడలేరు. ఈ విషయం చాలా కొద్దిమందికి తెలుసు. నీకు నేను చెప్పకూడదనే అనుకున్నాను. కానీ చెప్పక తప్పలేదు నీ కారణంగా....'' అందామె నీరసంగా.

"నువ్వు చెప్పేది నిజమా?" అన్నాడు గవర్రాజు.

"అనుమానముంటే మరో నలుగురు పార్టీ ఎమ్మెల్యేలింటికి వెళ్ళు. వాళ్ళ విషయమూ అంతే! గడ్డి తింటారన్న అనుమానమున్న ఎమ్మెల్యేలెవ్వరూ అయినవాళ్ళక్కూడా అయిపు తెలియకుండా మాయమయ్యారు."

"మా ఊరి రామచంద్రుడు చాలా గొప్పవాడయిపోయాడనుకున్నాను. వాడి పరిస్థితీ నాకులాగే 'బానిస' బతుకేనన్నమాట...." అన్నాడు గవర్రాజు నీరసంగా. □

"ఇచ్చి పుచ్చుకో!"

విచక్షణ

సినిమాహాలు దగ్గిర జనం క్యూలో నిల్చున్నారు. చాలా రద్దీగా వుందక్కడ. కొత్తసినిమా కావడంతో జనం తొక్కిసలాడుతున్నారు.

ఇంతలో టిక్కెట్ కౌంటర్స్ ఓపెన్ చేశారు. అంత వరకు చక్కగా లైన్లలో నిల్చున్న జనం హఠాత్తుగా తోసు కోవడం మొదలుపెట్టారు. అర్థంలేని కేకలతో నిండి పోయిందా ప్రదేశం.

"దొంగ....దొంగ...." హఠాత్తుగా ఫ్యాక్టరీ సైరన్‌లా వినబడింది ఒక కంఠం.

మరుక్షణం మరింత గోలగోలగా తయారైందా ప్రాంతం. ఎవరికి వారు జేబుల్లోని పర్సులు, మెడలో మంగళసూత్రాలు తడిమి చూసుకోసాగారు.

"దొంగ! పట్టుకోండి....పట్టుకోండి" మరోసారి వినబడిందా అరుపు.

గిర్రున వెనుతిరిగి ముందుకు పరిగెత్తాడు శేఖర్. వెనుక వినిపిస్తున్న కేకలను పట్టించుకోకుండా జనాన్ని తోసుకుంటూ ముందుకు దూసుకుపోయాడు.

పట్టుకుందామని ప్రయత్నించిన ఒకళ్ళిద్దరి చేతుల నుండి చేపపిల్లలా జారిపోయాడు.

చీకటిగావున్న ఒక సందులోనికి వచ్చాక ఆగాడు శేఖర్. ఆయాసంతో అతని గుండెలు పైకి ఎగిసి పడుతున్నాయి. ఊపిరి అందని వాడిలా బలంగా పీల్చుకోసాగాడు.

చెమటలు పట్టిన అరచేతులు పాంటుకు రుద్దుకుని జేబు నుండి గొలుసు బయటకు లాగాడు. దానివైపు చూడగానే చెప్పరానంత నిస్పృహ కలిగిం దతనికి.

నకిలీ బంగారపు గొలుసది. ఆ గొలుసు రోల్డుగోల్డని తెలిసే దొంగిలించాడు శేఖరం. గొలుసుకోసం దొంగతనం చెయ్యలేదతను. ఆ గొలుసు చివరవున్న మంగళసూత్రాలకోసం దొంగతనం చేశాడు.

అయితే తప్పించుకునే హడావుడిలో అవి రెండూ జారిపోయి వట్టి గొలుసు మిగిలింది.

నేలకేసి కొట్టాడా గొలుసు. అదేం ఖర్మమో రెండు రోజులుగా ఏం దొరకడంలేదు. ఒకసారి పట్టుబడ్డాడు కూడా. కాని వ్యవహారం పోలీసులదాకా వెళ్ళలేదు.

డిగ్రీవరకు చదువుకున్నాడు శేఖర్. కాని చదువుకు,

ఉద్యోగానికి సంబంధంలేదనే విషయం అతనికి తెలియడానికి చాలాకాలం పట్టింది.

వెంటనే దొంగతనాలకు దిగాడు. అక్కడ కూడా పెద్దగా వుపయోగం లేకపోయింది. కడుపు నింపుకోవడమే కష్టంగా వుంది.

ఒకసారి రైల్వేస్టేషన్‌లో నిండు పర్సు దొరికింది. జీతాలరోజు కావడంతో మొత్తం డబ్బంతా పర్సులోనే వుంది చాలా నేర్పుగా తీసాడది.

అయితే దొరకక దొరకక పచ్చనోట్లు దొరకడంతో చాలా తొందరగా అవి ఖర్చు చేసేశాడు.

ఒకటి రెండుసార్లు తాళిబొట్టులు దొంగిలించాడు. అవీ అంతే. ఉన్నప్పుడు దొరలా బ్రతకడం. లేనప్పుడు కడుపులో కాళ్ళుపెట్టుకుని పడుకోవడం. పైగా దెబ్బలు, తిట్లు. చాలాసార్లు ఆ జీవితంపై అసహ్యం కలిగినా, ఆ రకంగా తప్ప బ్రతకలేననుకునే దశకు వచ్చేసాడతను.

నిస్పృహగా కాళ్ళీడ్చుకుంటూ పార్కువైపు నడిచాడు శేఖర్.

2

"మైథి!.... మైథి!!"

బూటులేసులు బిగింపుకుంటున్న మైథిలి బదులు చెప్పలేదు. కూతురుని వెదుక్కుంటూ వచ్చిన గాయత్రికి ఒళ్ళు మండింది.

"పిలుస్తుంటే బదులు పలకవేమే. నీ పితృదేవులేరి?" అసలు మీ తండ్రి కూతుళ్ళకు ఒళ్ళు పొగరెక్కింది. గబగబా అనేసింది గాయత్రి.

ఇంకా అనేదే, కాని బూటులేసులు బిగించటం పూర్తి చేసిన పాప తలెత్తి తల్లి ముఖంలోనికి చూసి నవ్వింది.

అంతే గాయత్రి నోరు మూతబడిపోయింది. గబగబా దగ్గిరికి వచ్చి కూతురుని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది.

విశాలమైన కళ్ళను అరమూతలు చేస్తూ పెదాలు విడి వడకుండా మైథిలి నవ్వే నవ్వు గాయత్రికి చాలా ఇష్టం. ఆ సమయంలో మైథిలి బుగ్గపై పడే సొట్టలు చూస్తే ఇంకా ఇష్టం.

"పో మమ్మీ! నేను నీతో మాట్లాడను." బుంగ మూతి పెడుతూ చెప్పింది మైథిలి.

"ఏమ్మా! మా రాజకుమారికి ఎందుకు కోపం వచ్చిందిరా!"

అప్పుడప్పుడు కూతురితో తనూ చిన్నపిల్లగా మారి పోతుంది గాయత్రి.

"మరి నేను కలర్ పెన్సిళ్ళు కొనుక్కుంటానంటే మనీ ఇవ్వడం లేదుగా?"

అప్పటికి మూడు రోజులనుండి అడుగుతుంది మైథిలి కలర్ పెన్సిల్స్. కాన్వెంటులో వాటిని ఐదు రూపాయ లకు అమ్ముతున్నారు.

అయితే చాలా మధ్యతరగతి కుటుంబాలలానే నెలా ఖరులో వాళ్ళ ఇంట్లోనూ డబ్బులేదు. తండ్రిని అడి గింది. జీతం రాగానే ఇస్తానన్నాడు. అంతవరకు ఆగ లేక రోజూ తల్లిని అడుగుతుంది.

ఒక్కక్షణం గాయత్రి ముఖం మ్లానమయింది. ఒక్కగానొక్క కూతురు సరదాపడి అడిగితే రంగు పెన్సిళ్ళు కొనివ్వలేక పోతుంది తను.

"డాడీకి జీతాలు వచ్చాక కొనుక్కుందువుగాని మైథు" చెప్పింది గాయత్రి.

"అప్పటికి క్లాసులో అందరూ కొనేసుకుంటారు

మమ్మీ" గారంగా అడిగింది మైథిలి.

ఏం చెయ్యాలో తోచలేదు గాయత్రికి. సడన్‌గా గుర్తుకు వచ్చింది....దేవుడి మందిరంలో తను కొంత చిల్లర దాచింది. వెళ్ళి చూసింది. సరిగా మూడు రెండు రూపాయల నోట్లు వున్నాయి.

తీసి కూతురికి చూపించింది. మైథిలిలో ప్రపంచాన్ని జయించినంత ఆనందాన్ని చూసి తృప్తిగా నిట్టూర్చింది.

"ఇలా ఇవ్వు మమ్మీ! నేను దాస్తాను" అడిగింది మైథిలి.

"నేను స్కూలుకు వస్తాగా మైథూ! మీ మిస్‌కు నేను ఇస్తాలే."

"నో మమ్మీ! నేనే యిస్తాను. నాకు ఇచ్చేయ్."

"సరే! ఇదిగో తీసుకో. పారేశావంటే మాత్రం ఇంక ఇవ్వను. కాన్వెంటుకు టైం అయ్యింది. పద." డబ్బులు కూతురు చేతికి ఇచ్చి చెప్పింది గాయత్రి.

3

బస్‌స్టాప్‌లో చాలామంది నిలబడ్డారు. ఇంకా బస్ రాలేదు. చాలామంది అసహనంగా వాచీలు చూసుకుంటు న్నారు.

"దొంగ!....దొంగ" హఠాత్తుగా అరుపులు విన బడ్డాయి.

చాలామంది తలలు అటు తిరిగాయి. ఒక యువకుడు పరిగెత్తుకు వస్తున్నాడు. అతడిని కొంత మంది తరుముకు వస్తున్నారు.

బస్టాప్‌లో నిల్చున్న కొంతమంది మగవాళ్ళు ఎదురు కాసి, ఆ యువకుడిని పట్టుకున్నారు. అదే సమయానికి వెనకవాళ్ళు వచ్చారు.

అందరూ యిష్టం వచ్చినట్లు కొట్టసాగారు. ప్రాణాల మీద ఆశ వదలుకున్నాడు శేఖర్. అతనికి తెలుసు మాస్ మెంటాలిటీ గురించి. ఇటువంటి సమయాలలో సంబంధం వున్నా లేకున్నా అందరూ చెయ్యి చేసుకుంటారు.

గ్రుడ్లు తేలవేసి, తగలకూడనిచోట దెబ్బ తగిలినట్లు పడిపోయాడు శేఖర్.

అంతే! చటుక్కున దిగిపోయింది అతన్ని కొడుతున్న వీరాధి వీరుల ఆవేశం.

"మన డబ్బు మనకు దొరికిందిగా! వదిలేయండి" అన్నా రెవరో.

"పోలీసులకు అప్పగించండి" ఇంకెవరో చెప్పారు.

అందుకు కూడా ఎవ్వరు ముందుకు రాలేదు. పోలీసుల వద్దకు వెడితే డబ్బు, సమయం రెండూ వృధా అని అక్కడున్న చాలామందికి తెలుసు!

మెల్లిగా లేచాడు శేఖర్. అతని బట్టలు పీలిక లయ్యాయి. వంటిపై చాలాచోట్ల గాయాలయ్యాయి. పై పెదవి సగం తెగి రక్తం స్రవిస్తుంది!

రెండు రోజుల నుండి తిండి లేదేమో, తగిలిన దెబ్బ లకు శోష వచ్చేలా వుంది.

"దుక్కలా వున్నాడు. దొంగతనాలు చేస్తున్నాడు చూడండి. ఇలాంటివాళ్ళవల్లే దేశం పాడయిపోతుంది" ఎవరో అన్నారు.

ఉక్రోషంగా తలెత్తాడు శేఖర్. "రెండు రోజుల నుండి అన్నం లేకపోతే మీరు కూడా ఈ పనే చేస్తారు" కళ్ళనీళ్ళు తిరుగుతుండగా అరిచాడు.

ఇదంతా గమనిస్తూనే వుంది, తల్లి చెయ్యి పట్టుకుని నిల్చున్న మైథిలి. ఇంటికి కాన్వెంట్ దూరం కావడంతో

గాయత్రి రోజూ కూతుర్ని తీసుకు వెడుతుంది. మళ్ళీ కాన్వెంట్ వదిలేసమయానికి వెళ్ళి తీసుకు వస్తుంది.

బట్టలు దులుపుకుంటూ అక్కడి నుండి వెళ్ళబోతు న్నాడు శేఖర్.

అప్పుడు కదిలింది మైథిలి. తల్లి చెయ్యి వదిలించుకుని ముందుకు పరుగెత్తింది.

"అంకుల్" పిల్చింది. "నా దగ్గర సిక్స్ రూపీస్ వున్నాయి, తీసుకో....అన్నం తిను" అంది.

అక్కడ నిల్చున్న మనుషులందరూ వింతగా చూసారు ఆ పాప వంక. కోపంగా ముందుకు వచ్చింది గాయత్రి.

"ఏం? నువ్వు కలర్ పెన్సిళ్ళు కొనుక్కోవా? మళ్ళీ డబ్బు లడిగితే ఇవ్వనని చెప్పానా?" మైథలి రెక్క పట్టుకు లాగుతూ కోపంగా అరిచింది.

"పోనీ మమ్మీ! పాపం అంకుల్ అన్నం తినలేదట! నేను పెన్సిల్స్ ఇంకోసారి కొనుక్కుంటాను" అంది పాప జాలిగా.

ఒక్క క్షణం నోట మాటరాక బొమ్మలా నిలబడి పోయింది గాయత్రి.

తను రంగు పెన్సిళ్ళు కొనుక్కోవడం కంటే ఒక మనిషి ఆకలి తీర్చుకోవడం ముఖ్యమని గుర్తించింది ఆ పాప. ఆ చిన్ని పాపకు వున్న విచక్షణా జ్ఞానం అణ్వాయు ధాలు ప్రోగుచేసే దేశాధినేతలకుంటే ప్రపంచం నిండా ఆకలి ఇలా విలయతాండవం చేయదేమో?

ఆ పాపకున్న జాలి, దయ మన చుట్టూ ఉన్న మను ష్యులకుంటే శేఖర్ లాంటివాళ్ళు తిండి కోసం ఇన్ని తిప్పలు పడే అవస్థ తప్పేదేమో!

తల విదిలించి పాపను ఎత్తుకుంది గాయత్రి. పాప

చేతిలో నోట్లు తీసుకుని శేఖర్ వయిపు తిరిగింది.

"చూడు తమ్ముడూ! స్వతహాగా నేను దొంగలన్నా, దొంగతనాలన్నా అసహ్యించుకుంటాను" తన చేతిలో నోట్లు శేఖర్ చేతిలో పెట్టి తిరిగి చెప్పింది—

"నాలుగు రోజుల నుండి బొమ్మలు గీసుకోవడానికి కలర్ పెన్సిల్స్ అడుగుతుంది పాప. నెలాఖరు రోజులవడంతో డబ్బు లేక కొనలేదు. ఈ రోజు దేవుడి దగ్గర సొమ్ము తీసి ఇచ్చాను. ఆ డబ్బు పారేస్తే ఇంక మళ్ళీ ఇవ్వనని కూడా చెప్పాను. అయినా తను పెన్సిళ్ళు కొనుక్కోవడంకంటే, నువ్వు ఆకలి తీర్చుకోవడం ముఖ్యం అని భావించింది" ఊపిరి పీల్చుకోవడానికి అన్నట్లు ఆగింది.

దూరంగా బస్సు రావడం గమనించి గబ గబా చెప్పింది గాయత్రి.

"ఈ రూపాయలు ఖర్చుచేసే ముందు అవి ఒక చంటి పిల్ల తన చిన్ని కోరికను కాదనుకుని నీ కిచ్చిందని గుర్తు పెట్టుకో. ప్రతి మనిషికి ఆత్మసాక్షి వుంటుందని నా నమ్మకం. అంతకంటే నేనేమీ చెప్పను" అని పాపాను తీసుకొని బస్సుకై వెళ్ళింది.

షాక్ తగిలినట్లయ్యింది శేఖరానికి. ఘనీభవించిన మంచు ఎండపొడ సోకి కరిగినట్లు అతని మనసు పొరల చుట్టూ వున్న అజ్ఞానం తొలగిపోసాగింది.

అవును! ఆ పాప ఔదార్యం ముందు ఎందుకు పనికి వస్తాడు తను? ఉద్యోగం దొరకలేదని బ్రతికే మార్గం అన్వేషించకుండా ఇలా దొంగతనాలకు సిద్ధపడ్డాడే. తన ఆకలి తీర్చవలసిన బాధ్యత చూట్టూ వున్న మనుష్యులదన్నట్లు ప్రవర్తిస్తున్నాడే?

ఆ పాప నీడను తాకడానికయినా తనకు అర్హత వుందా? లేదు. మనిషిగా పిలవబడటానికి కూడా తను తగనివాడు.

అప్పుడే బస్సు వచ్చి ఆగింది. గాయత్రి పాపతో సహా బస్సు ఎక్కింది.

"పాపా! నీ పేరు....?" అడిగాడు శేఖర్.

"మైథిలి...." కదులుతున్న బస్సు నుండి గాలిలో తేలుతూ వచ్చాయా మాటలు.

ఆ తర్వాత శేఖర్ తన జీవితంలో ఎప్పుడూ దొంగతనాలు చేయలేదు. అతను బ్రతకటానికి ఇబ్బంది కూడా పడలేదు.

మార్పు అనేది రావడానికి కత్తులు, గొడ్డళ్ళు అవసరం లేదు. జైళ్ళు, ఉరితాళ్ళు కూడా మార్పును తేలేవు.

మంచిని హృదయానికి తాకేలా చెప్పగలగాలి. □

కత్తి తెచ్చిన తంటా!

అదృష్టవంతుడు

వసుంధర

చాలా కష్టాల్లో ఉన్నాను నేను.

అప్పుడే నేను బియ్యే ప్యాసై రెండేళ్ళయింది. పైసా సంపాదన లేదు. సంపాదించే నాన్న లేడు నాకు.

అమ్మకు ఆర్నెల్లనుంచి అనారోగ్యం. డాక్టరు దగ్గిరకు వెళ్ళక్కర్లేదురా అంటోంది. వెళ్ళాలని నాకు తెలిసినా అసహాయత కారణంగా అమ్మ వద్దంది కదా అని ఊరు కున్నట్లు నటిస్తున్నాను.

చెల్లెలికిప్పుడు పద్దెనిమిది నిండాయి. దానికి సరైన బట్టలు లేవు. ఉన్నవాటికి చిరుగులు. అది ఇంటిలోనుంచి బైటకు రావడానికే మొహమాట పడుతోంది. నాకిప్పుడు బట్టలెందుకురా అన్నయ్యా... అంటుందది నేను దాని పరి

స్థితికి బాధపడితే! దాని మాటలు విని తృప్తిపడ్డట్లు నటి
స్తాను.

తమ్ముడు టెన్తుక్లాసు చదువుతున్నాడు. తెలివైనవాడే కానీ యివి ట్యూషన్ రోజులు. టీచర్సు ట్యూషన్ కుర్రాళ్ళకే ఇంట్లో పాఠాలు చెబుతారు. ఆ అలసటనుంచి విరామం కోసం కాసేపు బడికివచ్చి వెడుతూంటారు. నేను తమ్ముడికి ట్యూషన్లు చెప్పించలేను. కనీసం గైడ్లైనా కొనిపెట్టాలి. అవీ నా వల్ల కావడంలేదు. తమ్ముడికి లౌక్యం తెలియదు. పుస్తకాలు కావాలని రోజూ ఏడుస్తున్నాడు. పరీక్ష ఫీజు కట్టడమే కష్టంగా ఉన్న నాకు— పుస్తకాలు కొనడమెలా సాధ్యపడుతుంది?

నాన్న అర్ధాంతరంగా పోతే ఆఫీసునుంచి కొంత డబ్బు, ఇన్సూరెన్సు కంపెనీనుంచి కొంత డబ్బు వచ్చాయి. అందులోంచి కొంత అవసరానికి ఖర్చుపెట్టి మిగతాది బ్యాంకులో డిపాజిట్ చేశాను. నెలకు మూడు వందల రూపాయల వడ్డీ వస్తోంది. మూడేళ్ళుగా ఆ వడ్డీయే మా జీవనాధారం. దానికి తోడుగా మాయిల్లు సగం వాటా అద్దెకిచ్చాం. వచ్చే అద్దె రెండువందల రూపాయలు. అయిదు వందల రూపాయలతో ఎలాగో నాలుగు నోళ్ళు నింపుకోవచ్చునేమో కానీ — అంతకుమించి ఇంకేమీ సాధ్యపడదు కదా!

నేను ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరుగుతున్నాను. కనిపించిన ప్రతివాడికీ చెబుతున్నాను. పేపర్లో నా అర్హతలకు సరిపడ్డ ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తు పారేస్తున్నాను. ఉద్యోగం రావడం లేదు.

నా పరిస్థితి చూసి జాలిపడి ఓ బట్టల దుకాణం యజమాని నాకు పద్దులురాసే పని ఇచ్చాడు. అదంత సులభం

కాదు. దుకాణం యజమాని పన్ను ఎగేయడానికి వీలుగా ఒక రకం. సేల్స్‌మెన్ తనను మోసం చేయడానికి వీల్లే కుండా మరో రకం—పద్దులు రాయాలి.

అదైనా అస్తమానూ పని ఉండదు. నెలకు పదిరోజుల పని ఉంటుంది. ఉన్నప్పుడు పదిగంటల పని చేయించు కుని—గంటకో రూపాయి చొప్పున రోజు కూలి కింద పదిరూపాయిలిస్తాడు. పనెప్పుడుంటుందో ఆయన చెప్పడు. రోజూ వెళ్ళి అడుగుతూండాలి. పని ఉన్నరోజున నే నడక్క—పోయినా—అదింకొకడి పరమైపోతుంది. పని చేయడానికాయనకు చాలామంది ఉన్నారు. ఆయనకు నా పరిస్థితిచూసి జాలి కలగడంవల్ల ఉద్యోగమిస్తున్నాడు తప్ప మనుషులు దొరక్క కాదు.

మూడేళ్ళనుంచి నేను అడపా దడపా అప్పులు చేస్తూనే ఉన్నాను. ఒకసారి చేసిన అప్పు తీర్చడం కష్టంగానే ఉంటోంది. సాధారణంగా అప్పులు తీర్చడానికూ—డా కొత్త అప్పులు చేస్తూంటాను.

నాకు చాలా విషయాల్లో పోటీగా ఉంటాడు రామం.

రామం లేనివాడు కాదు కానీ వాడికి దురలవాట్లు బాగా ఉన్నాయి. ఇంట్లోవాళ్ళు వాడిని పోషించగలరు కానీ వాడి దురలవాట్ల ఖర్చులు భరించలేరు. అందు గురించి వాడు చిల్లర దొంగతనాలు చేస్తూంటాడు. అడపా తడపా వాళ్ళనీ వీళ్ళనీ మోసాలు చేస్తూంటాడు. వాడికి నీతీ నిజా యితీ గురించిన పట్టింపులేదు.

వాడి కారణంగా నాకు రావలసిన రెండు మూడు మంచి అవకాశాలు పోయాయి. నాకు కబురు చెప్పమని అన్నవాళ్ళు చెబితే చెప్పకుండా తనే వాటి నుపయో గించుకోవాలనుకున్నాడు. వాడి కా అవకాశం ఉపయోగ

పడకపోయినా నా కుపయోగపడకుండా పోయేది.

వాడూ నాకు లాగే నాతోపాటే బియ్యే ప్యాసయ్యాడు. మార్కులు నాకంటే బాగా తక్కువగా వచ్చాయి. వాడు నా కెన్నోసార్లు దురలవాట్లు చేయాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"నువ్వెలాగూ పాడయ్యావు-నన్ను పాడుచేయకు..." అన్నాను నేను వాడితో చాలాసార్లు.

"నేను పాడవలేదు. నువ్వు బాగుపడతావనే ఈ అల వాట్లు చేస్తున్నాను...." అన్నాడు వాడూ నాతో చాలా సార్లు.

ఒక్కసారి మాత్రం నేను వాడితో వాదనకు దిగాను.

"నీకు తెలియదులే—దేశానికీ, ప్రపంచానికీ సంబం ధించిన గొప్ప గొప్ప కీలక నిర్ణయాలన్నీ మందు పార్టీల సమయంలోనే జరుగుతాయి. పెద్దవాళ్ళతో పరిచయాలు కావాలంటే మందు పార్టీలకు వెళ్ళాలి. మందు కొట్టాలి." అని—"మందుపేరు చెప్పి ఏదో ఒకరోజున నేను చాలా పెద్దవాడినై పోతాను. అప్పుడు నువ్వు విచారిస్తావు...." అన్నాడు రామం.

"కనీసం నీకు నా పోటీలేకుండా పోతుందిగా - సంతో షించు-" అన్నాను.

"అయ్యో! నువ్వు నా ఆప్తమిత్రుడివి....నిన్ను నేను పోటీగా భావించడంలేదు. ఒకవేళ నువ్వు నాకంటే ముందు బాగుపడతావేమో - ఎవరు చెప్పగలరు? బాగుపడా లంటే నా అలవాట్లు నీకూ ఉండాలి. సిగరెట్ కాల్చ కుండా, మందు కొట్టకుండా, అమ్మాయి చెయ్యి పట్టుకో కుండా - జీవితంలో పైకెలావస్తావు? నువ్వు పైకి రావా లనే నేను తంటాలు పడుతున్నాను...."

"అందువల్ల నీకు ప్రయోజనం?"

"చాలా పెద్దది. నేనూ పెద్దవాడినయ్యేదాకా నువ్వు నాకో సిగరెట్ పారేస్తావు. మందు పార్టీకి పిలుస్తావు...." అన్నాడు రామం.

"ఛీ-" అనుకున్నాను కానీ పైకి అనలేను.

రామం నా ముఖభావాలు చదివాడో ఏమో — "చూస్తూండు ఏదో ఒకరోజున నువ్వు నా కారణంగానే పైకి వస్తావు—" అన్నాడు.

2

ఆరోజు రామం నా దగ్గరకువచ్చి - "గురూ - నీ దశ తిరిగింది. వెళ్ళి అనంతరామాన్ని కలుసుకో-" అన్నాడు.

"అనంతరామం ఎవరు?" అన్నా నాశ్చర్యంగా.

"ఆయనో పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఒక్కసారి వెళ్ళి ఆయన్ను కలుసుకుంటే నీ అదృష్టం దారి మళ్ళుతుంది" అన్నాడు రామం.

"ఆయన్ను నువ్వే ఎందుకు కలుసుకోకూడదు?" అన్నాను.

"ఆయనకు నిజాయితీపరులు కావాలి. నా నిజాయితీ మీద ఆయనకు నమ్మకం లేదు...." అన్నాడు రామం.

ముందు నాకు వాడు వేళాకోళమాడుతున్నాడేమోనని అనుమానం కలిగింది. కానీ వాడు సీరియస్‌గానే ఉన్నాడని తెలిసేక - వాడు చెప్పినవిధంగా బిజినెస్ మాగ్నెట్ అనంతరామాన్ని కలుసుకున్నాను.

అంతస్థులో ఆయన నాకంటే చాలా చాలా పెద్దవాడు. ఆయనతో మాట్లాడాలంటేనే నాకు భయం వేసింది. ఆయన నా వివరాలన్నీ ఒకటొక్కటే అడిగి తెలుసుకున్నాడు. నేను ఒక్క అబద్ధం కూడా చెప్పలేదు.

"ఖరీదయిన పని. పూర్తి కాగానే పదివేలిస్తాను. సెక్యూరిటీ కట్టగలవా?" అన్నాడాయన.

"సెక్యూరిటీ దేనికి?"

"నేను నీకో వజ్రాలహారా న్నిస్తాను. దాని ఖరీదు ఒక కోటీ పది లక్షల రూపాయ లుంటుంది. అది భద్రంగా నేను చెప్పిన చోట అందివ్వాలి. చెప్పిన పని పూర్తిచేస్తే నీకూ పదివేల రూపాయలు బహుమతి. కానీ నిన్ను నమ్మి వజ్రాలహారా న్నివ్వాలంటే నీ నుంచికొంత నగదు సెక్యూరిటీగా ఉంచుకోవాలి...."

"కోటి రూపాయల హారానికి నే నెక్కణ్నుంచి సెక్యూరిటీ తేగలను!" అన్నాను నిస్పృహగా.

"కోటి కాదు - కోటీ పది లక్షలు" అంటూ సవరించా డాయన.

"అవును....అదే" అంటూ నీళ్ళు నమిలాను.

"ఎంతో కొంత సెక్యూరిటీ చాలు నాకు. ఉదాహరణకు పదివేల రూపాయలే నీకు పెద్ద మొత్తం. అది ఎవరిదగ్గ రయినా తీసుకుంటే ఆ వ్యక్తి నిన్ను చూసుకోగలడు. ఆ విధంగా నీవు చేయిజారి పోకుండా చూసుకునేందుకు నాకు మరో వ్యక్తి లభిస్తాడు. నాకు తృప్తిగా ఉంటుంది- నిన్ను నమ్మి పదివేల రూపాయ లిచ్చేవాళ్లున్నారని."

నేను దీనంగా - "అయ్యా! ఈ రోజుల్లో నమ్మకానికి నిజాయితీ ఒక్కటే చాలదు. నాకు బొత్తిగా ఏ ఆధారం లేదు. అందుకని ఎవ్వరూ నాకు అప్పివ్వరు...." అన్నాను.

"ఇల్లుందేమో?" అన్నాడాయన.

"నా యిల్లు తాకట్టులో ఉంది. వీలున్నప్పుడల్లా కొంత

బాకీ కడుతున్నాను. నా కుద్యోగం వస్తే తప్ప ఆ బాకీ తీరదు" అన్నాను.

"ఓహ్ - నీ కుద్యోగం లేదు కదూ!" అంటూ ఆయన సాలోచనగా తల పంకించి - "ఈ పని పూర్తి చేసుకు వస్తే నేను నీకు నెలకు రెండువేల రూపాయల జీతం మీద ఉద్యోగం వేయిస్తాను. సరా?" అన్నాడు.

"కానీ - సెక్యూరిటీ!" అన్నాను.

"సెక్యూరిటీ అవసరం లేదు నాకు...."

ఒక్కసారి నాలో ఉత్సాహం పొంగి పొరలింది - "ఓకే సర్!" అన్నాను.

"ఒక్క నిముషం కూర్చో" అన్నా డాయన.

నేను బుద్ధిగా కూర్చున్నాను.

ఆయిన లోపలకు వెళ్ళి పది నిముషాల తర్వాత తిరిగి వచ్చాడు. ఆయన చేతిలో చిన్న బ్రౌన్ కవరుంది. అదా యన నా కందించి - "లోపల ఏముందో చూడు...." అన్నాడు.

నేను కవరు చింపి లోపల కాగితం బయటకు తీశాను.

ఆ ఊళ్లో క్రొత్తగా ప్రారంభమైన బిస్కట్ల కంపెనీలో నాకు మేనేజరుద్యోగానికి ఆర్డరది. జీతం నెలకు రెండువేల రూపాయలు.

నాకు వెంటనే ఆయన కాళ్ళమీద పడిపోవా లనిపించింది.

"నువ్వు పని పూర్తిచేసుకుని రావడానికి పది రోజులే గడువు. ఆర్డరు కాగితం మీద తేదీ చూశావు గదా. ఆ రోజే నువ్వుద్యోగంలో చేరాలి! ఆ రోజు చేరకపోతే ఈ ఆర్డరు చెల్లదు."

"అలాగే సర్." అన్నా నుత్సాహంగా.

"అయితే ఇక నేను చెప్పేది విను...." అన్నా డనంతరామం.

నేను బుద్ధిగా ఆయన చెప్పేది వినసాగాను.

నే నాయనిచ్చిన హారం తీసుకుని హైదరాబాద్ వెళ్ళాలి. స్టేషన్లోంచి ఆయన చెప్పిన ఓ నంబరుకి ఫోన్ చేయాలి. అప్పుడు నా కోసం ఓ కారొస్తుంది. ఆ కార్లో బయలుదేరి వెళ్ళి సుల్తాన్ అనే వ్యక్తిని కలుసు కుని హారాన్నందివ్వాలి. అతడు నన్ను వెళ్ళిపొమ్మనే దాకా అక్కడే ఉండాలి.

"ఈలోగా ఆర్డరు కైమయిపోతే?" అన్నాను కంగా రుగా.

"సుల్తాన్ మనుషుల్ని ఒక్క రోజుకు మించి ఉంచు కోడు...."

"ఉంచుకుంటే?"

"అది నీ ఖర్మ...." అన్నాడాయన చిరాగ్గా.

నేను భయపడి ఊరుకున్నప్పటికీ అప్పుడు నా బుర్ర చురుగ్గా పనిచేయసాగింది.

ఇందులో ఏదో ప్రమాదముంది! ఇది మామూలు వ్యవ హారం కాదు. బహుశా అవినీతికి సంబంధించినదై ఉండాలి.

నేను ఉద్యోగం గురించి ఆశపడి ఈ పని కొప్పు కుంటే ఏమైపోతాను! పోలీసులు నన్ను పట్టుకుంటే?

నా కిక జీవితంలో ఉద్యోగం దొరకదు.

"సార్ - ఈ పనిమీద నేను వెడుతున్నప్పుడు పోలీ సులు పట్టుకుంటారా?"

"ఫూల్!" అన్నాడాయన. "నీ ముఖం చూస్తే చాలు

పోలీసులు నీ కామధ దూరం పోతారు. వాళ్ళు నాలుగు డబ్బులు దొరుకుతాయన్న వాళ్ళ జోలికే వెడతారు. నీ బోటి దౌర్భాగ్యుల జోలికి వెళ్ళరు...."

ఆయన నన్ను పూలన్నందుకు నాకు రవంత బాధ కలిగింది. కానీ పేదవాడి బాధ బయటపడకూడదు కదా!

"ఒకవేళ పట్టుకుని హారం తీసేసుకుంటే నేనేం చేయాలి?"

అనంతరామం నా భావాలన్నీ చదివినట్లున్నాడు. ఆయన నావంక చురుగ్గా చూస్తూ—"పోలీసులు నీనుంచి హారం తీసుకుంటే ఆ బాధ్యత నాది. నిన్నేమీ అనను. పైగా జామీనుమీద నిన్ను విడిపిస్తాను. అంతేకాదు. నీ కుద్యోగం కూడా ఆ పోలీసు కేసు కారణంగా రాకుండా పోదు. పైగా నే నిస్తానన్న పదివేలూ అదనం...." అన్నాడు.

ఆయన నన్నాశపెడుతున్నాడని నా కర్థమయింది. ఆయన ఆశ పెడుతున్నాడంటే తనకున్న ప్రయోజనం సామాన్యమైనది కాదు. నాకున్న ప్రమాదమూ మామూలుది కాదు. కానీ ఇలాంటి అవకాశాలు చాలా అరుదుగా వస్తాయి. వచ్చిన అవకాశాన్నుపయోగించుకుంటే నా జాతకం తిరిగిపోవచ్చు. దశమారిపోవచ్చు. నేను ప్రమాదానికి గురైతే ఇంతకంటె పెద్ద దురదృష్టానికేం గురి కాను.

ఆయన చెప్పిన వాటన్నింటికీ అంగీకార సూచనగా తలూపాను. ఆయన తృప్తిగా నవ్వి—తన జేబులోంచి చెక్కు బుక్కు తీసి అప్పటికప్పుడు నా పేరున ఓ చెక్కు రాశాడు. మొత్తం పదివేలు. కానీ అది పోస్టుడేటెడ్ చెక్కు. పదిరోజుల తర్వాత మాత్రమే నే నదిమార్చుకో

గలను.

"ఈ చెక్కుకు వెనకాల సంతకంపెట్టు. మీ యింట్లో యిచ్చేయ్. అనుకోని కారణాలవల్ల నువ్వు రావడం ఆలస్యమైనా మీవాళ్ళకు డబ్బు మార్చుకునేందుకు వీలవు తుంది—" అన్నా డనంతరామం.

"థాంక్యూ సర్!" అన్నాను.

"తిరిగొచ్చేక నువ్వు నన్ను మళ్ళీ కలుసుకుందుకు ప్రయత్నించకుండా ఈ ఏర్పాట్లన్నీ! ఈ విషయంలో ఎక్కడా నాపేరు బయటకు రాకూడదు. అది గుర్తుం చుకో. వచ్చీ రాగానే ఆర్డరు తేదీ ప్రకారం ఉద్యోగంలో చేరు—"

"కానీ సర్—మీరు నాకు చెక్కెందు కిచ్చారని ఎవ రైనా అడిగితే?" అనడిగాను నాతప్పు లేకుండా.

"చాలామంది పేదవాళ్ళకి నేను సాయం చేస్తూం టాను. ఎందరికో దానాలిచ్చాను. ఆ విషయం ఊరందరికీ తెలుసు. బ్యాంకులవాళ్ళకీ తెలుసు. కాబట్టి నువ్వేం బెంగ పెట్టుకోకు. ఎవరైనా అడిగితే నా దానగుణాన్ని పొగి డేయ్—" అన్నా డనంతరామం.

"నే నుద్యోగంలో చేరాక అడక్కపోయినా మిమ్మల్ని పొగడ్డమే నా పని సార్—" అన్నాను కృతజ్ఞతగా.

"ఆ పని చేయకు. నాపని పూర్తిచేశాక నా గురించి మర్చిపో—ఉద్యోగం నే నిప్పించినట్లెవరికీ చెప్పకు...." అన్నా డనంతరామం.

"ఓకే సర్ - మీ రెలాగంటే అలాగే—" అన్నాను.

అప్పుడాయన తన కోటు జేబులోంచీ ఒక చిన్నపెట్టి తీశాడు. దాని పొడవు పదంగుళాలుంది. వెడల్పు

రెండున్నరంగుళా లుండవచ్చు.

ఆయన నన్ను దగ్గిరగా పిలిచి - "ఈ పెట్టెను జాగ్ర త్తగా చూడు...." అన్నాడు.

చూశాను.

పెట్టెమీద తాళం చెవి ఉంచడానికో చిన్నహోలుంది. దాని కిటూ యిటూ వేలు పట్టేటంత కన్నాలున్నాయి.

"చూశావా?" అన్నాడాయన.

తలూపాను.

"ఇది ప్రత్యేకమైన లాకర్ సిస్టమ్. ఇదిగో ఈ కీ హోల్లో దీని తాళం చెవి నుంచుతున్నాను చూడు-" అంటూ ఆయన ఓ తాళం చెవిని కీ హోల్లో ఉంచాడు. తర్వాత తన ఎడమచేతి చూపుడు వేలును కీ హోల్‌కు కుడిపక్కగా నున్న కన్నంలో ఉంచి తాళం చెవిని తిప్పాడు. పెట్టెమూత వెంటనే తెరుచుకుంది.

నాకళ్ళు జిగేల్మన్నాయి.

లోపల ధగధగా మెరిసిపోతోం దో హారం. అలాంటి హారాన్ని నా జన్మలో చూసి ఉండను.

అనంతరామం ఠక్కున మూత వేసేశాడు.

"చూశావా?" అన్నాడు నన్ను చూసి.

"చూశానండి-" అన్నాను.

"అర్థమయిందా?"

"అయిందండి-"

"ఇవతల పక్క కన్నం ముందు రెండు చుక్కల గుర్తుంది. అది సుల్తాన్ కోసం. అవతల పక్క కన్నం ముందు ఒక చుక్క గుర్తుంది. అది నాకోసం. కీ హోల్లో తాళం చెవినుంచి నేను గానీ సుల్తాన్ గానీ మాకు నిర్ణ యించిన కన్నాల్లో వేళ్ళుంచి తాళంచెవి తిప్పితే ఈ పెట్టె

మూత తెరుచుకుంటుంది. మళ్ళీ మూత నొక్కగానే తాళం పడిపోతుంది. ఆ కన్నాల్లో ఇతరు లెవరైనా వేళ్ళుంచితే వాళ్ళకు ప్రమాదం. పెట్టెమూత తెరుచుకోదు గానీ— వాళ్ళు వేలి ముక్కలై పోతారు. ఈ పెట్టెను నువ్వు సుల్తాన్ కందించాలి" అన్నా డనంతరామం.

నా గుండెలు జలదరించాయి- "పొరపాటున ఈ కన్నంలో ఎవరైనా వేళ్ళుంచితే?" అన్నాను.

"తెలిసినవాళ్ళెవరూ ఇందులో వేళ్ళు పెట్టకూడదు. తెలియనివాళ్ళు వేళ్ళుపెట్టకుండా ఉండడానికో సదుపాయం...." అంటూ ఆయన రెండు కన్నాలమీదా రెండు గుండ్రటి స్టిక్కర్స్ అంటించాడు. ఆ స్టిక్కర్స్ పెట్టి రంగులో కలిసిపోయాయి. పరీక్షగా చూస్తే తప్ప ఆ స్టిక్కర్ల ఉనికి తెలియదు. "ఎప్పుడు కావాలంటే అప్పుడీ స్టిక్కర్లను సులభంగా తొలగించవచ్చు. నీకు నా సలహా ఏమిటంటే—ఈ స్టిక్కర్లు తొలగించే బాధ్యత సుల్తానుకు వదలిపెట్టు. నా సలహాలు హెచ్చరికల్లాంటివని మర్చిపోకు-" అన్నా డనంతరామం.

నేను వినయంగా పెట్టి తీసుకున్నాను.

"చాలా జాగ్రత్త! నీ ప్రాణాలకంటె భద్రంగా చూసుకోవాలి నువ్వు. సుల్తాన్ కందేలోగా పెట్టి పోయిందంటే నీ ప్రాణాలు పోయినట్లే భావించు...." అన్నా డనంతరామం.

ఆయన నాకో సంచీ కూడా యిచ్చాడు. అది భుజానికి తగిలించుకుని అందులో ఆయనిచ్చిన వస్తువులన్నీ ఉంచాను.

"నేను నిన్ను మళ్ళీ చూడను. విష్ యూ ఆల్ ద

బెస్ట్...." అనేసి అనంతరామం లోపలకు వెళ్ళి పోయాడు.

3

ఇంట్లో నేను జరిగిం దెవ్వరికీ చెప్పలేదు. కానీ రామం నన్ను కలుసుకుని మొత్తం సమాచారమంతా రాబట్టాడు. ముందుగా వాడికేమీ చెప్పకూడదనే అనుకున్నాను, కానీ ఏదో బలహీనత నన్ను రహస్యం దాచనివ్వలేదు.

నేను తలపెట్టిన పనిలో ఏదయినా ప్రమాదముందేమో నన్న అనుమానం నాకుంది. ఆ అనుమానం నన్ను బాధిస్తోంది. మనసు దిటవు చేసుకునేందుకా బాధ నెవరితో నయినా పంచుకోవాలి. అమ్మ, చెల్లెలు, తమ్ముడు - ఈ బాధను నాతో పంచుకోలేరు. వాళ్ళు నన్ను నిరుత్సాహ పరచటమే కాక ఇందుకు విముఖుల్ని కూడా చేస్తారు. కాబట్టి నేను బాధను పంచుకుందుకు రామాన్నెన్నుకోక తప్పలేదు.

అంతా విని రామం - "అయితే నేనొక బంగారు అవకాశాన్ని పోగొట్టుకున్నానన్నమాట...." అన్నాడు.

"అంటే?"

"అనంతరామంగారి నుంచి పిలుపు ముందు నాకే వచ్చింది."

నే నాశ్చర్యపడి - "అలాగా?" అన్నాను.

"నే నా పిలుపు నుపయోగించుకోలేదు. కారణ మేమిటంటే అనంతరామంగారు చెప్పే పనులు సాధారణంగా ప్రమాదమైనవిగా ఉంటాయి పులి నోట్లో తల పెట్టమనే రకమాయన. చూస్తూ చూస్తూ ఎవరూ అలాంటి పని చేయలేరు కదా! పోనీ అని పనిచేయనన్నా కుదరదు. ఒకసారి ఆయన చెప్పింది విన్నమనిషి ఆ పని పూర్తిచేసి తీరాలి.

అలా చేయకపోతే ఆ మనిషి ఉండడు....''

నే నాశ్చర్యంగా - "నిజంగానా?" అన్నాను.

"అనంతరామంగారి గురించి నాకు కొంత తెలుసు. అందుకోసమే నేను రిస్కు తీసుకోలేదు. తంతే బూరెల గంపలోకి వెళ్ళి పడ్డట్టయింది నీ పని. అందుకే అంటారు అదృష్టవంతుణ్ని పాడుచేయడం, దురదృష్టవంతుణ్ని బాగు చేయడం సాధ్యపడదని! నీ విషయంలోనూ నా విషయంలోనూ అంతే అయింది. ఆయనేదో అడవుల్లోకి పొమ్మంటాడనీ, మంటల్లో దూకమంటాడనీ భయ పడ్డాను....'' అంటూ నిట్టూర్చాడు రామం.

"అయితే ఈ పనిలో ప్రమాదమే లేదంటావా?" అన్నా నాశగా.

"ప్రమాదమా? జస్ట్ ఊరెళ్లి రావడం లాంటిది....'' అన్నాడు రామం, అవకాశం పోయిందన్న భావాలు ముఖంలో ప్రకటిస్తూ.

నాకు చాలా సంతోషం కలిగింది - "తిరిగొచ్చేక ఉద్యోగంలో చేరగానే నీకు మందుపార్టీ చేస్తాను సరా?" అన్నాను.

"మందుపార్టీ వద్దు నాకు. నే నడిగింది స్తావా యిప్పుడు?"

"ఏమిటి?" అన్నాను.

"ఈ పనిచేసే అవకాశం నాకివ్వు - అంతే!"

"నీకా? అదెలా సాధ్యం?"

"హారమున్న పెట్టె తీసుకుని హైదరాబాద్ వెళ్ళాలి. అది నువ్వయితేనేం? నేనయితేనేం?" అన్నాడు రామం.

"అమ్మో! అనంతరామం నన్ను బ్రతకనివ్వడు."

"ఆయన హారం నువ్వే యివ్వాలని చెప్పలేదు.

సుల్తాన్ కందచేయాలని చెప్పాడు - అవునా?" అన్నాడు రామం.

"అవును. కానీ ఆ బాధ్యత నాయన నాకే అప్ప జెప్పారు...."

"ఒరేయ్ - నువ్వలాగనేయకు. అసలీ అవకాశం నాకు రావాల్సింది. నా నిజాయితీ మీద అనంతరామం గారికి నమ్మకం లేదు. నమ్మక ముంటే యింత జరిగేది కాదు. నాకు నాలుగు డబ్బులవాట్లున్నంత మాత్రాన నేను నిజాయితీపరుణ్ని కాకుండాపోను. ఈ విషయం అనంత రామంగారికి ఋజువు కావాలంటే ఈ పని నేను చేసి తీరాలి.

"ఒరేయ్ - ఉద్యోగం నీది. పదివేలూ నీవి. పని మాత్రం నేను చేసి పెడతాను. ఎందుకంటే - ఈ పని వల్ల నాపై అనంతరామంగారికి నమ్మకమూ ఏర్పడు తుంది, సుల్తాన్‌గారితో పరిచయమూ కలుగుతుంది. రెంటికి రెండూ నాకు మాత్రమే ప్రయోజనకరం. ఎందు కంటే వారిద్దరూ కూడా అవినీతికి పాల్పడుతూంటారు. నాకు అవినీతి గురించిన బెంగ లేదు.

"అసలు నాకు ఆదర్శాలు లేవు. అనంతరామం, సుల్తాన్ వంటి వ్యక్తుల పరిచయం, నమ్మకం నాకెంతో అవసరం. అవి నువ్వు కలకాలం భరించలేవు. ఒకసారి పని జయప్రదంగా నిర్వహించినందుకు అనంతరామం గారు మళ్ళీ మళ్ళీ వేర్వేరు పనులకు నియోగించవచ్చు. అవి ఇంత తేలికగా ఉండకపోవనూవచ్చు, కాబట్టి-ప్లీజ్ - నన్నీ పనిమీద వెళ్ళనీ!" అన్నాడు రామం.

అంతా విన్నాను కానీ కరగలేదు నేను. అనంత రామంతో రిస్కు తీసుకోవడం సంగతటుంచి నాకు

రామం మీద నమ్మకం లేదు. వా డీ హారం పట్టుకుని ఉడాయిస్తే? హారాన్ని వాడు కాజేయలేకపోవచ్చు. కానీ దాంతో నా పనయిపోతుంది గదా!

రామం మరి కాసేపు ప్రయత్నించి విఫలుడై - "సరే బయల్దేరే ముందు మా యింటికిరా - నీకు కొన్ని రహస్యాలు చెప్పాలి" అన్నాడు.

అది నిజమేనని నమ్మడం నేనుచేసిన పెద్ద పొరపాటు.

4

బయల్దేరే ముందు పోస్టుడేటెడ్ చెక్కు అమ్మకిచ్చి ఏ తేదీన అది బ్యాంకులో జమ చేయాలో చెప్పాను. చెక్కుకు వెనకాల ముందుగానే నా సంతకం పెట్టాను.

"ఎక్కడిదిరా యింత డబ్బు?" అనడిగిం దమ్మ.

"బహుశా నా కుద్యోగం వస్తుంది. ఇప్పుడో అర్జంట్ పనిమీద వెడుతున్నాను. రెండ్రోజుల్లో తిరిగొస్తాను. పది రోజులు పట్టినా కంగారు పడకు. అన్నీ తిరిగొచ్చేక చెబుతాను...." అన్నాను.

నేనింకా మెట్లు దిగకుండానే ఎదురయ్యాడు రామం.

"మా యింటికి రావాలన్న విషయం గుర్తుంటుందో ఉండదో అని!" అన్నాడు వాడు. అమ్మతో - "స్టేషన్ దాకా వెళ్ళి దిగబెడతాను—" అన్నాడు.

"అయితే వచ్చి కాస్త కబురు చెప్పి వెళ్ళు నాయనా!" అందమ్మ వెంటనే.

"లేదు పిన్నీ! వీణ్ని స్టేషన్‌లో రైలెక్కించాక - అక్కణ్నించి బస్‌స్టాండ్‌కు వెళ్ళి మా ఊరెళ్ళాలి. తిరిగి రావడానికి వారం రోజులు పడుతుంది. అప్పటికి మీవాడే వచ్చేస్తాడు" అన్నాడు రామం.

ఇద్దరం బయలుదేరాం. వాడు నన్నో గదికి తీసుకు వెళ్ళాడు.

"ఇది మీ యిల్లు కాదే!" అన్నా నాశ్చర్యంగా.

"కాదు. నేను వేరే గది తీసుకుని ఉంటున్నాను. మా యింట్లోవాళ్ళకి నా అలవాట్లునచ్చవుగా!"అన్నాడు రామం.

నేను గదిని చూశాను. విశాలంగానే ఉంది. గదిలో మంచం, పక్క నీటుగా వేసి ఉన్నాయి. గది శుభ్రంగా తుడిచి ఉంది.అది రామంగాడి గదంటే నమ్మశక్యంగాలేదు.

"ఈ గది నాకు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా హాయిగా, సుఖంగా ఉంచుతుంది. ఇక్కడ నేనేం చేసినా చెల్లుతుంది. ఒక ఏడాదిగా నే నిక్కడే సుఖపడుతున్నాను...." అన్నాడు రామం.

"సరే-రహస్యాలన్నా వవేమిటో చెప్పు...."అన్నాను.

"మొదటిసారి నా గదికి వచ్చావు. కాఫీ తాగేక అన్నీ చెబుతాను" అంటూ ఫ్లాస్కులోంచి కాఫీ పోసిచ్చాడు వాడు నాకు.

"నువ్వూ తాగు" అన్నాను.

"నే నిప్పుడు లైటుగా తాగాలంటే బీరు హాయిగా తాగాలంటే విస్కీ, బ్రాందీ, రమ్ము, జిన్...." నవ్వాడు వాడు.

నేను మాట్లాడకుండా కాఫీ తాగేశాను. తాగుతూంటే ఏదోలా గుంది. పూర్తిగా తాగగానే కళ్ళు తిరుగుతున్న ట్లనిపించింది.

"ఏదోలా ఉందిరా!" అన్నాను.

"ఒక్క నిముషం పడుకుని కళ్ళు మూసుకో...." అన్నాడు వాడు.

ఆ సమయంలో అంతకు మించి గత్యంతరం లేదు.

వెంటనే వెనక్కి వాలి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకున్నాను. తర్వాతేమైందో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి నేనింకా ఆ గదిలోనే ఉన్నాను. గదిలో రామం లేడు. వాడి స్థానంలో ఓ చీటీ వుంది.

"మై డియర్ బాల్యస్నేహితుడా! నేను సుల్తాన్ దగ్గరకు వెడుతున్నాను. అనంతరామంగారి పని జయప్రదంగా చేసుకుని నాపై నీకు, ఆయనకు కూడా నమ్మకం పుట్టించుకుంటాను. జీవితంలో స్థిరపడే ఏకైక అవకాశం నాకిది. అందుకే నిన్ను మోసంచేసి వెడుతున్నాను. ఇలా జరిగిందని నీవు వెళ్ళి అనంతరామంగారికి ఫిర్యాదు చేయకు. పొరపాటెవరిదయినా ముందాయన నీకు మరణ శిక్ష విధిస్తాడు. ఈ గదిలో నీకు వారం రోజులకు సరిపడే టిన్డ్‌ఫుడ్ వుంది. అటాచ్డ్ బాతుంది. నీకు తెలియకుండానే అవసరాలను గమనించే నా స్నేహితుడొకడున్నాడు. ప్రస్తుతానికి నీ విక్కడ బందీవి. నేను తప్పు చేశాననుకుంటే నన్ను క్షమించు."

సెలవు. నీ రామం"

ఉత్తరం చదవగానే నా గుండె బేజారయింది. కానీ ఏం చేయను?

ఆ గదిలో పూర్తిగా వారం రోజులు బందీగా ఉన్నాను. గదిలోంచి పారిపోయే అవకాశం లేదు. బాత్రూంలోంచి కూడా పారిపోయే అవకాశం లేదు. గదిలో నేను చూడనప్పుడు ఎవరో కిటికీలోంచి ఇడ్లీ, దోస, ఉప్మా వగైరా టిఫిన్ పొట్లాలు - అన్నం సాంబారు, కూర, పెరుగు, పొట్లాలు-పడేస్తుండేవారు.

నేను దుఃఖిస్తూనే రోజులు గడుపుతున్నాను. ఇలా బందిఖానా ఎన్నాళ్ళో మరి!

గదిలో నా కేలోటూలేదు కానీ బైటపడ్డాక నేనేమై పోతాను?

అసలు నేను బైటపడతానా?

వారంరోజుల బందిఖానా ముగిసేక ఎనిమిదవ రోజున ఆ గది తలుపులు తీసి ఉండటం గమనించాను. అంతే.... ఉత్సాహంగా అక్కణ్ణించి బైటపడ్డాను. ఇంటికి వెళ్లాను.

"ప్రయాణ మెలా జరిగిందిరా?" అందమ్మ నన్ను చూస్తూనే.

ఏడవలేక నవ్వాను.

ఆ తర్వాత....

అనుకున్న రోజుకి ఉద్యోగానికి వెడితే నా కుద్యోగం వచ్చింది. కానీ అక్కడి చీఫ్ నా ఆర్డరుచూసి ఆశ్చర్య పోయాడు.

"ఇలాంటి ఆర్డరు కాగితంతో ఉద్యోగంలో చేరే మనిషి కోసం గత రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాం. నువ్వు చాలా అదృష్టవంతుడివి"—అన్నా డాయన.

ఆయన మాటలకర్థం నా కప్పుడు తెలియలేదు.

బ్యాంకులో నా చెక్కు కూడా క్యాషయింది.

అంటే రామం నమ్మకంగానే ప్రవర్తించాడన్నమాట. వాడికి ముందు పార్టీ యివ్వాలని నాకుంది. జీవితంలో స్థిరపడ్డానన్న ఉత్సాహంలో—నేను వాడి తప్పులన్నీ క్షమించగలుగుతున్నాను. కానీ వాడు మళ్ళీ నాకు కనపడ లేదు. వాడేమయ్యాడోనన్న నా సందేహానికి ఓ ఏడాది తర్వాత నాకు సమాధానం దొరికింది.

సుల్తాన్ అనే స్మగ్లరు పోలీసులకు పట్టుబడ్డాడని పేపర్లో వచ్చింది. అతడు తన కార్యకలాపాలకు వేరే అనుచరులనుంచుకోడు. సరుకు - ఒకచోటినుంచి మరో

చోటకు రవాణా కావడానికి అతడు కొత్తమనుషులను వాడుకుంటాడు. ఒక పని చేసినవాడిని ఆ పని పూర్తి కాగానే చంపించేస్తాడు. సుల్తాన్‌కి వివిధ నగరాల్లోని ప్రముఖులతో సంబంధముంది.

ఆ వార్త ఎన్నో నా సందేహాలకు సమాధానాన్నిచ్చింది. అయితే ఆ సమాధానం నా మనసుకు తృప్తినివ్వలేదు.

నా వళ్ళు జలదరించింది. మనసు వణికిపోతోంది.

రామం దురదృష్టవంతుడు. వాడి దురదృష్టం నా అదృష్టమయింది. వాడు నన్ను వారంరోజులు బందీగా ఉంచి ఉండవచ్చు. కానీ అదే నా ప్రాణాలు కాపాడింది.

ఆరోజు గుడికి వెళ్ళి రామం ఆత్మశాంతికి ప్రార్థన చేసి-మై డియర్ బాల్యస్నేహితుడా-నా తప్పులేకపోయినా నావల్ల నీకు ప్రమాదం జరిగింది. నన్ను మన్నించు. నేను నీకు సర్వదా కృతజ్ఞుణ్ణి అనుకున్నాను. □

తపో ఫలం?



మోసపోయిన మోసగాడు

రాచకొండ నరసింహ రామయ్య



'త్రీస్టార్' బోర్డ్ రంగు రంగుల దీపాల కాంతిలో మెరిసిపోతోంది. బార్ గుమ్మం ముందు ఖాకీ దుస్తులు ధరించిన వాచ్ మేన్ నిలబడి వున్నాడు. బార్ లోకి వెళ్ళేవారిని వినయంగా ఆహ్వానిస్తూ బార్ తలుపు నెమ్మదిగా తీస్తున్నాడు.

అత్యంత ఆధునికమైన ఏ.సి. బార్ అది.

అప్పుడే శబ్దం చేసుకుంటూ ఒక స్కూటర్ వచ్చి బార్ ముందాగింది.

వాచ్ మేన్ వినయంగా తలుపు తీసేడు.

హుందాగా బార్ లోపలికి ప్రవేశించేడు స్కూటర్ మీద వచ్చిన వ్యక్తి.

బార్‌లో వాతావరణం చల్లగా ఉంది.

చిన్నగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది.

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి.

ఎప్పుడూ కూర్చునే కార్నర్ సీటు వయిపు చూసేడు ఆ వ్యక్తి.

సీటు ఖాళీగా ఉంది.

నెమ్మదిగా వెళ్ళి ఆ కుర్చీలో కూర్చున్నాడు.

ఆ వ్యక్తిని చూస్తూనే స్టూవర్డు వినయంగా విష్ చేసేడు. ఆర్డరు చేసిన సరంజామా అంతా రాసుకుని పక్కనే ఉన్న బేరర్ చేతి కిచ్చాడు.

కొన్ని క్షణాలు గడిచాయి.

టేబులు మీద ఆర్డరు చేసినవన్నీ అందంగా అమర్చబడినాయి.

బేరర్ టేబులు మీది విస్కీ గ్లాసులో సోడా పోస్తూ 'చాలా' అన్నట్టు ఆ వ్యక్తివయిపు చూసేడు.

చాలన్నట్టు చేత్తోనే చిన్న సంకేతం చేసాడు ఆ వ్యక్తి.

గ్లాసులోని ద్రవం వెచ్చగా గొంతులోకి దిగింది.

బార్‌లోని చల్లదనం ఇప్పుడు తెలీటం లేదు.

ఒక గంట గడిచింది.

మత్తుగా ఉన్న శరీరం నెమ్మదిగా కుర్చీలోంచి లేపి టాయ్‌లెట్ వైపు దారి తీసేడు.

అంతవరకూ ఆ వ్యక్తినే గమనిస్తూ మూడు టేబుల్స్ అవతల కూర్చున్న మరో వ్యక్తి కొంచెంసేపాగి తను కూడా టాయ్‌లెట్ వయిపు అడుగులు వేసేడు.

అప్పుడే టాయ్‌లెట్‌లోంచి వస్తున్న మొదటి వ్యక్తిని ఈ రెండవ వ్యక్తి ఢీకొన్నాడు.

బార్‌లో అది మామూలే.

ఎవ్వరూ పట్టించుకోలేదు.

మసక వెలుతురులో ఎవరో, ఏమిటో గుర్తించడం కూడా చాలా కష్టంగా ఉంది.

నెమ్మదిగా లేచిన రెండవ వ్యక్తి 'సారీ' అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా టాయిలెట్ వయిపు వెళ్ళిపోయాడు.

కాని ఆ కొద్దిక్షణాల్లోనే మొదటి వ్యక్తి జేబులోని పర్సు రెండవ వ్యక్తి చేతిలోకి మారిందని ఎవ్వరూ గుర్తించలేదు. ఆఖరికి ఆ పర్సు పోయిన వ్యక్తి కూడా!

తన కుర్చీని చేరుకొని నెమ్మదిగా కూర్చున్నాడు మొదటి వ్యక్తి.

అప్పటికే కిక్ కొంచెం ఎక్కువయింది.

"ఇంకా ఏమైనా కావాలా?" అడిగేడు బేరర్.

వద్దని చేత్తోనే సయిగ చేస్తూ బిల్లు తెమ్మన్నాడు.

కొద్దిసేపయిన తరువాత టేబులు మీద బిల్లుంచి మరో పనిమీద లోపలికి వెళ్ళేడు బేరరు.

బిల్లు పరిశీలనగా చూసేడు.

అంతా సరిగ్గానే ఉంది.

బిల్లు చెల్లించడానికి జేబులో చేయి పెట్టాడు.

జేబు ఖాళీగా తగిలింది.

మరోసారి జాగ్రత్తగా చూసేడు.

అన్ని జేబులూ వెతికేడు.

ఏ జేబులోనూ పర్సు కనిపించలేదు.

ఒక్కసారి తేరుకున్నాడు.

చుట్టూ చూసేడు.

ఆలోచనలో పడ్డాడు.

టాయ్‌లెట్‌దాకా వెళ్ళి చూసి మరీ వచ్చేడు.

ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

నెల జీతం ఆ పర్సులో వుంది.

ఎక్కడో పడిపోయింది.

అనుమానం లేదు.

ఇప్పుడేం చేయాలి?

బిల్లు ఎలా చెల్లించడం?

తరవాత ఇస్తానంటే ఒప్పుకోవచ్చు. అయినా బాగుంటుందా!

ఈగల్లా ఆలోచనలు ముసురుకున్నాయి.

ఏం చేయటానికి తోచటం లేదు.

సరిగ్గా అటువంటి సమయంలో—

"హలో రవీంద్రగారూ" అంటూ ఎవరో పిలిచేరు.

ఒక్కసారి అటువేపు చూశాడు.

ఎవరో వ్యక్తి తనవంకే చూసి పిలుస్తున్నాడు.

ఆ వ్యక్తిని ఇదివరలో ఎప్పుడూ చూసినట్టు గుర్తు లేదు.

అనుమానంగా మరోసారి చూసేడు ఆ వ్యక్తి వంక.

సందేహం లేదు. తననే పిలుస్తున్నాడు.

అప్పటికే ఆ వ్యక్తి కుర్చీలోంచి లేచి రవీంద్రను సమీపించాడు.

"ఏం సార్! ఎంతసేపయింది వచ్చి?" అని ప్రశ్నించేడు.

అసలే అయోమయంలో తనుంటే రామాయణంలో పిడకల వేట. అయినా తప్పదు. పెద్దమనిషిలా ఉన్నాడు.

ఏదో ఒకటి మాట్లాడాలి మర్యాద కోసం.

"మిమ్మల్ని ఎక్కడ చూసేనూ?" అంటూ గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు అభినయించేడు రవీంద్ర.

"అదేమిటి సార్! రోజూ మీరు పనిచేసే బ్యాంకుకు వస్తూనే ఉంటాను. అయినా మీకు బోలెడుమంది కస్టమర్స్" నొచ్చుకున్నట్లుగా అన్నాడు ఆ వ్యక్తి.

"సారీ! గుర్తు పట్టలేకపోయాను, మీ పేరు...." అడిగాడు.

"నా పేరు అశోక్. ప్రొప్రయిటర్ ఆఫ్ అశోకా ఇండస్ట్రీస్" అంటూ పరిచయం చేసుకుని మరలా తనే "ఈ రోజు ఇలా ఇక్కడ కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. లెటజ్ హేవ్ సమ్ డ్రింక్స్" అంటూ బేరర్‌ను పిలిచేడు.

బేరర్ వచ్చాడు.

కావలసిన డ్రింక్స్ ఆర్డరు చేసేడు అశోక్.

"సార్! ఆల్‌రెడీ ఓ బిల్ తెచ్చేను. కేన్సిల్ చేయమంటారా?" అడిగాడు బేరర్.

"అలాగే చెయ్" అన్నాడు అశోక్.

"నో ఇప్పటికే ఎక్కువయింది" అంటూ అశోక్ వంక చూసేడు రవీంద్ర.

"ప్లీజ్! మీరలా అనకూడదు. మన బార్ పరిచయాన్ని గుర్తుంచుకుందుకు వీలుగా...." అంటూ అభ్యర్థనగా చూసేడు అశోక్.

"ఓకే" అన్నాడు రవీంద్ర.

మరలా డ్రింక్స్ వచ్చేయి.

ఇద్దరూ నెమ్మదిగా సిప్ చేస్తున్నారు.

డిన్నరు కూడా ఆర్డరు చేసేడు అశోక్.

అది కూడా పూర్తయింది.

మరలా బిల్లుతో ప్రత్యక్షమయ్యేడు బేరర్.

బిల్లందుకున్నాడు అశోక్.

ఒక్కసారి బిల్లువంక చూసి నిర్లక్ష్యంగా నాలుగు వంద రూపాయల కాగితాలు బిల్ తెచ్చిన ప్లేటులో పెట్టేడు.

అనుకోని విధంగా గండం గడిచినందుకూ, ముఖ్యంగా పదిమందిలో తన పరువు మర్యాదలు నిలబడినందుకు మనసులోనే ఎంతో ఆనందించాడు రవీంద్ర.

బార్‌లోంచి ఇద్దరూ బయటకు నడిచారు.

అశోక్‌ను చూస్తూనే రోడ్డుమీద పార్క్ చేయబడిన కారు బార్ గేటుముందు ఆగింది.

"మీరూ...." అంటూ రవీంద్ర వంక చూశాడు అశోక్.

"నాకు స్కూటరుంది. ప్లీజ్ కేరీఆన్. గుడ్‌నైట్" అన్నాడు రవీంద్ర.

కారు నెమ్మదిగా తన ముందునుంచే వెళ్ళిపోయింది. వెళుతున్న కారువైపే చూస్తూ నెమ్మదిగా తన స్కూటరు చేరుకున్నాడు రవీంద్ర.

2

రవీంద్ర పీపుల్స్ బ్యాంకులో గుమాస్తా. బ్యాంకు ఉద్యోగంలో చేరి ఆరేళ్ళయింది. ఈ ఆరేళ్ళ కాలంలో తన సహచరులవల్ల ఏర్పడిన ఒక అలవాటు తాగుడు. జీతాలు అందిన రోజు త్రీస్టార్ బార్‌లో తప్పక కనిపిస్తాడు.

బ్యాంకు తెరిచి అప్పటికే గంటయింది.

ఆ రోజు శనివారం.

బ్యాంకు పని చేసేది రెండు గంటలసేపు మాత్రమే!

మర్నాడు సెలవ్.

అందుకే జనం రద్దీతో బ్యాంకు చాలా హడావుడిగా ఉంది.

బ్యాంకు మేనేజరు తన గదిలో ఎవరో ముఖ్యమైన కస్టమర్స్‌తో ఏదో మాట్లాడుతున్నాడు.

అకౌంటెంటు టేబులు ముందు కుర్చీల్లో ఎవరో ముగ్గురు వ్యక్తులు కూర్చుని కొత్తగా కరెంటు అకౌంటు తెరవడానికి అనుసరించవలసిన పద్ధతి గురించి అడుగుతున్నారు.

అంత హడావుడిలోను లేని ఓపిక తెచ్చుకుని వాళ్ళకు వివరంగా చెబుతున్నాడు అకౌంటెంటు!

రవీంద్ర డ్రాఫ్ట్స్ కౌంటరులో పని ఒత్తిడివల్ల తొందరగా పనిచేస్తున్నాడు.

అప్పుడే 'రవీంద్రా' అన్న పిలుపు వినిపించింది.

తలెత్తి చూసేడు.

ఎదురుగా అశోక్.

నిన్నరాత్రి బార్‌లో తనతో గడిపిన అశోక్.

ఒక్కసారి రాత్రి జరిగిన సంఘటనలన్నీ రవీంద్ర కళ్ళముందు మెదిలాయి.

కుర్చీలోంచి లేచి సాదరంగా బ్యాంకు లోపలికి అశోక్‌ను ఆహ్వానించాడు.

లోపలికి వచ్చిన అశోక్, రవీంద్ర పనిచేస్తున్న కౌంటరుకు దగ్గిరగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

రవీంద్రకు కుడిపక్కన ఎవరూ లేరు ఒక్క అశోక్ తప్ప. ఎడమపక్క వరసగా ఉన్న కౌంటర్లలో ఎవరి పని వారు చేసుకుంటున్నారు.

అశోక్‌కి కనీసం కాఫీ అయినా ఆర్డరు చేయాలి. దగ్గి

రలో ఫ్యాను లేదు. ఫ్యానును అప్పుడే కరెంటు ఎకౌంటు కాగితాలు తెమ్మని స్టేషనరీ గదిలోకి పంపేడు అకౌంటెంటు.

రవీంద్ర తను రాసే డ్రాఫ్ట్సు పక్కన పెట్టి "ఒక్క క్షణం" అంటూ ఫ్యానుకోసం స్టేషనరీ గదిలోకి వెళ్ళేడు.

అదే అదనుకోసం అశోక్ కూడా ఎదురుచూస్తున్నాడు.

రవీంద్ర స్టేషనరీ గదిలోకి వెళ్ళి "అప్పన్నా అర్జెంటుగా రెండు కాఫీ" అంటూ తొందరపెట్టేడు.

తిరిగి తన కౌంటరుకు చేరుకుంటున్న రవీంద్రకు, కుర్చీలో అసహనంగా కదులుతూ కనిపించేడు అశోక్.

"సారీ అశోక్! కాఫీ ఆర్డరు చేద్దామని అలా వెళ్ళేను" అంటూ సంజాయిషీ ఇచ్చుకున్నట్లుగా అన్నాడు రవీంద్ర.

"మరేం పరవాలేదు. మరోసారి వస్తాను. మీరూ చాలా హడావుడిగా ఉన్నారు" అంటూ సెలవు తీసుకున్నాడు అశోక్.

రవీంద్ర తన పనిలో మునిగిపోయాడు.

3

'గణపతీ హోల్‌సేల్ డీలర్స్ ఇన్ హార్డ్‌వేర్ గూడ్స్' అనే పెద్ద బోర్డు వేలాడుతోంది.

అద్దాల తలుపులతో అందంగా ఉందా ఆఫీసు.

అది ఆఫీసు మాత్రమే. స్టోర్సు వేరేగా ఉంది.

ఆఫీసు ముందు అప్పుడే ఒక అంబాసిడర్ కారు వచ్చి ఆగింది.

కారులోంచి ఠీవిగా దిగాడు అశోక్.

ఆఫీసులోకి దారితీసేడు తిన్నగా.

అశోక్‌ను చూస్తూనే ఆఫీసు ముఖద్వారం వద్దనున్న

బంట్రోతు నెమ్మదిగా తలుపు ముందుకి తోసి పట్టుకున్నాడు.

హుందాగా లోపలకు ప్రవేశించాడు అశోక్.

ఆఫీసు లోపల నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ మేనేజర్ అని రాసున్న బోర్డుముం దాగాడు.

ఏదో రాసుకుంటున్న మేనేజరు, అలికిడి వినిపించి తలెత్తి చూశాడు.

ఎదురుగా ఉన్న అశోక్‌ను చూసేడు.

"ఐ యామ్ అశోక్. ప్రొప్రయిటర్ ఆఫ్ అశోకా ఇండస్ట్రీస్" అంటూ పరిచయం చేసుకున్నాడు అశోక్.

మేనేజరు మర్యాదగా పలకరించి కుర్చీలో కూర్చోమన్నాడు.

కొంచెం సేపాగి "తమరు కాఫీయా, టీయా." అని అడిగాడు మేనేజరు.

"కాఫీ" అన్నాడు అశోక్.

పక్కనే ఉన్న బంట్రోతుకు కాఫీ తెమ్మని పురమాయించి అశోక్ ఏమి చెబుతాడా అని ఎదురు చూస్తున్నాడు మేనేజరు.

అశోక్ గొంతు సర్దుకుని "మా ఇండస్ట్రీకి పీపుల్స్ బ్యాంకువారు రెండులక్షల రూపాయలు లోను ఇవ్వడానికి అంగీకరించారు. అయితే మేము ఎవరిపద్దనుండి కొనదలచుకున్నామో, వారినుండి మాకు కావలసిన మెటీరియల్స్ తాలూకు కొటేషన్ తీసుకుని బ్యాంకువారికి అందజేయాలి. అప్పుడు డ్రాఫ్టు ద్వారా బ్యాంకువారు ఆ కంపెనీకి చెల్లిస్తారు. మేము మీవద్దనుండి కొనాలని నిర్ణయించుకున్నాం. మాకు కావలసిన మెటీరియల్స్ లిస్టు యిది"

అంటూ బ్రీఫ్‌కేసులోంచి కొన్ని కాగితాలు తీసి మేనే జరుకి అందించాడు.

బ్యాంకువారు ఎవరికి లోను ఇచ్చినా, ఈ విధంగానే చేస్తుంటారు. అది మామూలే. ఆ విషయం మేనేజరుకి తెలుసు.

"చాలా సంతోషం" అంటూ లిస్టు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

ఈలోగా బంట్రోతు టేబులుమీద కాఫీ అమర్చేడు. పక్కనే ఉన్న న్యూస్ పేపరు చూస్తూ కాఫీ సిప్ చేయటం ప్రారంభించాడు అశోక్.

పది నిమిషాలు గడిచాయి.

మేనేజర్ కొటేషన్ వంక మరోసారి సంతృప్తి కరంగా చూసి కవరులోపెట్టి అశోక్ చేతి కందించాడు.

"థాంక్స్" అంటూ ఆ కాగితాలు అందుకుని బ్రీఫ్ కేసులో పెట్టుకున్నాడు.

బయటకు తిన్నగా వచ్చి తన కార్లో కూర్చుని డ్రైవ రుకి ఎటు వెళ్ళాలో చెప్పేడు.

కారు స్పీడుగా ముందుకి పరిగెట్టింది.

మూడు వీధులు దాటింది.

ఆర్టీసీ జంక్షన్ దగ్గిర నాలుగు రోడ్ల కూడలివద్ద గల పెద్ద ఆఫీసు ముం దాగింది.

ఆఫీసు పైభాగాన 'పరమేశ్వర్ హోల్‌సేల్ డీలర్స్ ఇన్‌హార్డ్‌వేర్ గూడ్స్' అనే బోర్డుంది.

అశోక్ కారులోంచి దిగేడు. చేతిలోని బ్రీఫ్‌కేస్‌తో ఆఫీసులోకి నడిచాడు.

ఎర్రటి కార్పెటు పరచబడి అందంగా ఉంది ఆఫీసు

లోపల.

ప్రొప్రయిటర్ అనే బోర్డున్న గది ముందాగి తన విజిటింగ్ కార్డు లోపలికి పంపేడు ప్యూను ద్వారా.

రెండు నిమిషాల్లో లోపలికి రమ్మని కబురొచ్చింది.

పరమేశ్వర్ ఆ కంపెనీ అధినేత.

లక్షల ఆస్తిపరుడు.

వ్యాపారంలో అన్ని మెలుకువలు తెలిసినవాడు.

ముఖ్యంగా గణపతీ హోల్‌సేల్ డీలర్స్‌కు ప్రత్యర్థి.

లోపలికి వస్తున్న అశోక్‌ను సాదరంగా రిసీవ్ చేసుకుని, వచ్చిన పని గురించి అడిగేడు.

అశోక్ తన బ్రీఫ్‌కేస్‌లోంచి గణపతీ హోల్‌సేల్ డీలర్స్ తాలూకు కొటేషను పైకితీసి పరమేశ్వర్‌కు చూపిస్తూ నెమ్మదిగా చెప్పటం ప్రారంభించేడు.

"మా ఇండస్ట్రీకి పీపుల్స్ బ్యాంకువారు రెండు లక్షల రూపాయలు లోను శాంక్షన్ చేసేరు. అయితే మేము కొనబోయే మెటీరియల్ అంతటికీ ఎవరివద్దనుండి కొనదలచుకొన్నామో, వారి తాలూకు కొటేషను ఆధారంగా డ్రాఫ్టు రూపంలో చెల్లిస్తారు. అయితే ప్రస్తుతం మా కంపెనీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అర్జెంటుగా కొంత మొత్తం అవసర పడింది. అందువల్ల లక్షరూపాయలకు మాత్రమే సరుకు కొనదలచుకున్నాం. ఒకవేళ మీదగ్గిరే మేం సరుకు కొనదలచుకొన్నట్లయితే మిగతా లక్షరూపాయలు మాకు క్యాష్ రూపంలో చెల్లించాలి. ఇదే విషయం గణపతి డీలర్స్‌ను అడిగేం. వారు యాభై వేలు మించి ఇవ్వలేం అంటున్నారు. మీరు ఇవ్వగలిగితే మీతోనే ఈ వ్యవహారం సెటిల్ చేసుకుంటాం" అన్నాడు అశోక్.

ఇంలాటి వ్యవహారాలు ఎన్నో చూశాడు పరమేశ్వర్.

బాంకులోను వ్యవహారాలన్నీ దాదాపు ఇంతే.

ఒక్క క్షణం ఆలోచించి—

"మిస్టర్ అశోక్ మీకు లక్ష క్యాష్ ఇవ్వడానికి మాకేం అభ్యంతరం లేదు. అయితే మొత్తం రెండులక్షల రూపాయల సరుకు కొన్నట్లుగా చూపించాలి కాబట్టి టాక్సులన్నీ మొత్తంమీద వేస్తాం. మీరూ ఆలోచించండి" అన్నాడు.

"ఇది ఎక్కడైనా మామూలే! నా కభ్యంతరం లేదు. అయితే వ్యవహారం తొందరగా పూర్తిచేయాలి. మరలా ఆ బ్యాంకు మేనేజరు లీవుమీద వెళ్ళేటట్లుంది. మీరుకూడా కొటేషన్ ఇవ్వండి" అన్నాడు అశోక్.

"ఓకే" అంటూ పది నిమిషాల్లో కొటేషన్ రెడీ చెయ్యమని వివరాలున్న కాగితాలన్నీ బంట్రోతుద్వారా పంపుతున్నానని ఇంటర్‌కమ్‌లో తన మేనేజరుకి చెప్పేడు.

4

మరుసటిరోజు—

మద్యాహ్నం రెండవుతోంది.

ఫుల్‌సూట్‌లో అశోక్ కారులోంచి పరమేశ్వర్ ఆఫీసు ముందు దిగేడు.

తిన్నగా పరమేశ్వర్ గది చేరుకున్నాడు.

అశోక్‌ను చూస్తూనే—

"మీరింక ఇవాళ రారని నిర్ధారించుకుని, ఈరోజు మా కలెక్షన్ సొమ్మంతా బ్యాంకికి పంపుదాం అనుకుంటున్నాను. సరిగ్గా టయిముకు వచ్చేరు" అన్నాడు పరమేశ్వర్.

"అవును! లేటయింది. మీకు తెలియనిదేముంది! బ్యాంకు పని అంటే ఆలస్యం తప్పదుకదా! అందులోను

అవసరం నాది" అంటూ నమ్మకంగా మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల డ్రాఫ్ట్ పరమేశ్వర్ చేతికందించాడు అశోక్.

డ్రాఫ్ట్ పరమేశ్వర్ హోల్‌సేల్ డీలర్స్ పేర రాసుంది. ఎకౌంట్ పేయీ కూడా చేయబడి ఉంది.

పరమేశ్వర్ తన అఫీసు మేనేజరుని ఇంటర్‌కమ్‌లో రమ్మని పిలిచేడు.

కొద్దిసేపటికి పరమేశ్వర్ గది చేరుకున్నాడు మేనేజరు.

"ఏమండీ క్యాష్ రెడీయేనా?" అడిగేడు పరమేశ్వర్.

"ఇవాళ రంగనాథం చెల్లించిన ముప్పై వేలు కలిపితే సరిపోతుంది" అన్నాడు మేనేజరు.

"ఏమిటి! మన పాత బాకీ రంగనాథం నుంచి వసూలైందా? గుడ్‌న్యూస్. సరే అలాగే ఆ మొత్తంకూడా కలిపి లక్షరూపాయలు నా రూముకు పంపండి" అన్నాడు.

రంగనాథం ముప్పైవేల రూపాయల సరుకు ఆర్నెల్ల క్రితం కొన్నాడు పరమేశ్వర్‌నుంచి. డబ్బు ఎప్పుడడిగినా ఏదో సాకు చెపుతున్నాడు. మొత్తానికి ఇవాళ చెల్లించాడు. పరమేశ్వర్ చాలా ఆనందంగా ఉన్నాడు.

ఇంతలో—

లక్షరూపాయల క్యాష్‌తో పరమేశ్వర్ గుమాస్తా గది వచ్చాడు.

"మిస్టర్ అశోక్ ప్లీజ్ టేక్ యువర్ మనీ. మా గూడ్స్‌కూడా మూడురోజుల్లో ఎరేంజి చేస్తాం" అన్నాడు పరమేశ్వర్.

"ఓకే! అలాగే చెయ్యండి" అంటూ లక్షరూపాయలను తన బ్రీఫ్‌కేస్‌లో సర్దుకుని సెలవు తీసుకున్నాడు అశోక్.

5

గోదావరీ ఎక్స్‌ప్రెస్ కిటకిటలాడుతోంది.

గార్డు ఆకుపచ్చ జెండా ఊపుతూ విజిల్ వేస్తున్నాడు.

ట్రైను నెమ్మదిగా ప్లాటుఫాం దాటుతోంది.

'హమ్మయ్య' అనుకున్నాడు అశోక్.

అశోక్ ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంటులో కూర్చుని సికింద్రాబాద్ చేరుకున్న వెంటనే తను చేయవలసిన పనులన్నీ మరోసారి నెమరు వేసుకుంటున్నాడు.

'ఇప్పటివరకూ తన ప్లాను సక్సెసయింది. ఇంక తిరుగులేదు' అనుకుంటూ తన తెలివితేటలకు తనే మురిసిపోతున్నాడు.

ఆలోచనలు నిద్రను కూడా దూరం చేశాయి.

ఉదయం ఏడున్నర కావస్తోంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్ చేరుకుంది.

ప్లాటుఫారం హడావిడిగా ఉంది.

ఒక్కొక్కరూ దిగుతున్నారు.

అశోక్ తన పరిసరాలను మరోసారి పరిశీలనగా గమనించాడు.

తనను ఎవరూ వెంబడించటం లేదని నిర్ధారణ చేసుకుని బ్రీఫ్ కేసు తీసుకుని ప్లాటుఫాం మీదకు దిగేడు.

తిన్నగా స్టేషనులోంచి బయటకు వెళ్ళి ఆటోలో అబిడ్స్ లోని తన రూము చేరుకున్నాడు.

నెమ్మదిగా కాలకృత్యాలు తీర్చుకున్నాడు.

టైము చూశాడు.

పదిన్నర అవుతోంది.

తను అనుకున్న విధంగా మొత్తం డబ్బంతా తన రూముకి దగ్గిరలో ఉన్న బ్యాంకులో డిపాజిట్టు చేద్దామని

రూముకి లాక్‌చేసి బ్రీఫ్‌కేస్‌తో బైటకొచ్చాడు.

అశోక్‌కు ఇదివరలోనే అబిడ్స్ దగ్గరలో ఉన్న బ్యాంకు అకౌంటుంది.

బ్యాంకు చేరుకున్నాడు.

పే ఇన్ స్లిప్ (డబ్బువేసే కాగితం) నింపి క్యాష్ కౌంటర్ ముందు క్యూలో నిలబడ్డాడు.

క్యూ నెమ్మదిగా కదులుతోంది.

తనవంతు వచ్చింది.

కాగితంతోపాటు పాసుబుక్కూ, డబ్బు క్యాష్ కౌంటర్ లోకిచ్చాడు.

డబ్బు తీసుకుని కాగితంమీద స్టాంపువేసి వెయిట్ చేయమన్నాడు క్యాషియర్.

బ్యాంకు వరండాలోని సోఫాలో కూర్చున్నాడు అశోక్. తదుపరి కార్యక్రమం ఆలోచిస్తున్నాడు.

పావుగంట దాటింది.

'ఇంకా లేటేమిటి?' అనుకుంటూ లేవబోయిన అశోక్‌కు ఎదురుగా యూనిఫామ్‌లో ఉన్న ఎస్సై నిలబడి ఉన్నాడు.

"మీరేనా అశోక్?" అడిగాడు.

"అవును" అన్నాడు.

"అయితే స్టేషనుకు నడవండి"

"ఎందుకు"

"వివరాలన్నీ స్టేషన్‌లో"

"నా పాసుబుక్"

"అదీ అక్కడే ఇస్తాం"

అప్పటికే చాలామంది వింతగా చూస్తున్నారు. ఇద్దరు

పోలీసులు అశోక్ పక్కనే నిలబడ్డారు.

పోలీసులు వెంటరాగా పోలీసుజీపు ఎక్కాడు అశోక్.

జీపు పోలీస్టేషను చేరుకుంది.

"వూఁ దిగు" అన్నాడు ఎస్సై.

అశోక్ ఇంకా దిగుదామనుకుంటుండగానే కానిస్టేబుల్ అశోక్‌ను బలవంతంగా దించి రిమాండులో వేసేరు.

తను ఎక్కడ పొరపాటు చేసింది అర్థంకాలేదు అశోక్‌కి.

అంతలోనే ఎర్రటి లాఠీతో ఎస్సై తనున్న గదిలోకి వచ్చాడు.

లాఠీ చూస్తూనే అశోక్ గుండె జల్లుమంది.

ఎస్సై లాఠీని విలాసంగా తిప్పుతూ—

"చెప్పు. మీ మిగతా ముఠావాళ్ళంతా ఎక్కడున్నారు" అంటూ గద్దించాడు.

"ముఠా ఏమిటి? నాకేం తెలీదు!" అన్నాడు భయంగా.

"అయితే, ఈరోజు నీవు బ్యాంకులో వేసిన లక్షరూపాయలు ఎక్కడివి?"

"అవీ...." అంటూ నసిగేడు.

రెండుక్షణాలు దాటింది.

అంతే!

నడుంమీద బలంగా పడింది ఎస్సై చేతిలోని లాఠీ.

కుక్కపిల్లిలా కుఁయ్యో అన్నాడు.

దీనంగా చూసేడు ఎస్సైవంక.

ఎస్సైలో ఏమాత్రం కనికరం కనిపించటంలేదు.

తను మాట్లాడకపోతే చంపేసేటట్లున్నాయి ఎస్సై చూపులు.

"నన్ను కొట్టొద్దు. జరిగినదంతా నిజమే చెబుతాను" అంటూ ఎస్సై కాళ్ళమీద పడ్డాడు ప్రతిపలాడుకుంటూ.

"చెప్పు! ఆ దొంగనోట్లు నీకెలా వచ్చేయి. మీ ముఠాలో ఎంతమంది సభ్యులున్నారు" అడిగాడు ఎస్సై.

అశోక్‌కి తల తిరిగినంత పనయింది.

తను అంత కష్టపడి ప్లాన్ చేస్తే చివరికి తనే మోస పోయేడు. ఇక ఏమి దాచదలుచుకోలేదు. వివరంగా చెప్పటం మొదలుపెట్టేడు.

"సార్ నేను చిల్లరదొంగను. ఈమధ్య విశాఖపట్నం లోని పీపుల్స్ బ్యాంకులోని గుమస్తాగా పనిచేస్తున్న రవీంద్ర అనబడే వ్యక్తి తాలూకు పర్సు బార్‌లో కొట్టే శాను. అప్పటికే ఆయన బాగా తాగిఉన్నాడు. అదే అద నుగా భావించి పెద్ద ప్లాను ఏదైనా వేద్దామని ఆయనతో బ్యాంకు విషయాలు చర్చించాను. ఆ మత్తులో ఆయన చెప్పిన లోను వ్యవహారాలు విన్నతరువాత రిస్కు లేకుండా డబ్బు సంపాదించవచ్చునని, మర్నాడే బ్యాంకుకు వెళ్ళి అదనుచూసి డ్రాఫ్ట్ కాగితం దొంగలించాను. తరువాత అశోకా ఇండస్ట్రీస్ ప్రొప్రయిటర్‌గా, పరమేశ్వర్ హోల్ సేల్ డీలర్స్ ప్రొప్రయిటర్ పరమేశ్వర్‌ను మోసంచేసి ఈ లక్షరూపాయలు సంపాదించాను. అయితే ఇవన్నీ దొంగనోట్లన్నమాట. ఎంత మోసంచేశాడు పరమేశ్వర్" అన్నాడు.

"అన్నీ నోట్లు దొంగనోట్లు కాదు. ముప్పైవేలు మాత్రమే. వెంటనే విశాఖపట్నంలోని క్రైమ్‌బ్రాంచికి ఈ విషయం తెలియజేయాలి" అంటూ టెలిఫోన్‌వైపు దారితీశారు ఎస్సై.

తెల్లబోయేడు అశోక్. □

అనాథప్రేతాలు

కె.వి.యస్.యన్.మూర్తి

ఉదయం ఎనిమిది గంటలయింది.

లీలామహల్—సినీమాహాలు బయట జనం విపరీతంగా పోగయ్యారు. అందరి మొహాల్లోనూ, ఆశ్చర్యం-భయం దోబూచులాడుతోన్నాయి.

ఎవరి నోటంట విన్నా "పాపం! ప్చ్!" అన్న జాలి పదాలే.

మరో పావుగంటలో పోలీస్ వ్యాన్ ఒకటి వచ్చి గుంపుదగ్గిర ఆగింది.

జనం రెండు పాయలుగా చీలి వ్యాన్‌లోంచి దిగిన

పోలీసులకు త్రోవ ఇచ్చారు. పోలీసులు ముందుకు వెళ్ళారు.

సినిమాహాలు కాంపౌండ్ వాల్‌కు ఆనుకొని ఒక డ్రైనేజ్ వుంది. ఆ కాలువలో బోర్లా పడిపోయి ఉంది ఒక శరీరం.

ఇన్‌స్పెక్టర్ సుందరం శవాన్ని బయటకు తీయించాడు.

చనిపోయిన వ్యక్తికి ఏభయి సంవత్సరాల వయసు ఉంటుంది. వంటిమీద పీలికలయిపోయిన దుస్తులు. మెడలో సొట్టలు పడిపోయిన అల్యూమినియం క్యారియర్ వ్రేలాడుతోంది. గెడ్డం బాగా మాసిపోయి ఉంది. తైల సంస్కారంలేని జుత్తు ఎర్రగా ఉంది. కళ్ళుమాత్రం తెరిచే ఉన్నాయి. చూపులు ఆకాశంలోకి ఉన్నట్లున్నాయి. నుదిటిమీద చెరిగిపోయిన సిందూరం ఉంది.

ఫోటోగ్రాఫర్లు శవాన్ని వివిధ కోణాల్లోంచి ఫోటోలు తీస్తూన్నారు.

పోలీస్ సర్జన్ శవాన్ని పరీక్ష చెయ్యటంలో మునిగి పోయాడు. పదినిముషాలు పోయిన తరువాత పైకిలేచాడు. "గుండె ఆగిపోవటం వలన మరణం సంభవించి వుండ వచ్చు. ప్రాణం రాత్రి పది, పదకొండు గంటల మధ్య పోయి ఉండొచ్చు. వివరాలు అటోప్సీ తర్వాత క్లియర్‌గా తెలుస్తాయి" అన్నాడు.

సుందరం తలవూపాడు.

"ముందుగా శవాన్ని ఎవరు చూశారు?" అక్కడున్న జనాన్ని ఉద్దేశించి అడిగాడు సుందరం.

సమాధానం లేదు.

"ఇంతమంది నిలబడి చోద్యం చూస్తూన్నారు— ఒక్కడూ సమాధానం చెప్పరేం?" విసుక్కున్నాడు

సుందరం.

ఎవ్వరూ సమాధానం చెప్పలేదు సరికదా—వీలుచూసు కుని ఒక్కొక్కడే అక్కడనుండి జారుకోవటం మొదలు పెట్టారు.

పట్టణాల్లో యిది మామూలే. ప్రక్కన కొంప తగుల బడి పోతున్నా ఎవరూ పట్టించుకోరు. ఏ మాటంటే ఏం ముంచుకొస్తుందో—అన్న భయం. పోలీసు వ్యవహారం, కలుగజేసుకుంటే పోలీసు స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగాలి. మనకెందుకులే—అన్న స్తబ్ధత.

"ఈ విషయం గురించి మాకు ఫోన్ చేసిం దెవరు?" అడిగాడు సుందరం.

రెండు నిముషాల తర్వాత ఒక వ్యక్తి అక్కడకు వచ్చాడు. అతని వయసు మూడు పదులుండొచ్చు. "సారీ సార్! మీరొచ్చే టయిమ్‌కు యిక్కడ లేకపోయాను" అంటూ యిన్‌స్పెక్టర్ వయిపు చెయ్యి చాచాడు.

సుందరం అతనితో కరచాలనం చేసి అర్థం కానట్లు చూశాడు.

"నా పేరు అప్పారావు సార్! ఈ మధ్యనే లా పూర్తి యింది - ప్రాక్టీసు మొదలు పెడదామనుకుంటున్నాను. ఈ ఎదురుగుండా ఉన్న యిల్లే మాది" అన్నాడు అప్పా రావు.

"ఐ. సీ!" అని, "ఇందులో మీకేమిటి యింటరస్టు?" అడిగాడు సుందరం.

"రాత్రి బాగా లేటుగా పడుకున్నాను. ఇక్కడ జనం చేసే గోలకు మెలకువ వచ్చింది. వచ్చి చూద్దును కదా, డ్రయినేజ్‌లో శవం పడుంది. మీకు ఫోన్ చేశాను. తిరిగి వస్తూండగా దారిలో మా స్నేహితుడు కలిశాడు."

"తిరిగి వస్తూంటగా అంటే?"

"ఇక్కడ ఫోన్‌లు వున్నా నాకు అంతగా పరిచయమున్నవాళ్ళు లేరు. ఇంత ఉదయాన్నే - అందులోనూ యిలాంటి విషయాల్లో ఫోన్ అడిగి వాళ్ళని యిబ్బంది పెట్టటం యిష్టం లేదు. అందుకే అల్లిపురం జంక్షన్‌లో మా ఫ్రెండ్ వుంటే మీకు అక్కడ నుండి ఫోన్ చేశాను."

"హతుడు మీకు తెలుసా?" అడిగాడు సుందరం.

"హతుడా!" అంటూ అప్పారావు శవం వయిపు చూశాడు. తెలుసన్నట్లు తలూపాడు.

"ఎవరు? పేరేంటి?"

"ఇతడు ఒక ముష్టివాడు. పేరు నాకు తెలియదు. పగలంతా ఎక్కడెక్కడో తిరుగుతాడు. రాత్రి ఈ ప్రాంతంలోనే పడుకుంటూ వుంటాడు."

"ఇతడు మీకెంత కాలంగా తెలుసు?"

"నాకు వూహ తెలిసినప్పటి నుండీ చూస్తూనే వున్నాను."

"ఇతన్ని ఎవరయినా చంపేసి యిక్కడ పడేసి వుండొచ్చా?"

అప్పారావు ఒక్క క్షణం మాట్లాడలేదు. "మరణం ఎలా సంభవించింది?" అనడిగాడు చివరకు.

సుందరం అతన్ని చురుగ్గా చూశాడు. ఎదురు ప్రశ్న వెయ్యటాన్ని అతడు సహించలేకపోయాడు కాబోలు. అయినా తమాయించుకుని "గుండె ఆగిపోవటం వలన" అన్నాడు.

అప్పారావు ఒక్కసారి వూపిరి పీల్చాడు. "ఇతడికి విరోధులు ఎవరూ వుండరని నా అనుమానం. పైగా

యితడు మూగ, చెవిటివాడు. ఇతడిని చంపాల్సిన అవసరం ఎవరికీ వుండదనుకుంటున్నాను. బహుశ సహజ మరణమే అయుండొచ్చు" అన్నాడు.

సుందరం హుందాగా తలూపాడు. అతడు కూడా దానిని సహజ మరణంగానే నమ్మాడు. అప్పారావు వైపు చూసి "చాలా థాంక్సండీ!" అన్నాడు.

"వెల్‌కమ్! అవసరమైతే కబురు చేయండి" అన్నాడు సంతోషంగా అప్పారావు.

మరో పది నిముషాల్లో శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

2

ఉదయం చిన్నగా మొదలయిన వాన మధ్యాహ్నానికి ఉధృతమైంది.

గరుడా వారి సత్రము దగ్గరకు ఒక రిక్షా వచ్చి ఆగింది. రిక్షావాడు సీటుమీద కూర్చునే - సత్రం అరుగు మీదకు చూశాడు.

అక్కడ ఒక ఆకారం ముడిచి పెట్టుకు పడుకుని వుంది. చలికి చిన్నగా వణుకుతోన్నట్లు, అతన్ని పూర్తిగా కప్పలేని చిరుగుల గొంగళి చాటి చెపుతోంది.

రిక్షావాడి మనసు బాధగా మూలిగింది. గబగబా రిక్షా దిగి, వెనుక సీటు క్రింద దాచిన చిన్న కేరియర్‌ను బయటకు తీశాడు. రెండంగల్లో అరుగు మీదకు వచ్చాడు. వేసుకున్న రెయిన్ కోటును ప్రక్కన పెట్టి, క్యారియర్ తో ఆ ఆకారం దగ్గరకు వెళ్ళాడు. ఆకారం మీది గొంగళిని ప్రక్కకు నెట్టి "పెద్దయ్యా!" అని ఆప్యాయంగా పిలిచాడు.

ఆకారం కళ్లు విప్పి చూసింది. "ఏందిరా రాజన్నా? యింత వానలో వచ్చావు?" అన్నాడు లేవడానికి ప్రయత్నంచేస్తూ.

రాజన్న అతడికి చెయ్యి అందించి కూర్చుందుకు సాయం చేశాడు. "ఎందుకు పెద్దన్నా నువ్వు ఈ వయసులో యిలా బాధపడతావు? చక్కగా నా గుడిసెకు రా! నిన్ను పువ్వుల్లోపెట్టి చూసుకుంటాను" అన్నాడు రాజన్న.

పెద్దయ్య పేలవంగా నవ్వాడు. రాజన్న వయిపు ఆప్యాయంగా చూశాడు. "ఒరేయ్! నేనొచ్చి నీ గుడిసెలో తొంగుంటే నన్ను నమ్ముకునోళ్ళు ఏమయిపోతార్రా?" అన్నాడు.

రాజన్న కళ్ళు చెమర్చాయి. సరిగ్గా పద్దెనిమిదేళ్ళ క్రితం ఎవరో తనని కని రోడ్డుమీద పడేశారు. ఆ సమయానికి అటు వెళుతోన్న పెద్దయ్య ఆ పసిగుడ్డుని పెంచి పెద్దచేసి యింతవాణ్ణి చేశాడు. పదిళ్ళల్లో అడుక్కుతిని వచ్చిందాన్ని కూడబెట్టి - దాంతో కొందరు అనాధలను చేరదీసి పెంచుతూ వుంటాడు పెద్దయ్య. వాళ్ళ నుంచి ఏ రకమయిన ప్రతిఫలాన్నీ అతడాశించడు. అరవయి సంవత్సరాల పెద్దయ్య అంటె ఆ చుట్టుపక్కల వారందరికీ చాలా గౌరవం.

రాజన్న క్యారియర్ విప్పాడు, "పెద్దయ్యా! నీకోడలు నీకోసం పంపింది!" అంటూ దాన్ని అతడి ముందుకు తోశాడు రాజన్న.

మామూలు సమయాల్లో అయితే పెద్దయ్య ఎంతో సంబరపడిపోయేవాడు. కానీ ఆ రోజు ఎందుకో ఉదాసీనంగా వున్నాడు.

రాజన్న అది గమనించాడు, "ఏమయింది పెద్దయ్యా?" అన్నాడు బాధగా.

"ఎర్రబ్బాయి చచ్చిపోయాడ్రా?" పెద్దయ్య గొంతు పట్టేసింది.

రాజన్నకు షాక్కొట్టినట్లయింది. "చచ్చిపోయాడా?" అన్నాడు ఆశ్చర్యంగా.

ఎర్రబ్బాయి కూడా రాజన్నతో పెద్దయ్య దగ్గిరే పెరిగాడు. పుష్టిగా వుండటం వలన రాజన్న రిక్షా త్రిప్పుతోన్నాడు. ఈ మధ్యనే మరో రిక్షా వాడికూతుర్ని పెళ్ళికూడా చేసుకొన్నాడు. ఎర్రబ్బాయి కొన్ని విద్యలను ప్రాక్టీస్ చేశాడు. రోజూ ఎక్కడో అక్కడ తన విద్యను ప్రదర్శించి డబ్బు సంపాదిస్తూ ఉంటాడు. రోడ్డు పక్కన చిన్న గొయ్యి త్రవ్వకుని దాంట్లో తలపెట్టి చుట్టూ మట్టి కప్పుకుని శీర్షాసనం వేస్తాడు. ఏ పది గంటలకో మొదలు పెట్టి అలా సాయింత్రందాకా వుంటాడు.

"అవున్రా! భూమిలో తల కప్పుకుని వూపిరాడక చచ్చిపోయాడంట" తన్నాడు పెద్దయ్య.

"అబద్ధం! వాడికి ఆ విద్య బాగా తెలుసు. అలా ఎప్పటికీ జరగదు" అన్నాడు రాజన్న.

"అవున్రా! అది నాకూ తెలుసు! వాడిని కూడా ఆ దుర్మార్గుడే చంపేశాడు." పెద్దయ్య మాటల్లో ఆవేశం వుంది.

రాజన్న ఒక్క నిమిషం మ్రాన్పడిపోయాడు. పెద్దయ్య వయిపు విచిత్రంగా చూశాడు. "వాడిని కూడా అంటే!" అన్నాడు చివరకు.

"ఈమధ్య నలుగురు అనాథలు చనిపోయార్రా. ఒకడు గుండాగి, ఒకడు నూతిలో కాలుజారి పడిపోయి,

మరొకడు విషాహారం తినడంవలన, ఈవాళ ఎర్రబ్బాయి. నాలుగూ సహజ మరణాలేనంట. అటు పేపరోళ్ళుగానీ, యిటు పోలీసోళ్ళుగానీ ఈ ముష్టోళ్ళ చావుల గురించి పట్టించుకోలేదు. వరుసగా నాలుగు రోజులు - నలుగురు చచ్చిపోయారంట - ఎంత సహజ మరణాలయినా అంత వరసగా జరగవు - అనే యింగితజ్ఞానం ఆళ్ళకుండాలి. మన చావులవల్ల ఎవరికీ వచ్చిన నష్టంలేదు. పైగా వూరికి పట్టిన దరిద్రం కొంత పోతుంది" ఆవేశపడిపోయాడు పెద్దయ్య.

పెద్దయ్య అంత ఆవేశపడ్డం రాజన్న ఎప్పుడూ చూడలేదు.

రెండు నిముషాల తర్వాత మళ్ళీ పెద్దయ్యే మొదలు పెట్టాడు. "ఆళ్ళను చంపిన దొంగనాకొడుగ్గురించి పోలీ సోళ్ళకు చెప్పినా. ఈ రేతిరికి దాని సంగతి తేలుస్తా మన్నారు" అన్నాడు.

"నువ్వెళ్ళి, పోలీసోళ్ళకు చెప్పావా?"

"అవును."

"మరంతా కాగితం మీద రాశారా?"

"లేదురా! రాత్రికి చెపుతామన్నారు."

రాజన్నకు ఎందుకో ఆ వ్యవహారం అపసవ్యంగా కని పించ సాగింది. "ఎవరితో పెద్దయ్యా నువ్వు చెప్పింది?" అడిగాడు.

పెద్దయ్య ఒక్క నిముషం బుర్ర గోక్కున్నాడు. "ఆరి పేరు వెంకటేశం" అన్నాడు జ్ఞాపకం తెచ్చు కొంటూ.

"ఇంతకీ ఈ ఎదవపనులు చేయించేది ఎవరు పెద్దయ్యా?" కుతూహలంగా అడిగాడు రాజన్న.

పెద్దయ్య అటూ యిటూ చూశాడు. రాజన్న దగ్గరగా నోటినుంచి "ఆ దుర్గాప్రసాద్ ...." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు. ఇంతలో సత్రవద్వారం దగ్గిర చప్పుడవటంతో ఆ మాటను ఆపి "నువ్వు రాత్రి సరిగ్గా పది గంటలకు యిక్కడికి రా! ఇంకెళ్ళిపో!" అంటూ తొందర పెట్టాడు పెద్దయ్య.

రాజన్న తలవూపి బయట వానలో తడుస్తోన్న రిక్షా వయిపు అడుగులు వేశాడు.

3

ఎస్. పి శ్రీనివాసరావు తనముందు కూర్చున్న ఆఫీసర్ల వయిపు కోపంగా చూశాడు. "ఛ! వాటెషేమ్ టుది డిపార్ట్‌మెంటు. వరసగా అయిదుగురు ముష్టివాళ్ళు చనిపోయారంటే! ఛ! యింకా ఎంతమంది చచ్చేకా ఆ చావులకి కారణం కనుక్కోగలమో?" అన్నాడు చిరాగ్గా.

ఇన్‌స్పెక్టర్ సుందరం వినయంగా లేచి నిలబడ్డాడు. "ఆ అయిదు మరణాలలోనూ అనుమానించాల్సిన విషయం ఏమీ లేదు సార్!" అన్నాడు.

ఎస్. పి అతడిని చిరాగ్గా చూశాడు. "వెల్! మిస్టర్ సుందరం! బాగా చెప్పావు. నా దర్యాప్తులో తెలిసిన విషయం అయిదారుగురు, లేకా యింకా ఎక్కువమంది ముష్టివాళ్ళు కలిసి పడుకుంటారని. అలాంటప్పుడు చనిపోయిన వ్యక్తి వాళ్ళమధ్యనే వుండాలి. కానీ చనిపోయిన అయిదుగురూ విచిత్రంగా ఒకడు డ్రయినేజిలో, మరొకడు నూతిలో....యిలా విడిగా దొరికారు. మరణాలు సహజంగా కనిపిస్తూన్నాయేమోగానీ, దాంట్లో ఏదో రిడిల్ వుందని మాత్రం తప్పనిసరిగా చెప్పగలను. పైగా మీరు గమనించారో లేదో చనిపోయినవారి శరీరాలమీద పసుపు

కుంకుమలు వున్నాయి. పైగా ఈ ఉదయం, భయంకర మైన క్యాన్సర్ వ్యాధివలన చనిపోతున్నాను - అని కాగితం రాసి చనిపోయిన పెద్దయ్య విషయం మరీ విచిత్రంగా వుంది." అని "పెద్దయ్య కేసును డీల్ చేస్తున్నది ఎవరు?" అన్నాడు.

ఇనస్పెక్టరు వెంకటేశం ఖంగారుపడుతూ లేచి నిలబడ్డాడు. "నేనే సార్!" అన్నాడు.

"మీకు బీచ్‌లో శవం వుందని ఎవరు చెప్పారు?"

"ఉదయం ఫోన్ వచ్చింది సార్!"

"ఫో నెవరు చేశారు?"

"ఎవరో అడిగేలోపునే డిస్కనక్ట్ చేశారు సార్!"

"హతుడు తాను ఆత్మహత్య చేసుకుంటోన్నట్లు వ్రాసిన ఉత్తరం మీకు ఎక్కడ దొరికింది?"

"అతడి సామానులలో సార్!"

"అతడికి నిజంగా కేన్సరేనా?"

"అవునుసార్! డాక్టర్ బలరామ్ అనే ఫిజీషియన్ దగ్గరకు వెళ్ళి టెస్టు చేయించుకొన్నాడు." అంటూ సర్టిఫికేట్‌ను ఎస్.పి.కి అందించాడు వేంకటేశం.

"ఆయన దగ్గరకు పెద్దయ్య ట్రీట్‌మెంట్‌కోసం వెళ్ళినట్లు మీకెలా తెలుసు?"

"ఆయన బీచ్‌రోడ్లో వాకింగ్ వచ్చినప్పుడు మమ్మల్ని చూసి దగ్గరకు వచ్చాడు. శవాన్ని గుర్తుపట్టాడు."

ఎస్.పి. చిన్నగా నవ్వాడు. "ఒక ముష్టివాడు వ్యాధికి భయపడి ఆత్మహత్య చేసుకోవటం - దానికి సంబంధించి వుత్తరం రాయటం, శవాన్ని గురించి అపరిచితుడు మన్కి చెప్పడం అదే సమయానికి అతడిని ట్రీట్ చేసిన్ల ప్ర....యి....వేటు ఫిజీషియన్....గవర్నమెంటు హాస్పిట

ఉండగా పూటకు గతిలేని ఒక అనామకుడు కోరివచ్చి ట్రీట్‌మెంటు తీసుకుంటోన్న ఫిజీషియన్, కాకతాళీయంగా అక్కడ కలవటం. వెల్! చాలా బావుంది. వెళ్ళండి.” అన్నాడు నిస్పృహతో.

అతడికి తెలుసు అది ప్రీప్లాన్డు మర్డరనీ, చాలా పకడ్బందీగా దాన్ని ఆత్మహత్యగా కన్వర్ట్ చేస్తోన్నారనీ, తన అనుమానం తప్ప హత్యగా దాన్ని నిరూపించే ఆధారాలు తన దగ్గరలేవు. అన్నిటికన్నా తనని కలవర పెడుతోన్న విషయం మరోటుంది. రాత్రి ఏడుగంటల సమయంలో పెద్దయ్య తన బంగ్లాముందు తచ్చాడాడని సెంట్రీ చెబుతోన్నాడు. అలా ఎందుకు తచ్చాడాడు? జిల్లా అధికారయిన తనే చేతులు ముడుచుకు కూర్చోవాల్సి వచ్చింది. అందుకే అతడికి అంత నిస్పృహ.

ఇన్‌స్పెక్టర్ వెంకటేశానికి మాత్రం ఒళ్ళంతా చెమట పట్టేసింది. సంఘంలో పేరుపడ్డ పెద్దమనిషి ప్రాపకం కోసం తను తప్పుపని చేశానేమో - అని మొదట బాధ పడ్డాడు. కానీ కొడుక్కి మెడిసన్ సీటు దొరుకుతోందన్న సంతోషం ఆ బాధను కప్పేసింది.

4

రాజన్న పిచ్చిపట్టినట్లు వూరంతా రిక్షా తొక్కుతూ రాత్రిదాకా గడపాడు అతడి గుండెల్లో లావా పొంగు తోంది. అతడికి తెలుసు పెద్దయ్యను హత్యచేశారని! ‘ఆ హత్యకు కారకుడు ఇన్‌స్పెక్టర్ వెంకటేశం - వాడితో చెప్పడంవల్లే పెద్దయ్య చచ్చిపోయాడు.’ అని నమ్మకం ఏర్పడింది అతడికి. అందుకే ముందు అతడిని చంపి పెద్దయ్య ఆత్మకు శాంతి చెయ్యాలనుకున్నాడు.

కసాయివాడి దగ్గిరకువెళ్ళి బ్రహ్మాండమయిన వేట కత్తిని సంపాదించాడు. 'రోడ్డుమీద కనిపించినా సరే వాడిని తెగనరకాలి' అన్న పట్టుదలతో మధ్యాహ్నంనుంచీ రోడ్లట్టుకు తిరుగుతోన్నాడు.

హాస్పటల్ టవర్‌క్లాక్ రాత్రి పదిగంటల్ని చూపిస్తోంది.

రాజన్న ఒక నిశ్చయానికి వచ్చేశాడు.

గబగబా రిక్షాను దుర్గాప్రసాద్ యింటివయిపు తొక్కటం ఆరంభించాడు. మరో పావుగంటలో రిక్షా దుర్గా ప్రసాద్ యింటికి దగ్గిర్లో ఆగింది.

రాజన్న రిక్షా దిగాడు. రిక్షాను కుప్పతొట్టె ప్రక్కకు లాగాడు. దుర్గాప్రసాద్ యింటివయిపు అడుగులువేశాడు. అక్కడి హడావిడిని చూసి ఆశ్చర్యపోయాడు.

దుర్గాప్రసాద్ యింటిముందు చాలామంది ముష్టివాళ్ళు గుంపుగా వున్నారు. మధ్యాహ్నం మొదలయిన అన్న సంతర్పణ యింకా పూర్తికాలేదు.

దుర్గాప్రసాద్ నలుగురు మిత్రులతో కలసి లాన్‌లో కూర్చుని మధువు తాగే ప్రయత్నం చేస్తోన్నాడు. అతడికి ముష్టివాళ్ళను చూస్తే చిరాగ్గా వున్నట్లుంది కాబోలు మాటి మాటికీ వెనక్కు తిరిగి యింకా అవ్వలేదా అంటోన్నాడు.

"అయిపోయిందన్నయ్యా!" అంటూ సర్ది చెబుతోన్నాడు అతడి తమ్ముడు వేణుప్రసాద్. సంతర్పణ వ్యవహారాన్నంతటినీ అతడే జరిపిస్తోన్నాడు.

దుర్గాప్రసాద్ పెద్ద పారిశ్రామికవేత్త. ఈ మధ్యకొద్దిగా ఒడిదుడుకులలో చిక్కుకున్నట్లు వినికిడి అన్నగారి పరిస్థితులు మెరుగుపడాలని వేణుప్రసాద్ పూజలూ గట్రా చేయించి అన్నదానం చేస్తోన్నాడు.

మరోగంటలో అన్నదాన కార్యక్రమం ముగిసింది. ఒక్కొక్కరే తిరుగుమొహం పడుతోన్నారు.

రాజన్న దృష్టంతా దుర్గాప్రసాద్ మీదే వుంది.

ఉన్నట్టుండి దుర్గప్రసాద్ కుర్చీలోంచి లేచాడు. వడి వడిగా అడుగులు వేస్తో గేరేజ్ దగ్గరకు వెళ్ళాడు. ఎర్ర రంగు మారుతీకారు తీసి రయ్‌మని బయట కురికించాడు.

అప్పుడు సమయం పన్నెండు కావటానికి యిరవై నిముషాలుంది.

రాజన్నకు ఏం చెయ్యాలో పాలుపడలేదు. మారుతిని వెంబడించటం తన తరంకాదు. అందుకే ఉసూరంటూ రిక్షావయిపు అడుగులు వేశాడు.

అతడు పూర్తిగా రిక్షాను చేరుకోకుండానే అతడి అడుగులు మంత్రించినట్లు ఆగిపోయాయి.

కుప్పతొట్టె అవతల రెండు ఆకారాలు నిలబడి మాట్లాడుకుంటోన్నాయి.

"మంచి గవర్నమెంటు సరుకుంది వస్తావా?"

"ఆ! బయటకు తియ్యి!"

"ఇక్కడకాదు."

"మరెక్కడ?"

"అలా వూరు చివరకు పోదాంరా."

రాజన్నకు నరాలు బిగుసుకున్నాయి. అందులో ఒకడి గొంతు పీర్లసాయిబుది. మరో గొంతు ఎవరిదో తెలియదు.

పీర్లసాయిబుకు సారా అంటే ప్రాణం. ఉదయం నుంచి సాయింత్రందాకా అడుక్కొని ఆ వచ్చిన డబ్బుతో సాయంత్రం మందు కొట్టేస్తాడు. "పీర్లసాయిబుకు అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయన్నమాట." రాజన్న

కళ్ళలో నీళ్ళు నిండాయి. 'ఈ రోజుతో ఈ మారణకాండ ఆగిపోవాలి' రాజన్న పట్టుదల పెరిగిపోయింది.

అయిద్దర్నీ అక్కడనుండి కదలనిచ్చి, రాజన్న నెమ్మదిగా రిక్షావయిపు కదిలాడు.

రెండు నిముషాలకన్నా వాళ్ళిద్దర్నీ అనుసరించలేక పోయాడు. ఇద్దరూ ఒక గల్లీలోకి తిరిగి వెంటనే మాయమయిపోయారు.

రాజన్నకు ఉక్రోషం వచ్చేసింది. ఏం చెయ్యాలో పాలుపోలేదు అయిదు నిముషాలు అలాగే నిలబడి పోయాడు. అంతలోనే అతడి మెదడులో చిన్న మెరుపు మెరిసింది. "ఊరు చివర—అంటె - క్వారీల వయిపు అయిండాలి. అది వూరుకు కొంచెం దూరం. దగ్గిరగా వున్నది స్మశానం. పీర్లసాయిబు క్వారీల వరకు వెళ్ళడు. బహుశ వాళ్ళు స్మశానం వయిపే వెళ్ళుండాలి" ఆ ఆలోచన రాగానే రిక్షాను అటువయిపు దూకించాడు. సరిగ్గా అప్పుడు సమయం పన్నెండు దాటి అయిదు నిముషాలయింది.

ఆయాసం వస్తూన్నా లెక్కచెయ్యకుండా వేగంగా రిక్షా తొక్కుతూ పన్నెంఘూ నలభై కి రాజన్న స్మశానం దగ్గిరకు చేరుకున్నాడు. రిక్షాను ఆపి క్రిందకు దిగాడు. కత్తిని చేతిలోకి తీసుకున్నాడు. గబగబా ముందుకు నడిచాడు. చుట్టుప్రక్కల ఎవరూ కనిపించలేదు. స్మశానంలోకి అడుగులు వేశాడు. దూరంగా చితి కాలుతోంది, ఆ చితివయిపు చూసి రాజన్న వులిక్కి పడ్డాడు.

పీర్లసాయిబు అప్పటికే శవంగా మారిపోయాడు. ఆ శవంమీద కూర్చుని ఒక వ్యక్తి ఏదో మంత్రాలు పఠిస్తోన్నాడు.

రాజన్న వంట్లో రక్తం సలసల మరిగింది. కత్తిని బిగించి పట్టుకుని నెమ్మదిగా అడుగులు వేశాడు. ఇప్పుడు సరిగ్గా వాళ్ళ వెనక్కు వచ్చాడు రాజన్న. మంత్రాలు చదువుతోన్న వ్యక్తి దిగంబరంగా వున్నాడు. రాజన్న ఆవేశంతో కత్తిని పైకెత్తాడు. మరో క్షణం వుంటె ఆ వ్యక్తి తల తెగి క్రింద పడేదే! కానీ సరిగ్గా అప్పుడే రాజన్న దృష్టి ఆ ప్రక్కనే వున్న సారా సీసాలమీద పడింది.

అంతే! అతడు తన ప్రయత్నాన్ని విరమించి కత్తిని క్రిందకు దింపాడు. సారా సీసాల దగ్గరకు వెళ్ళి రెండు సీసాలను తీసుకున్నాడు. మంత్రాలు చదువుతోన్న వ్యక్తి వెనక్కు వచ్చి చటుక్కున అతని జుత్తు పట్టుకొన్నాడు. ఆ వ్యక్తికి జరుగుతోన్నది అర్థం కాలేదు. ఏం జరిగిందీ గ్రహించేలోగా రాజన్న అతన్ని వెనక్కు పడేసి అతడి గుండెలమీద కూర్చున్నాడు. సారా సీసాను అతడి నోట్లో వుంచి "త్రాగు!" అన్నాడు.

ఆ వ్యక్తి గింజుకోబోయాడు.

కానీ రాజన్న బలం ముందు అతడు ఓడిపోయాడు. అతడి ప్రయత్నం లేకుండానే రెండు సీసాల సారా అతడి కడుపులోకి వెళ్ళిపోయింది.

చేస్తున్న పనిని ఆపి రాజన్న చటుక్కున అతడి ముక్కు మూశాడు. ఒక నిముషం అటూ యిటూ తన్నుకుని అతడు తల వాల్చేశాడు.

రాజన్న తృప్తిగా అతడి మీద నుండి లేచాడు. దిగంబరంగా పడివున్న అతడి శరీరం వయిపు జుగుప్సగా చూశాడు.

పీర్లసాయిబు శవాన్ని నింపాదిగా లేపాడు. అతడికి

బట్టలు తొడిగాడు. మరో చినిగిన జతను రెండో శవానికి తొడిగాడు. ఆ శవాన్ని చితి మంట దగ్గరకు తీసుకు వెళ్ళాడు. అతడి మొహం మీద సారాను వంపాడు. చేతులమీద కూడా సారాను వంపాడు. రెండు పాత బట్ట లను సారాతో తడిపి, చితి మంటలో వెలిగించాడు. ఆ గుడ్డల్ని అతని మొహంమీదా చేతులమీదా వేశాడు. అర గంటలో శవం గుర్తుపట్టడానికి వీలు లేనట్లు మారి పోయింది.

రాజన్న హాయిగా వూపిరి పీల్చాడు. శవాన్ని చితి దగ్గిరగా లాగాడు. క్రింద పడిన కత్తిని తీసుకుని రిక్షా వయివు అడుగులు వేశాడు.

రిక్షా ముందుకు సాగిపోయింది.

*　　　　*　　　　*

మర్నాడు ఆ ప్లేస్‌ను విజిట్ చేసిన ఇన్‌స్పెక్టర్ వెంక టేశం "పాపం మళ్ళీ రెండు అనాథ ప్రేతాలు" అను కొన్నాడు.

"చలికాలం చితి ప్రక్కన కూర్చొని యిద్దరూ మందు కొట్టారు. మందెక్కువయ్యి ప్రాణాల మీదకు తెచ్చు కున్నారు. మందు బాగా ఎక్కువై ఒకడు చితి మీద పడ్డాడు. దాంతో మొహం చేతులూ కాలిపోయాయి" అని రిపోర్టు రాశాడు.

కానీ రూపురేఖలు లేని శవం, తనను పోషిస్తోన్న మనిషి వేణూప్రసాద్‌దనీ, ఏదో నిధిని కాజేసే ప్రయ త్నంలో క్షుద్రోపాసనకు అనాథల ప్రాణాల తీసినందుకు ఫలితాన్ని అనుభవించాడనీ తెలిస్తే - అతడి పరిస్థితి ఎలా వుండేదో! □

సీరియల్



వసుంధర

(గత సంచిక తరువాయి)

"అంటే?"

"ఇదంతా నీ నాటకమేనని - యిప్పుడే ఋజువు చేస్తాను. నాతోపద" - అంటూ బయటకు దారితీశాడు ఛోటేలాల్.

కుమారస్వామి అతడి ననుసరించాడు.

ఇద్దరూ కుటీరం బయట పార్కు చేసి ఉన్న వాహనాల్లో ఓ ఎర్రకారు దగ్గిరకు వెళ్ళారు. ఆ కారు డిక్కీ తాళానికి నంబరుసిస్టం ఉంది.

ఛోటేలాల్ ఏవో నంబర్లుతిప్పి - తాళంచెవి కన్నంలో ఉంచి తిప్పాడు. తర్వాత డిక్కీ తలుపు పైకెత్తాడు.

కుమారస్వామి ఆత్రుతగా లోపలకు తొంగిచూశాడు.

అక్కడ ఓ నల్లరంగు తోలుపెట్టిఉంది.

ఛోటేలాల్ పెట్టిమూత తెరిచాడు.

లోపల ముడుచుకుని పడుకుని ఉందో యువతి. ఆమె చప్పున లేచి కూర్చుంది.

"విచిత్రా! నీకు లోపల కంఫర్టబుల్‌గా అనిపించిందా?" అన్నాడు ఛోటేలాల్ ఆప్యాయంగా.

"ఇరుగ్గాఉంది కానీ ఫరవాలేదు-" అంది విచిత్ర -

డిక్కీలోంచి బయటకు దిగుతూ.

ఛోటోలాల్ కుమారస్వామితో - "ఇక్కడ కాపలా మనుషులెవరూ లేరా?" అన్నాడు.

కుమారస్వామి చప్పట్లు కొడితే ఎవరూ రాలేదు. కాస్త ముందుకువెళ్ళి చూస్తే అంతకుముందు పెట్టెను మోసు కొచ్చిన వాళ్ళిద్దరూ స్పృహతప్పి పడిఉన్నారు.

"నువ్వు బొత్తిగా చేతకానివాడివేనా అయుండాలి. లేదా జగజ్జంత్రీవై ఉండాలి...." అన్నాడు ఛోటేలాల్.

"అంతా వింతగా ఉంది." అన్నాడు కుమారస్వామి.

"ఇందులో వింతేమీలేదు. అసలేంజరిగిందో నేను లోపల చెబుతాను - పద." అన్నాడు ఛోటేలాల్.

విచిత్ర, ఛోటేలాల్, కుమారస్వామి కుటీరం లోపలకు వెళ్ళారు.

అప్పటికింకా ఎవ్వరికీ స్పృహరాలేదు. ఛోటేలాల్, కుమారస్వామి వారిని తట్టిలేపారు.

"ఏంజరిగింది?" అన్నది స్పృహవచ్చిన వారందరూ వేసినప్రశ్న.

బదులుగా ఛోటేలాల్ వారికి విచిత్రను చూపించాడు.

వారందరూ విచిత్రను చూసి - "మిస్‌మిస్టరీ - మాకు నువ్వేంమాత్రం వేశావు - ?" అన్నారించుమించు ఏక కంఠంతో.

విచిత్ర మాట్లాడలేదు.

"ఇందాకా మీరు చూసిన మిస్‌మిస్టరీ ఈమె కాదు" అన్నాడు ఛోటేలాల్.

"మరి—?" అన్నాడు నాయు డాశ్చర్యంగా.

"ఈమె నా కారు డిక్కీలో బ్రహ్మ రుద్రుల కూడా సాధ్యం కాని విధంగా బంధించబడింది. అందుకని మనని

బెదిరించడానికి వేరే అమ్మాయి మిస్ మిస్టరీగా వచ్చింది. ఈమె నిప్పుడు నేను నా కారు డిక్కీలోంచి తీసుకుని వచ్చాను...." అన్నాడు ఛోటేలాల్.

"అసలేం జరిగింది?" అన్నాడు నాయుడు.

ఛోటేలాల్ అంతా చెప్పాడు.

నాయుడు సాలోచనగా - "మిస్ మిస్టరీగా పాట పడిన అమ్మాయి అద్భుత శక్తులు ప్రదర్శించింది. అంటే ఆమె మామూలు మనిషై ఉండదు. బహుశా దెయ్యం కూడా కావచ్చు ఆమె తన ప్రతాపం ప్రదర్శించి తిరిగి యధాప్రకారం డిక్కీలోకి వెళ్ళి కూర్చుందేమో!" అన్నాడు.

"ఈమె మిస్ మిస్టరీ కాదని నా నమ్మకం. ఇందాకా వచ్చిన అమ్మాయి వేరు. అదే నిజమైతే ఆమెకు అద్భుత శక్తులు లేవు. ఉండి ఉంటే నా కారు డిక్కీ తనే తెరవ గలిగేది...." అంటూ - "ఆలోచించండి... మనం చూసిన యిద్దరూ ఒక్కలాగే ఉన్నారు. ఇది బహుశా యిద్దరు కవల లాడుతూన్న నాటకం కావచ్చు. లేదా రెండో మనిషి ఈ విచిత్ర రూపాన్ని ఏ మాస్క్ ద్వారానో సాధించి ఉండవచ్చు. అందుకు మనలోనే యిక్కడెవరో సహక రిస్తున్నారు. నా అనుమానమంతా కుమారస్వామి పైన ఉంది" అన్నాడు ఛోటేలాల్.

"నిజంగా నాకేమీ తెలియదు. కానీ ఈ మిస్ మిస్టరీ చూస్తూండగా రూపాలు మార్చగలదని నాకు తెలుసు. ఒక సారి నేను చూస్తూండగా తల వంచుకొని తలెత్తేసరికి నా కూతురిలా మారిపోయిందీమె ముఖం" అన్నాడు కుమార స్వామి.

ఛోటేలాల్ నవ్వి - "హియర్ హియర్" అన్నాడు.

"నేను నిజం చెబుతున్నాను" అన్నాడు కుమారస్వామి.

"మిస్ మిస్టరీ అద్భుత శక్తులు - కొద్ది క్షణాల క్రితం మనం కూడా కళ్ళారా చూశాం" అన్నాడు నాయుడు.

"అందులో అద్భుత శక్తులేం లేవు. అన్నేర్పాట్లూ ఈ కుటీరంలో ఉన్నాయని నా అనుమానం. ఎవరో రికార్డు వేశారు. అది మనం మిస్ మిస్టరీ పాడుతోందనుకున్నాం. అంతా సింపుల్ హిప్నాటిజం. మనమంతా హిప్నాటిజానికి గురయ్యాం. అదెలా జరిగిందీ అన్నది నేను తేల్చేయగలను. అందుకు నాకున్న ఆధారం ఈ విచిత్ర. తెలిసో తెలియకో - ఈమెకూ మిస్ మిస్టరీకీ సంబంధ మేర్పడింది. మిస్ మిస్టరీ ఈమె రూపాన్నే తన రూపంగా ఎందు కెన్నుకుందీ అన్నది మొదట తేల్చాలి. ఈ నా ప్రశ్నకు జవాబివ్వగలవారు మనలోనే ఉన్నారని నా అనుమానం...."

"మిస్టర్ ఛోటేలాల్ - ఎవర్నువ్వు?" అన్నాడు నాయుడు.

"నే నెవరో మీకు తెలుసు. మీరెవరో నాకు తెలుసు" అన్నాడు ఛోటేలాల్ నవ్వుతూ.

"అంటే?"

"మనమంతా ఒకే గూటి పక్షులం...."

"అయితే నీకో సలహా - మన మొకరి నొకరనుమానించుకోవడం మన నాశనానికే దారి తీస్తుంది. పరస్పర విశ్వాసమే మన బలం. మిస్ మిస్టరీని నువ్వు సాధించగలవని నా నమ్మకం. మావల్ల కాని పని నీవల్లనయితే మాకు సంతోషమే. కానీ నువ్వు కుమారస్వామి ననుమా

నిస్తూ కూర్చుంటే - అది మిస్ మిస్టరీ బలాన్ని పెంచు తుంది."

"నాయుడుగారూ - మీ మాట నాకు శిరోధార్యం. మీ ఆశీర్వాద బలంతో మా వ్యవహారాలు నిలబడుతున్నాయి. ముందుకు సాగుతున్నాయి. కానీ శంకరనారాయణ హత్య మిస్‌మిస్టరీకి సాధ్యపడేది కాదు. మనలో ఎవరో నమ్మక ద్రోహం చేశారు. ఆ అవసరం కుమారస్వామికే కనబడు తోంది."

"కుమారస్వామి మిస్‌మిస్టరీ కారణంగా ఎన్నో ఇబ్బం దుల నెదుర్కొన్నాడు. ఆ మిస్‌మిస్టరీని నేనే ఏమీ చేయి లేకపోతున్నాను. అతడి ననుకుని ఏం లాభం?"

"నాయుడుగారూ — ఒక్కసారాలోచించండి. కుమార స్వామే మిస్ మిస్టరీని నడిపిస్తున్నా డనుకోండి — అప్పుడు ....?"

నాయు డులిక్కిపడ్డాడు.

అప్పుడున్నట్లుండి ముత్యాలమూర్తి నోరువిప్పాడు— "నా పరిశోధనలకో అమ్మాయి కావాలన్నప్పుడు నాదగ్గిర చేరినమ్మాయి మిస్ మిస్టరీ. ఆమె కుమారస్వామిద్వారానే నా దగ్గిరకొచ్చింది. కానీ అతడు తను పంపింది వేరే అమ్మాయిననీ—పొరపాటెలా జరిగిందో తెలియలేదనీ అన్నాడు ..."

"చూశారా?" అన్నాడు ఛోటేలాల్.

"నామీద కుట్ర జరుగుతోంది—" అన్నాడు కుమార స్వామి.

"కుట్ర చేసిందే నువ్వు" అన్నాడు ఛోటేలాల్.

"మనలో ముసలం పుట్టింది. మనకిక నాశనంతప్పదు" అన్నాడు నాయుడు నిట్టూర్చుతూ.

"నాయుడుగారూ—నేను బ్రతికుండగా మనకు నాశన ముండదు. మనం పచ్చగా ఉంటాం. ఈ వేరు పురుగును మలమల మాడ్చేద్దాం" అన్నాడు ఛోటేలాల్.

"నీకులా ఆవేశపరుణ్ణి కాదు నేను. నన్ను మాడ్చేస్తే ఈ చుట్టుపక్కల నీలాంటివాళ్ళకి మనుగడ ఉండదు. నేను వేరుపురుగును కాదు. మహావృక్షాన్ని. నాకు కొంత గడువిస్తే ఈ మిస్‌మిస్టరీ వ్యవహారం తేలుస్తాను. ఈ వ్యవహారంలో ఎవ్వరూ నాకు వేరే సాయపడనవసరం లేదు. నన్ను నమ్మితే చాలు....ఆవేశపడితే మనమంతా సర్వనాశన మవుతాం. మన మనుగడ నామీద ఆధారపడి ఉందని మర్చిపోకండి...."

"ఇంతకాలం మిస్‌మిస్టర్‌ని ఏమీ చేయలేకపోయావు—ఇప్పుడు కొత్తగా ఏం చేయగలవు!"

"ఫిల్మ తీయడం విషయంలో, ముత్యాలమూర్తిగారికి క్యాండిడేటును పంపటం విషయంలో నేనో వ్యక్తిమీద చాలావరకూ ఆధారపడ్డాను. మిస్‌మిస్టరీకి అద్భుతశక్తులు లేవనీ—ఈ విచిత్ర లాంటమ్మాయి లిద్దరున్నారనీ నీవం టూంటే — నాకిప్పుడతడిమీద అనుమానం పుట్టింది. అట్నించి నరుక్కురావాలని ఐడియా వచ్చింది...."

"సరే—నీకొంత వ్యవధినిస్తాను. నేనూ కొంత వ్యవధి తీసుకుని అమాయకురాలిలా కనబడుతున్న ఈ ఆడపిల్ల నుంచి పోలీసులుకూడా రాబట్టలేని నిజాలు రాబడ తాను" అన్నాడు ఛోటేలాల్.

విచిత్ర అందరివంకా చూస్తూంది అక్కడే నిలబడి. ఛోటేలాల్ మాటలు వినగానే ఆమె భయంగా—"నిజంగా నాకేమీ తెలియదు" అంది.

"కనీసం నీకులా ఉన్న ఆ రెండో అమ్మాయి గురించైనా నీకు తెలియాలి" అన్నాడు ఛోటేలాల్.

"నాకు తెలియదు...."

"మీ అందరిముందూ ఈమెచేత నిజం చెప్పిస్తాను" అన్నాడు ఛోటేలాల్.

"ఎలా" అన్నాడు ముత్యాలమూర్తి.

"ఈమె నిజంగా అమాయకురాలే అయితే—ఇందరి ముందు తన నగ్నసౌందర్యాన్ని ప్రదర్శించడానికి సిగ్గుపడి తీరాలి. అలాంటి పరిస్థితేర్పడితే—అప్పుడెలాంటి నిజమైనా చెప్పి తీరుతుంది. ఈమెను సృష్టించి ప్రయోగించిన వాడిక్కడ మనలోనే ఉంటే నేనిప్పుడీమెను పెట్టబోయే హింసలు కళ్ళారా చూడలేక—తనే బయటపడిపోతాడు" అన్నాడు ఛోటేలాల్.

ఇన్స్పెక్టర్ ఈశ్వర్రావు చటుక్కున లేచి నిలబడి—"చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకుంటే నేను చూస్తూ ఊరుకోలేను...." అన్నాడు.

"ఈశ్వర్రావూ — శాంతం....కూర్చో!" అన్నాడు ముత్యాలమూర్తి.

"సరే—" అని ఏదో అనబోయి ముత్యాలమూర్తి కళ్ళతో వారించటం చూసి చటుక్కున కూర్చున్నాడు ఈశ్వర్రావు.

అప్పుడు ఛోటేలాల్ తన జేబులోంచి ఓ వస్తువు తీశాడు.

ఆరంగుళాల పొడవున్న గుండ్రటి లావుపాటి కర్ర అది. అతడు దాన్ని కుడిచేత్తో పట్టుకుని ఏదో చిన్న మీట నొక్కాడు.

సర్ మని చప్పుడైంది.

ఆ కర్రలోంచీ తాచుపాములా ఎగుసుకుంటూ వచ్చిందో సన్నని తాడు.

అతడి చేతిలోని కర్ర ఆవిధంగా కొరడాగా మారింది.

"సర్కస్‌లో సింహాల నడుపుచేయగల కొరడాలను మించినదిది" అంటూ అతడు కొరడాను గాలిలో ఝుళి పించి విచిత్రవైపు తిరిగి—"ఇప్పుడు చెప్పు....ఆలస్యం చేయకు. మిస్‌మిస్టరీ ఎవరు? మీ ఇద్దరికీ సంబంధమేమిటి?" అన్నాడు.

"నాకేం తెలీదు" అంది విచిత్ర ఏడుపు గొంతులో.

అప్పుడు ఛోటేలాల్ కొరడా చెళ్ళున ఆమెను తాకింది.

కెవ్వుమంది విచిత్ర.

"కాసేపట్లో ఈ కొరడా నీ నగ్నదేహంపై నాట్యం చేస్తుంది. పరిస్థితి సంతవరకూ రానివ్వకు. చెప్పు. మిస్ మిస్టరీ ఎవరు?" అంటూ ఆమెను సమీపించి చీరకొంగు పట్టుకున్నాడు ఛోటేలాల్.

ఎంపీ నాయుడు. కుమారస్వామి, కమీషనర్ ముత్యాల మూర్తి, ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు—నిండు పేరోలగం లోని కౌరవసభలో—పెద్దల్లా ఉన్నారు.

ఛోటేలాల్ దుశ్శాసనుడిలా వికటంగా నవ్వుతున్నాడు.

విచిత్ర చీర అతడి చేతిలోకి వచ్చింది. చటుక్కున ముడుచుకునిపోయి కూర్చుందామె.

"లే—" అన్నాడు ఛోటేలాల్.

ఆమె లేవలేదు.

ఛోటేలాల్ కొరడా మరోసారి ఆమె వంటిమీద ఛెళ్ళు మంది.

లేచి నిలబడిందామె.

వంటిమీద చీరలేని ఆడదాని వంపుసొంపులు....కళాకారు

లకు ప్రేరణ కావచ్చు. కానీ దుష్టులకు....?

"చెప్పు—మిస్‌మిస్టరీ ఎవరు?"

ఆమె మాట్లాడకుండా భయం భయంగా అతడివంక చూసింది.

అతడామెను సమీపించి భుజంమీద చేయివేశాడు. అతడి చేయి బలంగా ఆమె జాకెట్టును గుంజింది.

"చెప్పు—మిస్‌మిస్టరీ ఎవరు?"

ఈశ్వర్రావేశంగా లేవబోయాడు. ముత్యాలమూర్తి అతణ్ణి భుజంతట్టి వారించాడు.

"ఊఁ చెప్పు" అంటూ అతడామె జాకెట్ చించబోయాడు.

అయితే అప్పుడే ఎవరో లాగినట్లతడిచేయి వెనక్కు వెళ్ళింది.

ఛోటేలాల్ తెల్లబోయి వెనక్కు తిరిగాడు.

అతడికి కాస్త దూరంలో మిస్‌మిస్టరీ!

ఆమె తమాషాగా నవ్వుతూ విచిత్ర పక్కకువచ్చి నిలబడింది.

విచిత్ర, మిస్‌మిస్టరీ!

ఇద్దరూ ఒకరిపక్కన ఒకరు....ఒకేలాగున యిద్దరు.

"మిస్టర్ ఛోటేలాల్....నేను మిస్‌మిస్టరీని...." అందామె.

ఆమె అక్కడ ఎప్పుడెలా ప్రవేశించిందో ఎవరూ చూడలేదు. అంతా ఆశ్చర్యంగా జరుగుతున్నది చూస్తున్నారు.

"దెబ్బకు దెయ్యం పలుకుతుంది. నువ్వొచ్చావన్నమాట" అన్నాడు ఛోటేలాల్.

"నేనొచ్చింది పలకడానిక్కాదు. విచిత్రను తీసుకు

వెళ్ళడానికి....''

"కానీ నేను నీచేత పలికిస్తాను...." అంటూ కొరడా ఎత్తాడు ఛోటేలాల్....

మిస్‌మిస్టరీ ఓ అడుగు ముందుకువేసి అతడి చేతిలోని కొరడాను లాక్కుని ఆ కొరడాతో అతణ్ణే ఛెళ్ళు ఛెళ్ళున వాయించి - "అడుగు ముందుకు వేశావంటే నీ ప్రాణం తీస్తాను...." అంది.

కుర్చీల్లో ఉన్నవాళ్ళెవ్వరూ కదలడంలేదు.

మిస్‌మిస్టరీ ఛోటేలాల్ చేతిలోంచి జారిపడ్డ చీరనుతీసి విచిత్ర కందించి - అక్కడున్న వారందర్నీ చూసి— "మీలో కురువృద్ధులు, గురువృద్ధులు ఉన్నారు. భారత కాలం నాటికీ ఇప్పటికీ మీ బుద్ధులు మారలేదు....ఇక కురుక్షేత్ర సంగ్రామం తప్పదు. ఆ యుద్ధానికీ ఈ యుద్ధానికీ ఒక్కటే తేడా! అక్కడ పాండవులైదుగురు. ఇక్కడ మిస్ మిస్టరీ ఒక్కతె! అక్కడ కౌరవుల పక్షాన అంతా నాశనమైనా పాండవుల పక్షాన కూడా ఎందరో హతులయ్యారు. ఈ యుద్ధంలో నా తరఫున ఎవ్వరూ మరణించరు. వారం రోజుల్లో మీ పునాదులు కదిలిపోతాయి. ఆ పునాదులమీద నిలబడ్డ ఎంపీనాయుడి జీవిత భవనం కుప్పలా కూలిపోతుంది...." అంది.

"ఎవరున్నవ్వు? నిన్నెవరు శాసిస్తున్నారు? మా మీద నీకు పగెందుకు?" అన్నాడు ఛోటేలాల్.

"నేనొక అపూర్వశక్తిని. ప్రకృతి ధర్మం నన్ను శాసిస్తోంది. నా కార్యక్రమం దుష్టశిక్షణ కాబట్టి దుష్టులైన వారందరిపైనా నాకు పగ ఉండడం సహజం...."అంటూ ఆమె విచిత్రను వెంటబెట్టుకుని అక్కణ్ణించి కదిలింది.

అప్పుడు ఛోటేలాల్ తన జేబులోంచి రివాల్వర్‌తీసి -

"ఆమె వెళ్ళిపోతూంటే చూస్తూ ఊరుకుంటారేం? మీ ఎవరిపద్దా ఆయుధాల్లేవా?" అన్నాడు.

కుమారస్వామి, నాయుడు, ముత్యాలమూర్తి చటుక్కున లేచి నిలబడ్డారు.

అందరి చేతుల్లోనూ రివాల్వర్లున్నాయి.

ఈశ్వర్రావు మాత్రం కుర్చీలోంచి కూడా లేవలేదు.

మిస్‌మిస్టరీ వెనక్కుతిరిగి వాళ్ళను చూసింది. చటుక్కున విచిత్రను తన వెనక్కు లాక్కుంది.

ఛోటేలాల్ ఆమె మోకాలికి గురిచూసి కాల్చాడు.

నవ్వింది మిస్‌మిస్టరీ....

వరుసగా ఒకొక్కరే ఆగకుండా ఆమెపై గుళ్ళవర్షం కురిపిస్తున్నారు.

మిస్‌మిస్టరీ నవ్వుతూ వారిని చూస్తోంది.

"గుళ్ళు లెక్కపెట్టుకున్నాను. అయిపోయాయికదూ!" అందామె చివరగా.

అంతా అసహాయంగా చూశారామెవంక.

"ఇప్పుడు నా ప్రతాపం చూడండి...." అందామె.

ఆమె నుంచి రెండు చేతులూ విడివడ్డాయి. శరవేగంతో వెళ్ళి ఒక్కొక్కరినే తాకాయి. తిరిగి వెళ్ళి ఆమె శరీరాని కతుక్కుపోయాయి. అందరూ కుప్పకూలిపోయారు.

విచిత్రను వెంటబెట్టుకుని వెళ్ళిపోయిందామె.

28

"అటుచూడు. అతడే మళ్ళీ నిన్ననుసరిస్తున్నాడు -" అంది నీలిమ.

వందన ఓరకంట అటు చూసింది.

నిజమే—మళ్ళీ చాలాకాలం తర్వాత కనిపించాడతడు.

"భయపడకు—అతడివల్ల ప్రమాదముండదు...."
అంది వందన.

స్నేహితురాళ్ళిద్దరూ విడిపోగానే అతడు వందనను సమీపించి—"బాగున్నారా?" అన్నాడు.

"మీ దయవల్ల -" అంది వందన.

"చాలా సంతోషం–" అన్నాడతడు.

"కానీ నాకు సంతోషంగాలేదు...."

"ఎందుకని?"

"మీ రెప్పుడొచ్చినా ప్రమాదాన్ని వెంటబెట్టుకుని వస్తారు...." అని నవ్వి–"అయినా ఆ ప్రమాదం నుంచి కూడా ఎలాగో మీరే రక్షిస్తారు...." అంది వందన.

"మీరన్నది నిజం. ఇప్పుడు కూడా ప్రమాదాన్ని వెంటబెట్టుకునే వచ్చాను...."

వందన కంగారుగా - "ఇంతకాలం ప్రమాదంలో పడేసి నన్ను రక్షిస్తూ వచ్చారు. ఇప్పుడు నా కోరికేమిటంటే—ప్రమాదానికి ముందే నన్ను రక్షించమని!" అంది.

"అదే కోరిక నేను మిమ్మల్నడిగితే....?" అన్నాడతడు.

"అంటే?"

"మిమ్మల్ని రెండుసార్లు రక్షించి నేను ప్రమాదంలో పడ్డాను. ఇప్పుడు ప్రమాదం మీక్కాదు - నాకు...." అన్నాడతడు.

వందన ఆశ్చర్యంగా అతడివంక చూసింది. అతడి కళ్ళలో భయం, దీనత్వం కనిపిస్తున్నాయి.

"మీరు నన్ను రక్షించాలి...." అన్నాడతడు.

"ఎలా?"

"కొన్నాళ్ళపాటు నేను మీ ఇంట్లో ఉంటాను — రహస్యంగా!"

వందన తెల్లబోయి - "అందుకు మా నాన్నగారొప్పు కోరు-" అంది.

"మీ ఇంట్లో అద్దెకున్నట్లుంటాను-" వేడుకుంటున్న ట్లన్నాడతడు.

"అద్దెకిచ్చేటంత పెద్దిల్లుకాదు మాది-" అంది వందన.

"ఎలాగో అలా నా కోసం మీ నాన్నగారి నొప్పించ లేరా?"

"ఎలా? ఏమని చెప్పను?"

"మీ కభ్యంతరం లేకపోతే - నేను మిమ్మల్ని ప్రేమి స్తున్నట్లు చెప్పండి. ప్రమాదంనుంచి బైటపడితే నేను నిజంగా మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను ..." అన్నాడు.

వందన తెల్లబోయి — "పెళ్ళి మీ యిష్టమేనా?" అంది.

అతడు తడబడి—"నేను కనబడినప్పుడల్లా మీ కళ్ళలో కనబడే మెరుపు చూసి మీరు నన్ను ప్రేమిస్తున్నా రని ఆశపడ్డాను. ఈ విషయంలో నా బలవంతమేమీ ఉండదు. కంగారుపడకండి. మీకో పెళ్ళి సంబంధం తప్పి పోయింది. అందులో నా భాధ్యత కూడా కొంతుంది. కాబట్టి మీ పెళ్ళి బాధ్యత కూడా నాపై ఉంది. ఏకంగా మీ బాధ్యత తీసుకోవాలనుకున్నా నేను—" అని ఇంకా ఏదో అనబోతూండగా—

"పక్క సందులో పార్కుంది. మీరు చెప్పదలచు కున్నదక్కడ చెబితే బాగుంటుంది—" అంది వందన.

ఇద్దరూ పార్కులోకి వెళ్ళి ఓ మూలగా ఎవరికీ కనబడ

కుండా కూర్చున్నారు.

"వందనా! ఇలా మీతో ఏకాంతంగా మాట్లాడే అవకాశం కల్పించారు. థాంక్స్! నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నా ప్రేమను మీ తలిదండ్రుల ముందు బైటపెట్టడానికో మాసంరోజులు వ్యవధి కావాలి నాకు. అప్పటికి నా ప్రమాదం ముగిసిపోవచ్చు—" అన్నాడతడు.

"మీ గురించి నాకేమీ తెలియదు. మీరేం చేస్తున్నారో, ఎక్కడుంటారో. ఎలాంటి మనిషో నాకు నాలియదు. ఆఖరికి మీ పేరు కూడా తెలియదు...."

"నిజం చెబుతున్నాను. నాకు పేరులేదు నేనొక విష వలయంలో ఉన్నాను. అందులోంచి నన్ను తప్పించబోతోంది మిస్‌మిస్టరీ. కొంతకాలంపాటు దుష్టులకు, మిస్ మిస్టరీకీ—డబుల్ ఏజంటుగా పని చేశాను. కుమారస్వామి అసలు స్వరూపం మీకు తెలుసుగదా! మిస్ మిస్టరీ అలాంటివా రెందరివో ఆటలు కట్టించబోతోంది. ఆమెకీ విషయంలో అద్భుత శక్తి సాయపడుతోంది. ఆమె విజయం సాధిస్తుందని నా నమ్మకం. కానీ ప్రస్తుతం కుమారస్వామి నన్నునమానిస్తున్నాడు మిస్ మిస్టరీ ఆచూకీ చెప్పమని ఆయన నాకొకే ఒక్కరోజు గడు విచ్చాడు. ఈలోగా నా ప్రాణాలు దక్కించుకోవాలంటే వేరే దారిలేదు. ఏ మీలాంటివాళ్ళింట్లోనో ఉండాలి. అందుకే మీ సాయమడిగాను...." అన్నా డతడు.

అతడి కథ వందనను కదిలించింది.

కానీ ఆమె మధ్యతరగతి ఆడపిల్ల!

వారిది మధ్యతరగతి ఇల్లు!

అతడిని తనింట్లో ఉంచుకుందుకు బలమైన కారణమేమి చూపించగలదు? తలిదండ్రులకు మాత్రం ఏం

చెప్పగలదు?

కుమారస్వామి తనకు చేసిన పరాభవాన్నామె తలిదం డ్రులకు కూడా చెప్పుకోలేదు.

"ఆలోచించాలి. ఒక్కరోజు గడువివ్వండి—" అంది వందన.

అతడు తన జేబులోంచి కవరొకటి తీసి ఆమె చేతి కందించి—"ఇది మీ దగ్గరుంచండి—" అన్నాడు.

కవరు బరువుగా ఉంది.

"ఏముందిందులో?"

"అది నేను వెళ్ళేక చూసుకోండి ..."

వందన మాట్లాడలేదు.

"వందనా—ఒకసారి నేను మీ చేతినందుకోవచ్చా?" అన్నాడతడు జాలిగా.

ఆమె ఆశ్చర్యంగా అతడివంక చూసింది.

అతడికామె కనులలో అంగీకారం కనబడింది. నెమ్మ దిగా ఆమె కుడిచేతిని తన రెండు చేతుల్లోకీ తీసుకుని ఆప్యాయంగా నిమిరాడు తర్వాత ఆ చేతిని తన పెదవు లతో మృదువుగా చుంబించి—"ఈ జన్మ కీ అదృష్టం చాలు...." అంటూ వదిలిపెట్టాడు.

వందనకు క్షణంపాటు తనువు పులకరించింది.

"వందనా! నువ్వు మీ యింట్లో వాళ్ళ నొప్పించగలి గితే—రేపుదయం ఎనిమిదిన్నరకు జయరాం హోటల్లో పదమూడో నెంబరు గదికి రా—" అన్నాడతడు.

వందన బదులివ్వలేదు.

అతడు లేచి నిలబడి—"సెలవు వందనా! నేను వెళ్ళేక ఓ అయిదు నిముషాలాగి—అప్పుడు వెళ్ళు నువ్వు—" అన్నాడు.

అతడు వెళ్ళిపోగానే కవరు తీసి చూసిందామె. ఆమె ఆశ్చర్యాని కంతులేదు. అందులో వందరూపాయల నోట్ల కట్టలు - అన్నీ సరికొత్తవి - మొత్తం అయిదున్నాయి. అంటే మొత్తం యాభై వేలు.

ఆ డబ్బుతోపాటు— ఓ చిన్న ఉత్తరం....

"వందనా!

"నేను బ్రతికుంటే యీ డబ్బు మనది. నేను లేకుంటే యీ డబ్బు నీ పెళ్ళికి కట్నంగా ఉపయోగించుకో.

నీ

........."

వందనకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఎలాగో అలా అతడికి తనింట్లో స్థానం కల్పించాలనుకుంది.

కాసేపట్లో ఆమె యిల్లు చేరుకుంది. అతడి గురించి ముందు తల్లికి చెప్పాలనుకుంది. ఎంత ప్రయత్నించినా ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలియలేదు.

రాత్రంతా సతమత మయింది. నిద్ర కూడా పట్ట లేదు.

మర్నాడుదయం ఆమె కాలేజీకి పెందరాళే బయల్దేరింది. దారి పొడుగునా ఆలోచన లామెను వేధిస్తున్నాయి.

ఎలాంటి సమాజంలో ఉంటోంది తను!

తన్ను రక్షించిన మనిషి ప్రమాదంలో ఉంటే— అతడిని తనింట్లో ఉంచుకునే అవకాశం లేదు.

ఈ విషయ మతడికెలా చెప్పాలి?

ఆమె జయరాం హోటలుకు చేరుకునేసరి కక్కడ

పోలీసులున్నారు.

హోటల్లో హత్య జరిగింది! శవాన్ని చూడాలని జనం ఎగబడుతున్నారు.

ఆ శవం అతడిదేనని తెలియడానికి వందన కెంతోసేపు పట్టలేదు.

వందన కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

అతడు తన చేతిని మృదువుగా చుంబించి—"ఈ జన్మకీ అదృష్టం చాలు—" అన్నాడు.

"ఎవరతడు?"

ఎంతో సున్నిత హృదయం కలిగిండి, ఎంతో మర్యాదగా ప్రవర్తించే అతడు సామాన్యమైన జీవితం గడపకుండా—విద్రోహుల విషవలయంలో యెలా చిక్కుకున్నాడు?

అతడి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నప్పటికీ-ఎందుకు తనని రక్షించాడు?

అతడు నమ్మిన మిస్ మిస్టరీ అతణ్ణి రక్షించలేక పోయిందా?

కుమారస్వామి నుంచే తనను రక్షించగలిగిన మిస్ మిస్టరీ—అతణ్ణి రక్షించలేక పోయిందా?

దేశాధినేతలు - దేశ గౌరవాన్ని కాపాడ్డం కోసం, ప్రముఖుల ప్రాణాల్ని రక్షించడం కోసం, సామాన్య ప్రజల అభివృద్ధి కోసం ఏమైనా చేయగలరు. ఎన్ని అద్భుత శక్తులైనా ప్రదర్శించగలరు. కానీ తమ సైనికుల ప్రాణాలు కాపాడలేరు!

మిస్ మిస్టరీ - కుమారస్వామివంటి వారిపై ప్రారంభించిన యుద్ధంలో అతడు సైనికుడు. ఆమె తలపెట్టిన మహాయజ్ఞంలో అతడొక సమిధ.

వందన కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అక్కణ్ణించి కాలే జీకి బయల్దేరింది. ఏమీ కాని తన గురించి అతడెందుకు శ్రమపడ్డాడో - తనకేమీ కాని అతడి కోసం తన మన సెందుకు నీరై పోతోందోనని ఆమె ఆలోచిస్తోంది.

దూరంగా ఎక్కడో - "ఎవరికి ఎవరూ ఏమవుతారో" అంటూ పాట వస్తోంది.

29

అన్ని వార్తాపత్రికలూ ఆ విశేషాన్ని మొదటి పేజీలో ప్రచురించాయి.

అది విద్రోహులకు మిస్‌మిస్టరీ హెచ్చరిక!

శంకరనారాయణ చరిత్ర ఉన్నదందులో. తానొక అద్భుత, అపూర్వ శక్తిననీ - త్వరలోనే ఒక్కొక్కరినే అంతం చేస్తాననీ - ఆమె విద్రోహులనందరినీ హెచ్చరిం చింది. తనకు భయపడి చాలామంది విద్రోహులు తమకు తామే బైటపడితే - రక్తపాతం తొలగించినట్లవుతుంది కాబట్టి - అటువంటివారందరికీ ప్రభుత్వము క్షమను ప్రక టించాలని కోరిందామె. తన శక్తి సామర్థ్యాలను విద్రో హులు అంచనా వేయడానికి వీలుగా - ఆమె పత్రికల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన విద్రోహుల కీలకస్థానాలు కొన్నింటి వివరాలను ప్రకటించి - రెండు రోజుల కొకసారి చొప్పున కీలక స్థానాలకు సంబంధించి కొత్త కొత్త వివరాలను ప్రకటిస్తూండగలనని హెచ్చ రించింది.

ఈ వార్త దేశంలో పెద్ద సంచలనం లేవదీసింది!

"ఎవరీ మిస్ మిస్టరీ?" అన్న ప్రశ్న ఒకటి కాదు - రెండు కాదు. ఎన్నో కోట్ల నోళ్ళలో నలుగుతోంది.

మిస్ మిస్టరీ కోసం పోలీసులు కూడా అన్వేషిస్తు న్నట్లు వార్తల్లో వచ్చింది.

ఆయితే ఆమె ఫోటో మాత్రం పేపర్లలో రాలేదు. అటు పోలీసులు, ఇటు విద్రోహులు - ఆమెకోసం అన్వే షిస్తున్నారు. ఎందువల్లనో ఇరు తెగలకూ కూడా ఆమె ఫోటో ప్రచారం కావడం యిష్టం లేదు. తమకు తామే ఆమెను పట్టాలి తప్ప సామాన్యుల కామె రూపు రేఖలు తెలియడం - ఇద్దరికీ యిష్టం లేదు.

రోజులు గడుస్తున్నాయి.

విద్రోహుల స్వార్ధాలు కొత్త కొత్తవి బైట పడు తున్నాయి.

దేశంలో సంచలనం రేగుతోంది.

అక్కడక్కడ రక్తపాతం కూడా మొదలయింది.

మిస్ మిస్టరీ తన లక్ష్యం సాధించగలదని వార్తలు బయల్దేరాయి. ఎందరో జర్నలిస్టు లామె విషయంలో ఊహాగానాలు ప్రారంభించారు. కొందరామె ఫోటో సంపాదించాలని విశ్వప్రయత్నాలు చేసి విఫలు లయ్యారు.

ఎవరీ మిస్ మిస్టరీ? ఎందుకిలా చేస్తోందామె?

ప్రజల్లో ఇవే ప్రశ్నలు.

రాజస్థాన్‌లో రెండు విద్రోహుల స్థావరాలు బయట పడ్డాయి. ఒక ఎమ్మెల్యే రాజీనామా చేశాడు. బీహార్లో మూడు స్థావరాలు బైటపడితే ఒక రాష్ట్ర మంత్రి రాజీ నామా చేయాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో రెండు స్థావరాలు - ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే రాజీనామా - అలాగే మద్రాసులో - అలాగే బెంగాలులో - అలాగే అన్ని రాష్ట్రాల్లో.....

విద్రోహుల స్థావరాలకూ, అవినీతిపరులకూ, రాజకీయ నాయకులకూ సంబంధ మున్నట్లు ఋజువౌతోంది. ఆ రాజకీయ నాయకుల్లో అధికార పక్షానికి చెందినవారు మాత్రమే కాదు - దేశంలోని అన్ని రాజకీయపక్షాలకు చెందినవారూ ఉన్నారు.

దేశం గగ్గోలెత్తిపోతోంది.

ప్రజల్లో కలకలం రేగుతోంది.

మిస్ మిస్టరీ....మిస్ మిస్టరీ....మిస్ మిస్టరీ....

ఏ పత్రిక చూసినా అదే పేరు....ఏ నోట విన్నా అదే పేరు....

ఎవరామె? ఎక్కడెక్కడి రహస్యాలనూ ఆమె ఎలా సేకరిస్తోంది? ఎంత కాలమైనా ఆమె ఎవరికీ పట్టుబడదేం?

మిస్ మిస్టరీ కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రాముఖ్యత పెరిగింది. ఎక్కడెక్కడి జర్నలిస్టులూ ఆంధ్ర నగరాలకు రాసాగారు. ముఖ్యంగా మిస్ మిస్టరీ ఉంటున్న నగరం....

ఇలా దేశమంతటా మిస్ మిస్టరీ ఎవరా అని సతమత మవుతూంటే - ఆమె ఎవరో తెలిసి ఆంజనేయులు, పార్వతి తమ యింట్లో గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని ఉంటున్నారు. అందరూ భయపడుతున్న మిస్ మిస్టరీ తమ యింట్లోనే ఉందని వారికి రూఢి అయింది. కానీ ఆ విషయ మెవరికి చెప్పినా ముందు తమ పని అయిపోతుం దని వా రిరువురి భయం. తమకు తెలిసిన రహస్యా న్నెవ రితోనైనా పంచుకోవాలని ఆ దంపతుల కోరిక....ఆ కోరిక తీరితే తాముందమని వారికి బెంగ....

ఆంజనేయు లింట్లో సంగతిలా ఉండగా నాయుడు తనింట్లో భార్యకు శ్రావణ్ ఉనికి గురించి చెప్పాడు.

“కుర్రాడు బాగున్నాడు. నిన్ను చూడాలనుకుంటు

న్నాడు. కానీ వాడి నిప్పుడు కలుసుకోవడం మంచిదికాదు. మిస్ మిస్టరీ నీడలా వాడిని వెంటాడుతోంది. నేను వాడికి రక్షణ ఏర్పాట్లు చూస్తున్నాను....మిస్ మిస్టరీ సమస్య సమసిపోయాక నేను వాడిని మవింటికి తీసుకొస్తాను" అన్నా డాయన.

"కోడలెలాగుందండీ?" అంది చందన కుతూహలంగా.

"చిదిమి దీపం పెట్టుకునేలాగుంది. మిస్ మిస్టరీకి వాడి ఆచూకీ యింకా తెలియలేదు. మనం వాడిని కలుసు కుందుకు మరో ప్రయత్నం చేశామంటే ఆ మిస్ మిస్టరీ వాణ్ణి పట్టేస్తుంది...." అన్నాడు నాయుడు.

చందన తన కోరిక సణచుకుంది.

ఇదిలాగుంటే అటు కుమారస్వామికీ, ఛోటేలాల్‌కూ మధ్య పూర్తి అవగాహన రాలేదు. మిస్ మిస్టరీ విష యంలో ఒకరి నొక రనుమానించుకుంటూ అంతర్యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు వారు.

ఏది ఏమైనప్పటికీ మిస్ మిస్టరీ - జాతీయ సమస్యగా మారిందనడానికి సూచనగా కేంద్ర ప్రభుత్వం ఈ విష యమై పరిష్కార మార్గాన్ని సూచించడానికి అన్ని రాజ కీయ పక్షాలనూ చర్చల కాహ్వానించింది.

సమావేశాలు న్యూఢిల్లీలో ప్రధానమంత్రి అధ్యక్షతతో ఆరంభించబడ్డాయి.

ప్రధానమంత్రి తన అధ్యక్షోపన్యాసంలో-"ఈ మిస్ మిస్టరీ యెవరో మనకెవ్వరికీ తెలియదు. కానీ మన గూఢ చారులు కూడా సాధించలేని సమాచారాన్నీమె బయటపెడు తోంది. ఈమె మానవాతీత శక్తి అన్నది భ్రమ. ఏవో విదేశీ శక్తులు తెరవెనుక నుండి యీ నాటకమాడిస్తున్నా యని నా అనుమానం. ప్రజాసేవకులమనే ప్రజానాయకు

ల్లోనూ, అసహాయులమనుకునే సామాన్య ప్రజల్లోనూ కూడా ఎంతో కొంత అవినీతి ఉండక తప్పదు. అది భరించలేని స్థాయికి చేరుకున్నప్పుడే మనం దండించాలి. మనకు నీతినియమాలే ఆదర్శం. కానీ మనిషికుండే అవధులు, పరిమితులు మనం సానుభూతితో అర్థం చేసుకోవాలి. ఇప్పటికే మిస్ మిస్టరీ కొంత అరాచకాన్ని సృష్టించింది. ఇదిలాగే కొనసాగితే దేశం అల్లకల్లోలమైపోతుంది.

ఈ పరిస్థితుల్లో మనం చేయగలిగిన దొక్కటేనని నాకు తోస్తోంది. మిస్ మిస్టరీ అవినీతిపై దాడి చేస్తున్నానంటూ దేశం పునాదులు కదల్చాలనుకుంటోంది. అవసరాన్నిబట్టి-చంబల్‌వాలీలోని నరహంతకులయిన నరరూపరాక్షసులు బందిపోట్లుగా ఉంటే—వారిని ప్రభుత్వానికి లొంగిపోతే మన్నిస్తామన్నాం. అదే విధంగా ఇప్పుడు దేశంలోని ఎక్కడెక్కడి అవినీతిపరుల్నీ లొంగిపొమ్మని అడుగుదాం. లొంగినవారందర్నీ చట్టపు పరిమితుల్లో క్షమించగలం. వీలైనంతవరకూ వారి రహస్యాలు బట్టబయలు చేయకుండా ప్రభుత్వం కాపాడుతుంది. గతం మరిచి — అవినీతి నెరుగని భావిజీవితంలోకి అడుగుపెడదాం. ఈ విషయమై మీ అందరి సూచనలూ మాకెంతో విలువైనవి, శిరోధార్యం....'' అన్నారు.

దేశానికి సంబంధించిన యీ విషమ సమస్యకు ప్రతిపక్షాలు కూడా చిత్తశుద్ధితో మూడు రోజులపాటు చర్చించాయి. ప్రధానమంత్రి ప్రతిపాదన అందరికీ అంగీకారమైంది. ఆ ప్రకారం వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్—లలో ప్రకటనలు వచ్చాయి.

ఆ ప్రకటనలు దేశంలో మరింత సంచలనం కలిగించాయి.

30

"హైస్కూలు విద్యార్థులకు ఐస్‌క్రీంలో మత్తుపదార్థాలు కలిపి అమ్ముతూ వారిని క్రమంగా మత్తుపదార్థాలకు బానిసలుగా మారుస్తున్నాను. ఈ విధంగా మూడు సంవత్సరాల్లో మూడు లక్ష లార్జించాను. నాపై పోలీసుల కనుమానం వచ్చింది. వారి బారినుంచి తప్పించుకుందుకు నేను కొందరు ప్రముఖుల నాశ్రాయించాను. నాకు పోలీసు రక్షణ లభించింది. కానీ నన్ను ప్రముఖులు స్మగ్లింగులోకి దింపారు. ఈ వ్యవహారం నుంచెలా బైటపడాలో తెలియక సతమతమౌతున్న నాకు ప్రభుత్వ ప్రకటన ఎంతో మేలు చేసింది. నేను ప్రభుత్వానికి లొంగిపోయాను. నాకు తెలిసినవన్నీ చెప్పాను. ప్రభుత్వం నా చరిత్రను రహస్యంగా ఉంచింది. ఒక సంవత్సరం జైలుశిక్ష ననుభవించి నా పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుని—తర్వాత స్వచ్ఛంద జీవితం గడుపుతాను...."

ఒక దినపత్రికలో పై విశేషం వ్రాయబడింది. ఆ విశేషం పైన ముఖం గుర్తు తెలియని ఒక ఫోటో....

ఈ విధంగా ముఖం గుర్తుతెలియని ఫోటోలతో ఎందరివో విశేషాలు ప్రచురించబడ్డాయి. వాటిలో దొంగసారా బట్టీలను నడిపేవారు, మట్కాలను నడిపించేవారు, విదేశీయులకు రహస్య సమాచారాలు చేరవేసేవారు....వగైరా వగైరా లున్నారు.

వార్తాపత్రికలన్నీ ఈ వార్తలతో నిండిపోయి వున్న సమయంలో మిస్ మిస్టరీ నిశ్శబ్దం వహించింది. పత్రికలకు ఆమెనుంచి విద్రోహుల స్థావరాలకు సంబంధిం

చిన వివరాలందడం లేదు.

"ఏమయింది మిస్ మిస్టరీ?" అన్న ప్రశ్న చాలా మందిలో తలెత్తింది.

ఆ ప్రశ్నకు సమాధానమా అన్నట్లు ఉన్నట్లుండి ఒక రోజున పత్రికా ముఖంగా ఆమెనుండి ఓ ప్రకటన వెలువడింది.

"నా కారణంగా ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. అందువల్ల ఎందరో దారితప్పిన పౌరులు సక్రమ మార్గానికి వస్తున్నారు. వారందరి వివరాలూ ప్రభుత్వం రహస్యంగా ఉంచింది. కానీ నాకు వారి వివరాలు తెలుసు. నేను తలచుకుంటే వారి వివరాలు బట్టబయలు చేయగలను. అందువల్ల ప్రభుత్వం తలపెట్టిన సత్కార్యక్రమం వృథా అయిపోవడం మినహా ప్రయోజన మేముంది? కాబట్టి నే నా పని చేయను—ఒకే ఒక్క షరతుపై! అదేమిటంటే—

మన దేశంలో స్థావరమేర్పరుచుకున్న అంతర్జాతీయ నేరస్థుడు శ్రావణ్ ముందుకు రావాలి. తన నేరాలొప్పుకోవాలి. అతడంత సులభంగా ఇందుకొప్పుకోడు కాబట్టి, అతడికి దగ్గర్లోని వారందరూ అతణ్ణి బయటపడమని ఒత్తిడి తేవాలి....ఇది జరక్కుంటే మిస్ మిస్టరీ విశ్వరూపం ధరిస్తుంది. అప్పుడు శ్రావణ్‌తోపాటు మరెందరు నాశనమౌతారో! దేశంలోని పలు విద్రోహులకిదే నా హెచ్చరిక!"

ఈ ప్రకటన అన్ని ప్రముఖ దినపత్రికల్లోనూ వరుసగా మూడు రోజులు వెలువడింది ప్రజల్లో యీ ప్రకటన చాలా కుతూహలం రేపింది.

శ్రావణ్ మిస్ మిస్టరీ హెచ్చరికను లెక్క చేస్తాడా?

లెక్కచేయకపోతే మిస్ మిస్టరీ ఏం చేస్తుంది?

అందరిలో కుతూహలం....

మిస్ మిస్టరీ ధర్మమా అని వార్తాపత్రికల అమ్మకాలు ఊహించని స్థాయికి పెరిగిపోయాయి.

మిస్ మిస్టరీ ప్రకటన వెలువడ్డ నాలుగు రోజులకు— అన్ని ప్రముఖ పత్రికల్లోనూ అదే స్థానంలో ప్రకటన వెలువడింది.

"మిస్ మిస్టరీ: నీకు నా అభినందనాలు. దేశం అల్లకల్లోలం కావడం నా కిష్టంలేదు. నేను ప్రభుత్వానికి లొంగిపోతాను. కానీ అందుకు నాకు వారంరోజులు గడువు కావాలి. కాబట్టి వారంరోజులోపికపట్టు. నీ కోరిక తీరుతుంది—శ్రావణ్."

ఈ వార్త కలిగించిన సంచలన మింతా అంతా కాదు....

"వారంరోజుల్లో అంతర్జాతీయ నేరస్థుడు శ్రావణ్ రహస్యం బట్టబయలు.........." అన్న వార్త సిబాకా గీత్‌మాలా మాటలను మించి ప్రజల నోళ్ళలో నాన సాగింది.

రానున్న ఏడురోజుల కోసం ఎన్నో కోట్ల జనం క్షణమొక యుగంగా ఎదురుచూస్తున్నారు.

31

అది నాయుడింట్లో పడకగది.

నాయుడు మంచంమీద పడుకుని ఉన్నాడు. చందన కూర్చుంది.

"చందనా!" అన్నాడు నాయుడు.

"చెప్పండి—" అంది చందన.

"మున్నా ముఖర్జీ ధర్మమా అని శ్రావణ్ మనకిక

దక్కడు—"

"ఎందుకు దక్కడు? ఎవరండీ ఆ మిస్‌మిస్టరీ? మన శ్రావణ్ ఆమె కెందుకు భయపడాలి?" అంది చందన.

"అవినీతి నీతికీ, అన్యాయం న్యాయానికీ, అధర్మం ధర్మానికీ భయపడక తప్పదు. మన శ్రావణ్ మిస్ మిస్టరీకి భయపడ్డానికి కారణమదే!"

"అవన్నీ నాకు తెలియవు. ఎలాగో అలా మీరు వాణ్ణి రక్షించి తీరాలి...."

"ప్రతి మనిషికీ సాధ్యాసాధ్యాలుంటాయి...."

"మీకు లేవు...." అంది చందన.

"ప్రభుత్వమే మిస్‌మిస్టరీ నేమీ చేయలేకపోయింది. నేను మామూలు మనిషిని...."

"మీరు మనిషికాదు. దేవుడు...." అంది చందన.

"నేను దేవుణ్ణికాదు. స్వార్థంకోసం నా భార్యను చంపుకున్న రాక్షసుణ్ణి...."

"స్వార్థం మీదికాదు, నాది...."

"చందనా?" గంభీరంగా అన్నాడు నాయుడు—"పోనీ నీ స్వార్థంకోసమే నా భార్యాబిడ్డల్ని నేను చంపుకున్నాను. కానీ ఇప్పుడదే స్వార్థంతో నీవు నీ కొడుకును బ్రతికించమంటే అది నావల్ల కాదు. నేను ప్రాణం తీయగల దేవుణ్ణి....పోయగల దేవుణ్ణికాదు...."

"ఆ పాపం నాది. అందుకు శిక్ష బ్రతికుండగానే అనుభవించాను. కన్నకొడుకు శ్రావణ్ అచ్చటా ముచ్చటా చూసుకునే యోగం నాకు లేకపోయింది. కానీ వాడు బ్రతికున్నాడు కదా అన్న ఊహ నా ప్రాణాలు నిలబెడుతోంది. కానీ యిప్పుడు...."

"నే నసహాయుణ్ణి...."

"అలాగనొద్దు. ఏదో ఒకటి చేయండి...."

నాయుడొక్క క్షణ మాలోచించి "ఒక ఉపాయ ముంది. బాగా ఆలోచించుకుని చెప్పు. నీకు నేను కావాలా! శ్రావణ్ కావాలా?" అన్నాడు.

చందన తెల్లబోయి "అంటే?" అంది.

"అరవైలో నేనున్నాను. ఇరవైలో ఉన్నాడు శ్రావణ్. అవినీతి ఊపిరిగా పెరిగిన శ్రావణ్‌కి—అనుకూల వాతావరణం ఏర్పరుస్తున్నది నేను. ఇద్దరి కిద్దరమూ దేశ ద్రోహులమే! మాలో ఒకరు మాత్రమే బ్రతికే అవకాశ ముంది. అది నీ కోరిక ప్రకారం జరుగుతుంది" అన్నాడు నాయుడు.

"అంటే?"

"నేనే శ్రావణ్‌నని అందరికీ ప్రకటిస్తాను...."

"వద్దు...." అంది చందన.

"ఎందుకని?"

"ఎంపీ నాయుడుగారంటే దేశమంతటా ఎనలేని భక్తి గౌరవాలు...."

"అనర్హుడికి గౌరవం లభిస్తే అది అశాశ్వతమే అవుతుంది...."

చందన ఉన్నట్లుండి వెక్కివెక్కి ఏడ్వటం ప్రారంభించింది.

"ఊరుకో" అన్నాడు నాయుడు.

చందన ఏదో నిర్ణయానికి వచ్చినదానిలా "అయితే మీరు శ్రావణ్‌నే బైటపెట్టండి. ఇప్పుడు నాకు వాడి ముఖ మెలాగుంటుందో తెలియదు. వాడికోసం పాతికేళ్ళుగా

సేవించుకుంటున్న మిమ్మల్ని వదిలిపెట్టలేను" అంది.

"నాదారి మళ్ళించడానికి నా జీవితంలో ప్రవేశించి— నాతో శాశ్వత బంధమేర్పరచుకున్న నీకొడుకును బైట పెట్టి నేనెలా తృప్తిపడగలను?" అన్నాడు నాయుడు.

"నాకు మీరే కావాలి. మీ తర్వాతే శ్రావణ్...."

నాయుడు సాలోచనగా—"మిస్‌మిస్టరీ సృష్టించిన ఈ సమస్యనుంచి బైటపడ్డానికి వేరు మార్గమేదైనా ఆలోచించాలి" అని "ఒక్కసారి బాబుతో మాట్లాడుతాను పిలుస్తావా?" అన్నాడు.

చందన లేచి వెళ్ళి డ్రస్సింగ్‌టేబిల్ సొరుగులోంచి ట్రాన్స్మిటర్ తెచ్చి ఆపరేట్ చేసింది.

"అమ్మా...." అందవతలి గొంతు.

"బాబూ," అంది చందన.

"అమ్మా! నా కంతిమఘడియలు సమీపించాయి...."

"బాబూ—అలాగనకు. నాన్నగారు నిన్ను రక్షిస్తారు"

"నన్నిక ఎవరూ రక్షించలేరు. మిస్‌మిస్టరీ నన్ను గుర్తించింది. కుక్కను తరిమినట్లు తరుముతోంది. ఏ క్షణంలోనైనా నేను బైటపడక తప్పదు...."

"అందుకేనా పేపర్లో ప్రకటన ఇచ్చావు!?"

"అది నేనిచ్చింది కాదు. బహుశా మిస్‌మిస్టరీయే నా తరఫున ఇచ్చి ఉంటుంది" అందవతలిగొంతు.

నాయుడు చటుక్కున భార్య చేతిలోని ట్రాన్స్మిటర్ లాక్కుని "బాబూ—ఆ ప్రకటన ఇచ్చింది మిస్‌మిస్టరీ కాదు. నేను అన్నాడు.

"నాన్నా—మీరా?" అందవతలి గొంతు.

"అవును బాబూ!"

"మీరెప్పుడూ నాతో మాట్లాడలేదు...."

"ఎలా మాట్లాడతాను? మున్నాముఖర్జీ నీకు విషం నూరిపోసి నిన్నీ స్థితికి తీసుకొచ్చాడు. నీ కన్నతండ్రి నాంచారయ్యన్నది నీ భ్రమ. నేనే నీ కన్నతండ్రిని. నిన్ను కాపాడాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాను...."

"నన్నికి మీరు కాపాడలేరు...."

"నిన్ను కాపాడ్డానికీ, మిస్‌మిస్టరీని సాధించడానికీ నేనో ఉపాయ మాలోచించాను. ఆ ప్రకారం...." అని ఆగాడు నాయుడు.

"చెప్పండి ..."

"నన్ను నేను శ్రావణ్‌గా బైటపెట్టుకోవాలనుకుంటు న్నాను—"

"ఆఁ" ఆశ్చర్యం ధ్వనించిం దా గొంతులో.

"మీ అమ్మొప్పుకోవడంలేదు. కానీ నీ నూరేళ్ళ జీవితం నిలబెట్టడాని కిదే మంచి ఉపాయం...."

"ఎంపీ నాయుడుగా దేశవిఖ్యాతి గాంచిన మీరు శ్రావణ్ అని చెప్పుకుంటానంటే భరించడాని కూహలోకూడా కష్టంగా ఉంది...."

"కానీ తప్పదు...."

"నాన్నా! ఇంకేమీ ఉపాయం లేదా?"

"ఉంది....కానీ...."

"చెప్పండి నాన్నా!"

"అందుకు ముందు నువ్వు నన్ను నమ్మాలి...."

"నాన్నా! నేను మిమ్మల్నెందుకు నమ్మను? నాంచా రయ్య గురించి మున్నా ముఖర్జీ చెప్పిందంతా అబద్ధమని అమ్మ నాకెన్నోసార్లు చెప్పింది. మీ కంటికన్పడక పోయినా నన్ను మీరు కంటికిరెప్పలా కాపాడుకుంటున్నా రంటే-మీ వాత్సల్యం తెలుస్తూనేఉంది. ఇప్పుడు నా

కోసం మీరు - నా తప్పులన్నీ మీ తలపై వేసుకుంటా నంటే నేనెలా భరించగలను? మిమ్మల్ని నేను నమ్ముతాను. ఏం చేయాలో చెప్పండి...."

"ఒకసారి నువ్వు నాకూ, అమ్మకూ కనిపించాలి...."

"నాన్నా - అదెలాసాధ్యం?"

"మనలో ఎవరు మిగుల్తారో తెలియని సమయం వచ్చింది. ఇక ఒకరి నొకరు చూసుకోకుండా ఎలా? ఒక్కసారి నిన్ను చూడాలని నా మనసు తపిస్తోంది. అమ్మ కూడా ఎంతకాలంగానో కోరుతున్న కోరికిది...."

"సరే-మీరు చూడ్డంవల్ల నేను తప్పించుకో గల్గుతానా?"

నాయుడు నిట్టూర్చి - "తప్పించుకునే ఉపాయం స్వయంగా చెబుతాను...." అన్నాడు.

"ఏమిటా ఉపాయం? ఇప్పుడు చెప్పకూడదా?"

"అది నీకుతప్ప వేరెవ్వరికీ తెలియకూడదు...."

"ఇప్పుడు మాత్రం ఎవరికైనా తెలుస్తుందా?"

"అసలు-ట్రాన్స్మిటర్ దగ్గిరున్నది నీవేనని నా కెలా తెలుస్తుంది?"

"ఓహ్-నాన్నా-మీకు అనుమానం చాలా ఎక్కువ...."

"అవును....ఇప్పుడున్న పరిస్థితలాంటిది...."

"సరే - అయితే ఒక ఉపాయం...."

చందన తండ్రీ కొడుకుల సంభాషణ శ్రద్ధగావింటోంది. ఇద్దరికిద్దరూ ఒకటే....ఒకరిపై ఒకరికనుమానం.... అందుకు వారిని తప్పు పట్టకూడదు. వారున్నపరిస్థిత లాంటిది.

తండ్రీ కొడుకులో అంగీకారానికి వచ్చారు.

ఇద్దరూ అట్టే ఊరూ పేరూ లేని ఒక పార్కులో కలుసుకుంటారు. ఏ పార్కులో కలుసుకోవాలో శ్రావణ్

సూచించాడు. అక్కడికతడు మారువేషంలో వస్తాడు. ఎర్రపంచ, నీలంచొక్కాతో - జుత్తు నెరిసిన వృద్ధుడి వేషమది....

అతడు శ్రావణ్ అవునో కాదో గుర్తించడానికి నాయుడిపద్ధతి నాయుడికుంది.

వారి సంభాషణ ముగియగానే—"ఇప్పటికే మీరు శ్రావణ్ నొకసారి చూశారుకదా!" అంది చందన.

"లేదు-" అన్నాడు నాయుడు.

"కానీ మీరు శ్రావణ్‌నీ. కోడలు సంధ్యనీ కూడా చూశానని చెప్పారు...." అంది చందన.

"చెప్పాను కానీ అది నిజంకాదు...."

"అబద్ధమెందుకు చెప్పారు?"

"నీ తృప్తికోసం! శ్రావణ్ క్షేమంగా ఉన్నాడన్న భావం నీలో కలిగించడంకోసం...."

"అయితే ఆ రోజు మీరు చూసిందెవర్ని?"

నాయుడు నిట్టూర్చి - "చెబితే భయపడతావు - " అన్నాడు.

"భయపడను - చెప్పండి...." అంది చందన.

నాయుడు సందేహిస్తూనే - "అతడు శ్రావణ్ పేరుతో అక్కడ ప్రవేశించాడు. తనే శ్రావణ్‌నని నన్ను నమ్మించాలనుకున్నాడు. అసలు శ్రావణ్‌ని బైటపెట్టి అంతు చూడాలన్నదతడి ఆశయం. అతడు బహుశా పోలీసుల మనిషై ఉండాలి. శ్రావణ్ గురించి చాలా వివరాలు తెలుసుకున్నాడు. నాకూ శ్రావణ్‌కీ ఉన్న సంబంధం గురించి కూడా అతడికి చూచాయగా తెలుసు. శ్రావణ్ పేరుతో నన్ను బలహీనపర్చి - నా నుంచి విశేషాలు రాబట్టాలనుకున్నాడు. అందుకే మన సెక్రటరీ ఉండే వీధిలోనే మరో

యింట శ్రావణ్ పేరుతో ప్రవేశించి నలుగుర్నీ ఆకర్షించాడు...." అని ఆగాడు.

"ఈ సంగతి తెలిసి మీరెందుకూరుకున్నారు?"

"ఆ శ్రావణ్ ఎవరో తెలుసా?"

"చెప్పండి...."

"చెబితే నువ్వు భయపడతావు...."

"చెప్పండి. భయపడను...." అసహనంగా అంది చందన.

"నీకు గుర్తుండే ఉండాలి. నీ వ్యామోహంలోపడి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్న నేను - నా భార్యాబిడ్డలను కారు ప్రమాదానికి గురిచేసే పథకం వేశాను. ఆ పథకం మనింటి దాసి లక్ష్మి వింది. లక్ష్మికి కమలంటే ప్రాణం. ఆమె కమలకు రానున్న ప్రమాదం గురించి ముందే హెచ్చరించింది. ఆమెను వేరేచోటకు పంపి తను కారెక్కింది. పథకం ప్రకారం నేనింట్లో లేను. డ్రైవర్‌కు కమల ఎలాగుంటుందో తెలియదు. ఇంటిముందు కారాగుతుంది. అందులో కమల ఎక్కాలి అదీ ఏర్పాటు. లక్ష్మి కమల చీరకట్టుకుని కారెక్కింది. ముఖం మీదికీ ముసుగు లాక్కుంది. ఇంట్లోకూడా అంతా ఆమె కమలే అనుకునేలా పరిస్థితి నేర్పరచింది. కారుకు యాక్సిడెంటవుతుందని డ్రైవరుకీ తెలియదు. ఆ తర్వాత లక్ష్మి, డ్రైవరు కూడా ప్రమాదంలో పోయారు...."

చందన ఆశ్చర్యంగా - "పనిమనిషి లక్ష్మి యజమానురాలు కమలకోసం తన ప్రాణాలు త్యాగం చేసిందా?" అంది.

"అవును. అదే జరిగింది. లక్ష్మి కమలనువేరే పంపేక అసలు విషయం తెలియజేసే ఉత్తరాన్నామెకు కొడుకు

అపరాధ పరిశోధన పోటీ-236

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-3-'88 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మే '88 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇక్కడ 'నరమేధం' ఆగటం లేదు—?
(పంజాబ్, ఇజ్రాయిల్)
2. దక్షిణాదిన మరో ప్రాంతీయ పార్టీ ఆవిర్భావం—?
(తమిళదేశం, కన్నడదేశం)
3. ఇండియా వీటిలో ప్రసిద్ధి—?
(లంచాలు, అధిక పన్నులు)
4. రష్యా ఇటీవల వీటిని మనకు అందజేసింది—?
(అణుజలాంతర్గాములు, అవాక్స్ విమానాలు)
5. 1986 'అర్జున అవార్డు' అందుకొన్న క్రికెట్ వీరుడు—?
(అజరుద్దీన్, రవిశాస్త్రి)

ద్వారా అందజేసింది...."

"ఎలా?"

"లక్ష్మి కొడుకు సుమారు నాలుగేళ్ళవాడు - విషయమంతా ఉత్తరంరాసి కొడుకు చొక్కా జేబులో పెట్టింది లక్ష్మి. కొడుకును కమలకే అప్పజెప్పింది. కమల కాసేపటికి లక్ష్మి కొడుకు జేబులోని ఉత్తరాన్ని గుర్తించి చదివింది. అందులో - "మీ ప్రమాదాన్ని నేను స్వీకరిస్తున్నాను. నేను బ్రతకను. మీరు బ్రతికున్నట్లు తెలిస్తే మీ భర్త మిమ్మల్ని బ్రతకనివ్వడు. మీరు అజ్ఞాతవాసం చేయండి. నా బిడ్డను మీ బిడ్డలాపెంచి గొప్పవాణ్ణి చేయండి. అది మీ బాధ్యత. ఆ బాధ్యతను నిర్వహించడానికి మీకు అజ్ఞాతం తప్పదు...." అని కోరిందామె-"

"కమలకో కూతురుండాలికదా!" అనుమానంగా అంది చందన.

"ఉండాలి. లక్ష్మి ప్రాణంలేని ఓ బొమ్మను తన కూతురిగా అభినయిస్తూ కూడా తీసుకుని వెళ్ళింది. అంతా కమల కూతురితో సహా అంతమయిందనుకున్నారు...."

"అంటే కమల బ్రతికే ఉందన్న మాట...."

"బ్రతికుండడమే కాదు. నా మీద పగను నింపుకుంది. అజ్ఞాతవాసం చేసి లక్ష్మి బిడ్డను, తన కూతురితో సమంగా పెంచి పెద్దవాణ్ని చేసింది. ఆ రోజు నేను చూసిన శ్రావణ్ లక్ష్మి కొడుకు. సంధ్య సాక్షాత్తూ నా కూతురు...."

"అయితే?"

"నిజం తెలిసి నేను నిశ్చేష్టుణ్నయిపోయాను...."

చందన తెల్లబోయినా తమాయించుకుని - "జరిగిందేదో జరిగిపోయింది. కమల నింటికి రమ్మనండి...."

శ్రీ గణేశ్ బుక్ హౌస్

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ

మా వద్ద సుప్రసిద్ధ రచయితల, రచయిత్రుల సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య, స్కూలు, కాలేజి విద్యార్థులకు కావలసిన అచ్చు పుస్తకములు, ఎక్సర్‌సైజ్ పుస్తకములు

మరియు

రామాయణం, భారతం

భాగవతం, దేవీ భాగవతం

ఇంకా

హిందీ, ఇంగ్లీషు

నవలలు లభించును.

తప్పక విచ్చేయండి!

నేడే మా కేటలాగు కొరకు వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(పాత కూరగాయల మార్కెట్ వద్ద)

రాజమండ్రి - 533 101.

అంది.

"అదిప్పుడు సాధ్యపడదు. నా జీవన విధానం కమలకు నచ్చదు. నా డబ్బంటే కమల కసహ్యం. నా కూతురు నన్ను నరనరాలా ద్వేషిస్తూంది. నాపై పగ సాధించాలనే ఆమె యిక్కడికి వచ్చింది...." అన్నాడు నాయుడు.

"అందుకేనా మీరు నా శ్రావణ్‌ని ఉపేక్షిస్తున్నారు?" అంది చందన.

"నే నెక్కడ ఉపేక్షించాను చందనా? వాణ్ణి రక్షించడం కోసం నేనిప్పుడు నా పరువు, ప్రతిష్ఠ - మొత్తమన్నీ త్యాగం చేయబోతున్నాను...."

"నేను మిమ్మల్ని నమ్మను. మీ కన్న కూతురు బ్రతికుందని తెలియగానే మీలో మోహావేశం రేగింది. మార్పు వచ్చింది. తలుచుకుంటే మీరేమైనా చేయగలరని తెలుసు నాకు....కానీ మీరు తలుచుకోవడం లేదు...."

"చందనా! నా కన్నకూతురెవరో తెలిస్తే నువ్విప్పుడిలా మాట్లాడవు...." అన్నాడు నాయుడు."

"ఎవరామె!"

"మిస్ మిస్టరీ....విచిత్ర ఆమె పేరు."

చందన కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి - "మిస్ మిస్టరీ మీ కూతురా?" అందామె. ఆ తర్వాత ఇంకా ఏదో అందామనుకుంటే నోట మాట రాలేదామెకు.

"అవును చందనా! ఆమెకు లక్ష్మి ఆత్మ అండగా నిలబడింది. కాబోయే కోడలి కోసం మమకారం నింపుకుని లక్ష్మి ఆమె చుట్టూ తిరుగుతోంది...."

చందన తేరుకుందుకు కాసేపు పట్టింది. అప్పుడామె నెమ్మదిగా - "మిస్ మిస్టరీ అసాధ్యాలను సాధ్యాలుగా ఎలా మార్చిందో నా కర్థమవుతోంది. అది లక్ష్మి ఆత్మ

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు, రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!— పత్రికలకు గ్యారంటీ!!

సాయం కాదు. మీ ప్రభావం. దేశంలో ఎదురులేని ఎంపీ నాయుడి అండ ఉండగా ఆమె తెలుసుకోలేని దేముం టుంది! చేయగలగని దేముంటుంది?" అంది.

"చాలా తెలివైనదానివి! గొప్ప విశేషమే తెలుసు కున్నావు. కానీ మిస్ మిస్టరీని ప్రోత్సహించి నేను సాధిం చిన దేమిటి? నా గొయ్యి నేనే తవ్వుకున్నాను. అంతే కదా!"

"అవును_నిజమే! అందుకే యింత కాలం నాకు మీ మీద అనుమానం రాలేదు. అసలు మీరిలా ఎందుకు చేశారు?" అంది చందన.

నాయుడు మాట్లాడ లేదు.

చందన ఆలోచిస్తూంది.

దేశంలోని ప్రముఖ నేరస్థులు కొందరికి నాయుడే ఆయువుపట్టు. వారి గురించి నాయుడికి తెలియని విశేషం లేదు. నాయుడి కదిష్టం లేదనుకుంటే ఇంత కాలం వారి నెందుకు సమర్థించాడు? ఇష్టమనుకుంటే ఇప్పుడిలా తన్ను తనే ఎందుకు నాశనం చేసుకుంటున్నాడు?

"చెప్పండి?" అంది చందన.

"చెప్పడాని కేముంది చందనా? అద్భుత వరాలు పొందిన భస్మాసురు డేమయ్యాడు? అదే గతి నాకూ పడుతోంది...."

"ఎందుకూ? అని అడుగుతున్నాను."

"నువ్వు నా దారిని మళ్ళించావు. ఫలితంగా నా భార్యా బిడ్డలను పోగొట్టుకున్నాను. నువ్వు నాకు భార్య లేని లోటును చక్కగానే తీర్చావు. కానీ నేను ప్రవేశిం చిన దారిలోంచి బైటపడలేకపోయాను. నా సంపద నా కానందాన్నివ్వడం లేదు. నా వైభోగం నాకు తృప్తి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-3-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు మే '88 నెల సంచికలో ప్రకటిస్తాము.

జనవరి'88 పోటీ ఫలితాలు

(1) జనవరి '88 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

వెంటాడే దెయ్యం!
వేటాడే బృందం!!

పంపినవారు: శ్రీ వి.యస్. రాజు, రామేశ్వరం-533006,
వయా-ఇంద్రపాలెం, తూ. గో. జిల్లా.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

వ్యథ చెందిన నారి!
వేటకుక్కల స్వారి!!

పంపినవారు: శ్రీమతి ఆర్. శ్రీజ్యోతి, W/o ఆర్.
విశ్వేశ్వరరావు, టెలిఫోన్ ఎక్స్చేంజ్, ఏలూరు-534001.

నివ్వడం లేదు. కానీ అంతర్జాతీయపరంగా నే నిరుక్కు
పోయాను. నేను బైట పడాలనుకుంటే నా ప్రాణాలు
పోతాయి తప్ప - నా వ్యవస్థ మారదు.

నావల్ల దేశానికి తీరని ద్రోహం జరుగుతోంది. దాన్ని
ఆపడ మెలాగన్నదే నా సమస్య: నాకై నేనే అంతమైతే
ఏమీ ప్రయోజనముండదు నా ద్వారా నడుస్తున్న ఓ
భయంకర వ్యవస్థను రూపు మాపేదాకా నేను చేయగలిగిం
దేమీ వుండదు. ఆ వ్యవస్థను రూపుమాపితే నాకూ మను
గడ ఉండదు. ఇది నాకు తెలుసు. అందుకే మిస్ మిస్టరీని
సృష్టించాను. నా అనుచరుల్లో భయం రేగింది. ఒకరిపై
ఒకరి కనుమానం కలిగింది. నా సాయంతో మిస్ మిస్టరీ
ఎక్కడెక్కడి రహస్యాలనూ ఛేదిస్తూంటే నేను ప్రతి
ఘటిస్తున్నట్లు నటిస్తూ వచ్చాను.

నా మీదెవరికీ అనుమానం లేదు. నన్ననుమానించే
అవకాశమూ లేదు. నా వ్యవస్థిప్పుడు పూర్తిగా దెబ్బ
తింది. మిస్ మిస్టరీ నన్ను బైటపెడితే తప్ప - ఈ
నాటకం జయప్రదం కాదు. అదే ఈ నాటకానికి చర
మాంకం. కాబట్టి నేను బైటపడక తప్పదు. శ్రావణ్‌ని
రక్షించాలనుకుంటున్నాను. వాడు నాకు సహకరిస్తే వాడి
గౌరవమూ దక్కుతుంది. నా కవమానమూ తప్పు
తుంది...."

"అందుకేం చేయాలనుకుంటున్నారు?" అంది
చందన.

"శ్రావణ్ అన్యాయాల బాధ్యత నేను స్వీకరించి
వాణ్ని రక్షిస్తాను...."

"వాణ్ని మీరు రక్షించరు. రక్షించే ఉద్దేశ్యముంటే -
శ్రావణ్ పేరులో ప్రవేశించిన ఆ లక్ష్మి కొడుకునేదో

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

విడుదలైనవి !

1. నిశాంత యద్దనపూడి సులోచనారాణి 25-00
(డైరెక్టు నవల)

2. ప్రమాదాల్లో - ప్రమదలు నవీన్ 30-00
(స్వాతి వీక్లీ సీరియల్)

3. అన్వేషణ వి. యస్. రావ్ 20-00
(ఆపన సీరియల్)

4. మానసిక సమస్యలు డా॥ ఇండ్ల
సమాధానాలు రామసుబ్బారెడ్డి 20-00

తప్పక చదవండి!

నేడే అడ్వాన్సుతో పాటు ఆర్డర్సు పంపండి.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ - 520 002.

ఒకటి చేసి ఉండేవారు. ఇలా చల్లగా కబుర్లు చెప్పరు.... హఠాత్తుగా మీకు మీ కూతురి ఉనికి తెలిసింది. కడుపు చెరువైపోయింది. మీలో మార్పొచ్చింది'' అంది చందన.

''అయితే—నీకిక అసలు విషయం చెప్పక తప్పదు'' అన్నాడు నాయుడు.

''నాకు తెలియకుండా మీరు దాచిన రహస్యాలింకా చాలా ఉన్నాయన్నమాట'' అంది చందన బాధగా. ఇన్ని సంవత్సరాలుగా కాపురం చేస్తూకూడా అతడికి పరాయిదాని గానే ఉండిపోయానన్న భావం ఆ బాధలో పలుకుతోంది.

''గుండె చిక్కబట్టుకుని విని-అసలేం జరిగిందంటే?'' నాయుడు ప్రారంభించాడు. చందన వింటోంది.

భార్యను చంపుకోవడం నాయుడికి తప్పనిసరయింది. కానీ అదతడి కిష్టంలేదు. తన పరిస్థితిని భార్యకు చెప్పు కుని ''నువ్వు నన్నేమీ చేయలేవు. నేనీ వ్యవహారాల్లో నిలువునా కూరుకుపోయాను. నన్ను బైటపెడితే నేను నాశనమైనా—నా చుట్టూ ఉన్న వ్యవస్థ నాశనంకాదు. కాబట్టి అందువల్ల నువ్వు సాధించే ప్రయోజనమేమీ ఉండదు. ఇప్పుడు నన్ను శాసించే వారు నిన్ను చంపమంటున్నారు. నేను నిన్ను చంపక తప్పదు. ఇందులో నా స్వార్థంకంటే అసహాయతే ఎక్కువ. కాబట్టి నువ్వు పారిపో. నీవాళ్ళ దగ్గరకూడా వెళ్ళకు. అజ్ఞాతవాసం చేయి. నీ జీవనో పాధికి నేనేర్పాట్లు చేస్తాను....'' అన్నాడు నాయుడు.

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page


Regd.no: H/HD-48
'+' PRABHAKAR'